ఉష్ణోగ్రత వివరాలు

కేంద్రం	గరిష్ఠం	కనిష్ఠం
నెల్లూరు	39.4	27.4
కావలి	37	27
ఆత్మకూరు	42	26
ఉదయగిరి	41	26
కందుకూరు	37	27



టెన్త్‌లో ఉత్తమ ఫలితాలు రావడంతో నగరంలోని కేఎన్‌ఆర్ మున్సిపల్ పాఠశాలలో విద్యార్థుల కోలాహలం

పదిలోనూ మెరిసి!

- ఫలితాల్లో రాష్ట్రస్థాయిలో జిల్లాకు 13వస్థానం
- 23,633 మంది విద్యార్థుల ఉత్తీర్ణత
- ఈసారీ బాలికలదే హవా!

పదవ తరగతి పరీక్షా ఫలితాల్లో రాష్ట్రంలో జిల్లా 13వ స్థానంలో నిలిచింది. గత ఏడాది జిల్లాకు 15వ స్థానం దక్కగా, ఈ ఏడాది ఫలితాల ఉత్తీర్ణతలో రెండు స్థానాలు ఎగబాకింది. అయితే గతేడాది సాధించిన 88.17 శాతం కంటే కొంత తక్కువగా 83.58 శాతం ఉత్తీర్ణత సాధించింది. ఎప్పటిలాగే ఈసారి కూడా బాలికలు తమ హవాను ప్రదర్శించారు. జిల్లాలో ఏపీ మోడల్ స్కూల్స్ 2, ఏపీఆర్ఈఐ సొసైటీ స్కూల్ 1, ఏపీఎస్‌డబ్ల్యూఆర్ఈఐ సొసైటీ స్కూల్ 1, కేజీబీవీలు 3, జిల్లా పరిషత్ 16, ప్రైవేట్ అన్‌ఎయిడెడ్ 83 కలిపి మొత్తం 106 పాఠశాలలు వందశాతం ఫలితాలు సాధించాయి.

నెల్లూరు(విద్య), ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి) : ఈ ఏడాది పదో తరగతి పరీక్షలకు 28,275 మంది రెగ్యులర్ విద్యార్థులు పరీక్షకు హాజరవగా 23,600 మంది ఉత్తీర్ణత (83.58 శాతం) సాధించారు. వీరిలో బాలురు 14,142 మందికి 11,150 మంది (81.39 శాతం), బాలికలు 14,133 మందికి 12,123 మంది (85.78 శాతం) ఉత్తీర్ణత పొందారు. బాలుర కంటే బాలికలే మెరుగైన ఫలితాలు దక్కించుకున్నారు. గత ఏడాది అనుభవాలను దృష్టిలో ఉంచుకుని విద్యాశాఖ అధికారులు, సిబ్బంది పరీక్షలను పకడ్బందీగా నిర్వహించేలా అన్ని ఏర్పాట్లు పూర్తి చేసి డీఈఓ బాలాజీరావు ఆదేశాలకు అనుగుణంగా కట్టుదిట్టం చేశారు. ఆయా యాజమాన్యాల విద్యార్థులు తమ శక్తి మేరకు విద్యా ప్రమాణాలను మెరుగుపరచడంతో గతంలో కంటే ఈ ఏడాది అత్యధికంగా ప్రథమ స్థానంలో ఉత్తీర్ణత పొందారు.

అత్యధిక మార్కులు వీరికే..

నెల్లూరు శివార్లలోని రామలింగాపురానికి చెందిన గొల్లా దీక్షితప్రియ 598 మార్కులతో అగ్రస్థానంలో నిలిచింది. అలాగే కాట్రగడ్డ కుందన వర్షిత 597, ఇన్నమూరి తన్వి 597, కంచిబొట్ల సాయి బిల్వేష్ 597, కాకులూరు భవ్యశ్రీ 597, కోవూరు విద్యార్థి పల్లంరెడ్డి ఇందుప్రియారెడ్డి 597, నెల్లూరు నగరంలోని బండ్ల రోహన్ వరుణ్ 597, సాయా చరణి 596, కొత్తపాటి జీతు 596, వాకా ప్రలేఖ్యరెడ్డి 596 అత్యధిక మార్కులు సాధించారు.

మేనేజ్‌మెంట్ల వారీగా ఫలితాలు

మేనేజ్‌మెంట్	విద్యార్థులు	ఉత్తీర్ణత	ఫెయిల్	శాతం
ఏపీ మోడల్	774	707	67	91.34
ఏపీబీసీ వెల్ఫేర్	110	106	4	96.36
ఏపీఆర్ఐఈ సొసైటీ	261	248	13	95.02
ఏపీఎస్‌డబ్ల్యుఆర్ఈఐ	642	590	52	91.09
ఏపీటీడబ్ల్యుఆర్ఈఐ	256	188	68	73.44
కేజీబీవీలు	428	394	34	92.06
మునిసిపాలిటీ	1708	1147	561	67.15
ఎయిడెడ్	405	230	175	56.79
ప్రభుత్వ	879	551	328	62.68
ట్రైబల్ ఆశ్రమం	60	58	2	96.97
జడ్పీ	10,071	7,414	2,657	73.62
ప్రైవేట్‌అన్‌ఎయిడెడ్	12,681	2,000	681	94.63
మొత్తం	28,275	23,633	4,642	83.58

● ప్రభుత్వ మేనేజ్‌మెంట్లలో..

నెల్లూరులోని బీవీనగర్ మునిసిపల్ కార్పొరేషన్ ఉన్నత పాఠశాల విద్యార్థిని సాయా చరణి 596, కృష్ణానగర్ జడ్పీ హైస్కూల్‌కు చెందిన మల్లెల పూజిత 595, నవాబుపేట బీవీఎస్ఎం బాలికోన్నత పాఠశాలకు చెందిన దోనపర్తి సుచరిత 594, బీవీనగర్ మునిసిపల్ ఉన్నత పాఠశాలకు చెందిన కీర్తిపాటి హిమవర్షిణి 594, నవలాకులతోట జడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన మహ్మద్ జువేరియా 594, నవాబుపేట బీవీఎస్ మునిసిపల్ బాలికోన్నత పాఠశాలకు చెందిన పోతురాజు జస్సికాషారోన్ 593, బీవీనగర్ మునిసిపల్ ఉన్నత పాఠశాలకు చెందిన దువ్వూరు స్నిగ్ధ 593, నవాబుపేట ఎంపిఎల్‌సీ ఉన్నత పాఠశాలకు చెందిన కండే సూర్య 593 మార్కులు సాధించారు.

● పదోతరగతి ఫలితాల్లో గత ఏడాది 20,201 మంది ప్రథమస్థానం సాధించగా ఈ ఏడాది 19,745 మంది ప్రథమ స్థానం దక్కించుకున్నారు. అలాగే 2,622 మంది ద్వితీయ, 1,266 మందికి తృతీయ స్థానాలు దక్కాయి. 500-550 మార్కులలోపు 5,047 మంది, 551-560 లోపు 1,085 మంది, 561-570 లోపు 1,098 మంది, 571-580 లోపు 1,058 మంది, 581-590 లోపు 858, 591-600 లోపు 260 మంది కలిపి 9,406 మంది ఉత్తమ మార్కులు సాధించారు. అలాగే ఏపీఎంఎస్‌లో 212 మంది, ఏపీబీఎస్ వెల్ఫేర్స్‌లో 58మంది, ఏపీఆర్ఈఐ సొసైటీలో 100మంది, ఏపీఎస్‌డబ్ల్యూఆర్‌లో 189 మంది, ఏపీటీడబ్ల్యుఆర్‌లో 18 మంది, ట్రైబల్ ఆశ్రమంలలో ఆరుగురు, కేజీబీవీల్లో 96 మంది, జడ్పీలో 1,392 మంది, మున్సిపాలిటీల్లో 294 మంది, ఎయిడెడ్‌లో 21 మంది, ప్రభుత్వ పాఠశాలల్లో 87 మంది, ప్రైవేట్ అన్‌ఎయిడెడ్‌లో 6,933 మంది కలిపి మొత్తం 9,406 మంది విద్యార్థులు 500లకుపైగా మార్కులు సాధించారు.

● రీకౌంటింగ్-రీవెరిఫికేషన్‌కు సూచనలు

పదోతరగతి పబ్లిక్ పరీక్షలకు హాజరైన విద్యార్థులు తమ జవాబుపత్రాల రీకౌంటింగ్ కోసం దరఖాస్తు చేసుకునేవారు ఈనెల 24 నుంచి మే 1వతేదీ రాత్రి 11 గంటల వరకు దరఖాస్తు చేసుకోవచ్చని అధికారులు తెలిపారు. రీకౌంటింగ్ ఒక్కో సబ్జెక్ట్‌కు రూ.500, జవాబు పత్రాల రీ వెరిఫికేషన్ కోసం ప్రతి సబ్జెక్ట్‌కు రూ.1000లను చెల్లించాలన్నారు. మరిన్ని వివరాలకు జిల్లా పరీక్షల విభాగం కార్యాలయం, సంబంధిత పాఠశాలల్లో సంప్రదించాలని తెలిపారు.

● మే 19 నుంచి సప్లిమెంటరీ

పదోతరగతి అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షలను మే 19 నుంచి 26వ తేదీ వరకు నిర్వహిస్తున్నట్లు డీఈఓ బాలాజీరావు తెలిపారు. అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులు సంబంధిత పాఠశాల ప్రధానోపాధ్యాయులకు ఏప్రిల్ 24 నుంచి 30వతేదీలోగా ఎలాంటి అపరాధ రుసుం ఫీజులు చెల్లించాలన్నారు. అలాగే రూ.50 అపరాధ రుసుముతో మే 1 నుంచి 5వతేదీ వరకు పరీక్ష ఫీజు చెల్లించవచ్చన్నారు. సప్లిమెంటరీ పరీక్షలకు మూడు సబ్జెక్ట్‌లకు రూ.110, మూడు సబ్జెక్ట్‌లకుపైన రూ.125 ఫీజు చెల్లించాలన్నారు. మరిన్ని వివరాలు పాఠశాలల్లో హెచ్ఎంలను సంప్రదించాలని తెలిపారు.

హాస్టల్ విద్యార్థుల ఘనత

నెల్లూరు (హరనాథపురం) : పదో తరగతి పరీక్షా ఫలితాల్లో సాంఘిక, బీసీ సంక్షేమ వసతి గృహాలు, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ గురుకులాల విద్యార్థులు అత్యుత్తమ మార్కులు సాధించారు. బీసీ సంక్షేమ వసతి గృహాల్లో 551 మందికి 473 మంది ఉత్తీర్ణత సాధించారు. వింజమూరు బీసీ వసతి గృహ విద్యార్థిని పి.వైదిక్ 584, ఆత్మకూరులో షేక్.సల్మా 583, లింగసముద్రంలో సాయిమేఘన 581, కందుకూరులో యశస్విని 576, అనంతసాగరంలో ఈవీ.నిషాల్‌రెడ్డి 573 మార్కులు సాధించారు.

● సాంఘిక సంక్షేమ వసతి గృహాల్లో మొత్తం 402 మందికి 322 మంది ఉత్తీర్ణులయ్యారు. వింజమూరులో ఏ.నందిని 574, లింగసముద్రంలో కె.పృథ్వి 571, ఉలవపాడులో ఎన్.కాజోల్ లక్ష్మి అగర్వాల్ 568, ఎం.సంధ్యారాణి 557, ఆత్మకూరులో ఎం.సాయిధనుష్ 565 మార్కులు సాధించారు.

● డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకులాల్లో 642 మందికి 590 మంది ఉత్తీర్ణత సాధించారు. పెద్దపవనిలో ఎస్.కవిత 593 మార్కులు సాధించింది.

సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా రాణిస్తా



నగరంలోని ఏసీ నగర్‌కు చెందిన తాను తల్లిదండ్రులు రాధ, గోపాల్ సహకారం, ఉపాధ్యాయులు అందించిన ఉత్తమ బోధనతోనే ఈ ఫలితాలను సాధించాను. అందరి ఆశయాలకు అనుగుణంగా భవిష్యత్‌లో విద్యలో మరింత ఉత్తమంగా రాణించి సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా రాణిస్తాను.

- ఓ.దీక్షిత, 598 మార్కులు

సివిల్స్ సాధించడమే లక్ష్యం



నగరంలోని బీవీనగర్‌లో నా తల్లిదండ్రులు వసంతకుమారి, శివకుమార్ అందించిన ప్రోత్సాహం, గురువులు అందించిన ఉత్తమ విద్యా ప్రమాణాలతోనే ఈ ఫలితాలు సాధించాను. భవిష్యత్‌లో సివిల్స్ సాధించేందుకు మరింత కష్టపడి చదువులో రాణిస్తాను.

- సాయా చరణి, 596 మార్కులు

ఐఐటీలో సీటు సాధిస్తా



గురువులు అందించిన విద్య, తల్లిదండ్రులు సుధా మాధురి, మాధవన్ అందించిన ప్రోత్సాహంతోనే టెన్త్‌లో ఉత్తమ ఫలితాలు సాధించాను. ఇదే స్ఫూర్తితో భవిష్యత్‌లో ఉత్తమ ప్రతిభతో రాణించి ఐఐటీలో సీటు సాధిస్తాను.

- ఎం.నారాయణ్, 595 మార్కులు

ప్రభుత్వ సెక్టార్‌లో ఉండేందుకే..



తల్లిదండ్రులు, గురువుల సహకారంతోనే 596 మార్కుల సాధించాను. భవిష్యత్తులోనూ ఉన్నత చదువులు పూర్తి చేసి, సివిల్స్‌కు ఎంపికవుతా. ప్రజలకు సేవలందించేందుకు ప్రభుత్వ సెక్టార్‌లో మంచి ఉద్యోగం సాధిస్తాను.

- ఎస్‌కే అఫ్రిన్‌తాజ్, 596 మార్కులు, చేజర్ల

ఇంజనీరింగ్ ధ్యేయం



మాది కొడవలూరు మండలం గుండాలమ్మపాళెం. సాధారణ రైతు కటుంబంలో జన్మించిన నేను తల్లిదండ్రుల ఆకాంక్ష నెరవేరేలా ఉన్నత విద్యా సంస్థల్లో ఉన్నత విద్య చదివి ప్రయోజకురాలిని కావాలన్నదే నా లక్ష్యం. ఐఐటీలో ఇంజనీరింగ్ సీటు సాధించడమే ధ్యేయం. ఉపాధ్యాయులు, కుటుంబ సభ్యుల ప్రోత్సాహంతోనే ఈ మార్కులు సాధించాను.

- ఇందూప్రియారెడ్డి, 597 మార్కులు

సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ అవుతా..



ఐఐటీ బీటెక్ చేసి సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ కావాలన్నదే నా లక్ష్యం. ఇంటర్‌లో ఎంపీసీ చదివి ఆ తర్వాత ఐఐటీలో బీటెక్ చేసి సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ అవుతా.

- మండలపు లిఖిత, 595 మార్కులు

కేజీబీవీలో ఉత్తమ ఫలితాలు

కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయాల విద్యార్థినులు ఉత్తమ ఫలితాలు సాధించారని ఎస్ఎస్ఏ ఏపీసీ వెంకటసుబ్బయ్య తెలిపారు. జిల్లాలోని 12 కేజీబీవీల్లో 428 మంది విద్యార్థిలు పరీక్షలకు హాజరవగా 394 మంది ఉత్తీర్ణత సాధించారన్నారు. వలేటివారిపాళెంలో జి.వైష్ణవి 573, లింగసముద్రంలో ఎం.అమృతప్రియ 569, కలిగిరిలో పి.మహిమ 567 మార్కులు సాధించారన్నారు. 96 మంది 500లకుపైగా మార్కులు సాధించినట్లు తెలిపారు. జీసీడీఓ టి.మమత, ప్రిన్సిపాళ్లతోపాటు విద్యార్థినులను ఆయన అభినందించారు.



'కన్నవారన్నా.. తోబుట్టువులన్నా ఆయనకు ప్రాణం. అందుకేనేమో వృద్ధాప్యంలో తల్లిదండ్రులను వీడలేక అమెరికాలో ఉన్నత కొలువును కూడా కాదనుకున్నాడు. బెంగళూరులో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తున్నా వారంలో మూడు రోజులు తల్లిదండ్రులతో ఉంటూ వారి బాగోగులు చూసుకోవడమే కాదు.. తండ్రి వ్యాపార లావాదేవీలు చూసేవారు. ఇక భార్య పిల్లలతోనూ ఎంతో ఆప్యాయంగా ఉండే ఆయన ఉగ్రదాడికి బలయ్యాడు. కశ్మీర్‌లో మంగళవారం ఉగ్రవాదులు జరిపిన కాల్పుల్లో కావలికి చెందిన మధుసూదన్‌రావు మృతి చెందారు. ఈ విషయం బుధవారం వెలుగులోకి రావడంతో ఇరు కుటుంబాలు తీవ్ర శోకసంద్రంలో మునిగిపోయాయి. బిడ్డ మృతి విషయం తెలిస్తే ఆ వృద్ధ దంపతులు ఏమవుతారేమోనన్న భయంతో వారికి తెలియకుండా లోలోన కుమిలిపోతూ ఉబికి వస్తున్న కన్నీళ్లను దాచుకుంటూ గడుపుతున్నారు.

ఉగ్రతూటా కల్లోలం



మధుసూదన్‌రావు (ఫైల్)

- కశ్మీర్ ఘటనలో కావలివాసి దుర్మరణం
- కన్నీరు మున్నీరుగా విలపిస్తున్న బంధువులు
- తల్లిదండ్రులకు తెలుపకుండా జాగ్రత్తలు
- వివరాలు సేకరించిన అధికారులు, పోలీసులు
- మధుసూదన్ మృతదేహం కోసం చెన్నై వెళ్లిన తహసీల్దారు

కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న తహసీల్దార్ శ్రావణ్‌కుమార్





మధుసూదన్‌రావు ఇంటి వద్ద పోలీసుల బందోబస్తు

కావలి, కావలి రూరల్, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని మేదరబజార్‌లో అరటికాయల వ్యాపారం చేస్తున్న సోమిశెట్టి తిరుపాల్, పద్మావతి దంపతులకు ఓ కుమారుడు మధుసూదన్‌రావు, ఇద్దరు కుమార్తె విజయలక్ష్మి, మంజుల ఉండగా, అందరికీ పెళ్లిళ్లు అయ్యాయి. బీటెక్ పూర్తి చేసిన మధుసూధన్‌రావు (42) బెంగళూరులోని ఐబీఎం కంపెనీలో సీనియర్ ఆర్కిటెక్‌గా పని చేస్తున్నారు. తల్లిదండ్రులతోపాటు తోబుట్టువులతోనూ ఎంతో ఆప్యాయంగా ఉండేవాడని బంధువులు తెలిపారు. టీసీఎస్‌లో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ నెల్లూరుకు చెందిన ప్రసన్నకామాక్షితో వివాహం కాగా వీరికి మేథశ్రీ (16), దత్తసాయి (11) పిల్లలు ఉన్నారు. బెంగళూరులోని రామ్మూర్తినగర్, కమ్మనహల్లిలో సొంతిల్లు నిర్మించుకుని స్థిరపడ్డారు. మధుసూదన్‌రావు తోబుట్టువులు కూడా సాఫ్ట్‌వేర్ ఉద్యోగులుగా బెంగళూరులోనే ఉంటున్నారు.

● కన్నవారి కోసం అమెరికాకు వెళ్లకుండా..

ఉద్యోగ రీత్యా మధుసూదన్‌రావు కొంతకాలం అమెరికాలో ఉన్నారు. అయితే కరోనా సమయంలో భారత్‌కు వచ్చిన ఆయన తల్లిదండ్రుల బాగోగులు చూసేందుకు అమెరికాకు వెళ్లకుండా బెంగళూరులోనే స్థిరపడ్డారు. వారానికి మూడు రోజులు మాత్రమే బెంగళూరులో ఉంటూ మిగిలిన సమయంలో కావలిలో తల్లిదండ్రుల వద్ద ఉంటూ వారి యోగ క్షేమాలు చూస్తుంటారు.

● కుటుంబానికి చేదోడుగా

తండ్రి తిరుపాల్‌కు గుండె శస్త్రచికిత్స, తల్లి పద్మావతికి అనారోగ్యం కారణంగా తరచూ మధుసూదన్‌రావు కావలికి వచ్చేవారు. తల్లిదండ్రుల యోగక్షేమాలతోపాటు అరటికాయల వ్యాపార లావాదేవీలు చూసేవారు. ఈ క్రమంలో తల్లిదండ్రులను వైద్యశాలలో చూపించి ఈ నెల 18వ తేదీన తిరిగి బెంగళూరుకు వెళ్లిన మధుసూదన్‌రావు 20వ తేదీ రాత్రి కుటుంబంతో కలసి కశ్మీర్ విహారయాత్రకు వెళ్లారు.

● అధికారులకు సహకారం

అన్న మృతి వార్త తెలిసిన చెల్లెళ్లు విజయలక్ష్మి, మంజుల హుటాహుటిన బుధవారం ఉదయానికల్లా కావలి చేరుకున్నారు. తల్లిదండ్రులు హృద్రోగులు కావడంతో అన్న మృతి వార్త తెలపకుండా గాయపడినట్లు చెబుతూ వచ్చారు. ఇంట్లో టీవీ, ఫోన్లు బంద్ చేసి తల్లిదండ్రులకు అనుమానం రాకుండా బాధను దిగమింగుతూ లోలోన కుమిలి పోయారు. ఇంటికి ఎవరినీ రానివ్వకుండా చూడాలని పోలీసులను కోరడంతో వీధికి అడ్డంగా బారికేడ్లు పెట్టారు. కావలి సీఐ ఫిరోజ్, మున్సిపల్ కమిషనర్ జీ. శ్రావణ్ కుమార్ మధుసూదన్ ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులు, బంధువులతో మాట్లాడారు. తహసీల్దారు శ్రావణ్ కుమార్ మృతుడి బంధువుల నుంచి వివరాలు సేకరించారు. కావలి ఆర్డీవో ఎం సన్నీ వంశీకృష్ణ సూచనలతో వైద్యులను ఏర్పాటు చేశారు. ప్రత్యేక విమానంలో చెన్నై వస్తున్న మధుసూదన్ రావు మృతదేహన్ని కావలి చేర్చేందుకు తహసీల్దారు చెన్నై వెళ్లారు. గురువారం తెల్లవారుజామున మృతదేహన్ని కావలికి తీసుకురానున్నారు.



భార్య ప్రసన్నకామాక్షి, పిల్లలు మేథశ్రీ, దత్తసాయిలతో మధుసూదన్‌రావు

కాంగ్రెస్, జనసేన కొవ్వొత్తుల ప్రదర్శన



గాంధీబొమ్మ వద్ద కొవ్వొత్తులతో నిరసన తెలుపుతున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు

నెల్లూరు (వైద్యం) : జమ్మూ కశ్మీర్‌లోని ప్రహల్గామ్‌లో పర్యాటకులపై ఉగ్రవాదుల కాల్పులను నిరసిస్తూ బుధవారం సాయంత్రం నెల్లూరులోని గాంధీబొమ్మ కూడలిలో కాంగ్రెస్, జనసేన పార్టీల నాయకులు వేర్వేరుగా కొవ్వొత్తులతో నిరసన చేపట్టారు. ఉగ్రవాదులను వెంటనే పట్టుకుని తుదముట్టించాలంటూ కాంగ్రెస్ నాయకులు నినాదాలు చేశారు. ఈ నిరసనలో కాంగ్రెస్ నగర ఉపాధ్యక్షుడు సంజయ్‌కుమార్, నగర ప్రధాన కార్యదర్శి సుధీర్, నాయకులు ఇర్ఫాన్, అల్లాఉద్దీన్, మల్లిఖార్జునరెడ్డి, రెహమాన్, ధనుంజయ్, సుజాత, బక్షు, నదీమ్, ముస్తాక్, వెంకటేశ్వరరెడ్డి, హనీఫ్, అమీర్, లక్ష్మి, చాన్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

● **నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట) :** నగరంలోని ఆ పార్టీ జిల్లా, నగర కార్యాలయాల్లో జనసేన జెండాను అవనతం చేశారు. అనంతరం సాయంత్రం గాంధీబొమ్మ వద్ద కొవ్వొత్తులతో నిరసన తెలిపి ఉగ్రవాదుల దాడిలో మృతిచెందిన అమాయకులకు నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ నాయకులు నూనె మల్లికార్జున యాదవ్, గునుకుల కిషోర్, దుగ్గిశెట్టి సుజయ్‌బాబు, సుందర్‌రామిరెడ్డి, జమీర్, శ్రీరామ్, కృష్ణారెడ్డి, రవి, కొట్టెవెంకటేశ్వర్లు, చప్పిడి శ్రీనివాసులురెడ్డి, శనివారపు అజయ్‌బాబు, రాము తదితరులు పాల్గొన్నారు.

భానుడి భగభగలు

వడగాడ్పులతో ప్రజల బెంబేలు

నిర్మానుష్యంగా ప్రధాన కూడళ్లు, రోడ్లు

నెల్లూరు, (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో ఎండలు మండిపోతున్నాయి. వారం రోజుల్లో 4 రోజులపాటు 40 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదయ్యింది. ఉదయం 8 నుంచే ఎండ తీవ్రత ఎక్కువగా కనిపిస్తోంది. మధ్యాహ్నం 2 నుంచి 4 గంటల వరకు రహదారులు, ప్రధాన కూడళ్లలో జనసంచారం తగ్గిపోయింది. సముద్ర తీర ప్రాంతాలైన నెల్లూరు రెవెన్యూ డివిజన్ పరిధిలో అప్పడప్పుడు చల్లటి గాలి వీస్తున్న కారణంగా ఉక్కపోత తక్కువగా కనిపిస్తోంది. మెట్ట ప్రాంతమైన ఆత్మకూరు డివిజన్‌లో ఎండ తీవ్రత చాలా ఎక్కువగా కనిపిస్తోంది. వేడి గాలులకు ప్రజలు, మూగజీవాలు అల్లాడిపోతున్నాయి. గత ఏడాది వేసవి కాలంలో నెల్లూరు జిల్లాలో అత్యధికంగా 44 డిగ్రీల వరకు ఉష్ణోగ్రత నమోదయ్యింది. అయితే ఈ సంవత్సరం ఇప్పటి వరకు అత్యధికంగా 40 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదయ్యింది.

ఇంటర్ Bi.P.C విద్యార్థులకు సువర్ణావకాశం...

BOLLINENI COLLEGE OF NURSING

Approved by Indian Nursing Council, New Delhi.

ధనలక్ష్మీపురం, నెల్లూరు. 9866881342 / 9177619655

B.Sc. NURSING 2024-25 అడ్మిషన్లు

కోర్సు వ్యవధిలో మీరు ఫీజు చెల్లించనవసరం లేదు.

కోర్సు పూర్తయిన తర్వాత ఉద్యోగ అవకాశం కల్పిస్తాము.

మీ జీతంలో నుంచి వాయిదాల పద్ధతిలో ఫీజును చెల్లించుకొనవచ్చును.

For A.Y. 2023-24 Inter (Bi.P.C) pass out Students last chance to admit AY 2024-25

Website : www.bollinenicollegeofnursing.com

Last Date 26.04.2025 Limited Seats!

● 8.25 acars Greenish Campus ● Highly Qualified Faculty

నేడు ఇస్కఫ్ జిల్లా మహాసభలు

ఉదయగిరి రూరల్, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): నెల్లూరులో ఈనెల 24వ తేదీన ఇస్కఫ్ జిల్లా మహాసభలు నిర్వహించనున్నట్లు సంఘం రాష్ట్ర కార్యదర్శి వీ రామచంద్రమూర్తి తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ సభలకు ముఖ్య అతిథులుగా రాజకీయ, సామాజిక విశ్లేషకులు నర్రా శ్రీధర్, అంతర్జాతీయ కవి పీ రామకృష్ణ పాల్గొంటారన్నారు. ఉగాది పురస్కార గ్రహీతలను ఘనంగా సన్మానించడం జరుగుతుందన్నారు.

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)	
ఒక గ్రాము ధర	రూ.9306
వెండి కిలో ధర	రూ. 99,500
వెండి ఒక గ్రాము	రూ.102.50

పశుగ్రాసం కొరతతో మూగజీవాల విలవిల

- వరిగడ్డి ధరకు రెక్కలు
- ఇతర ప్రాంతాల నుంచి కొనుగోలు

ఉదయగిరి, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): పెరుగుతున్న ఎండలతో మూగ జీవాలకు పశుగ్రాసం, నీరు కరువైంది. వేసవిలో గేదెలు, ఆవులు, మేకలు, గొర్రెలను కాపాడుకోలేక సగానికి సగం అమ్ముకోవాల్సిన పరిస్థితి దాపురించింది. బయటి ప్రాంతాల నుంచి ఎండుగడ్డిని కొనుగోలు చేయాల్సిన దుస్థితి వచ్చింది. దీంతో పశుపోషణ రైతులకు తలకు మించిన భారంగా మారింది. మెట్ట ప్రాంతమైన ఉదయగిరి నియోజకవర్గంలో వ్యవసాయం తరువాత ప్రధాన జీవనాధారం పాడి పరిశ్రమే. వర్షాభావం ధాటికి పొలాలు బీళ్లుగా మారడంతో ఎక్కడా పచ్చిక దొరికే పరిస్థితి లేదు. ట్రాక్టర్ గడ్డి ధర ఖర్చులతో కలిపి ప్రస్తుతం రూ.15 వేలు పలుకుతోంది. ఈ పరిస్థితుల్లో కొనే పరిస్థితి లేక మెట్ట రైతులకు పశు పోషణ భారంగా మారింది. ఏడాదికి ఆరేడునెలలు పాలిచ్చే గేదెలు మూడు, నాలుగు నెలలకే



ఇతర ప్రాంతాల నుంచి ట్రాక్టర్‌లో తీసుకువస్తున్న వరిగడ్డి

ఎండిపోతున్నాయని పోషకులు వాపోతున్నారు. కొంతమంది రైతులు అప్పులు చేసి డెల్టా ప్రాంతాలైన బుచ్చి, సంగం, సోమశిల తదితర ప్రాంతాలకు వెళ్లి గడ్డి తెచ్చుకుని పశువులను కాపాడుకుంటున్నారు. మరోవైపు పచ్చిగడ్డి కనుచూపు మేరలో కానరాకపోవడం, పాల దిగుబడిపై ప్రభావం చూపుతుండడంతో రైతుల అవస్థలు వర్ణనాతీతంగా మారాయి. ఇక గొర్రెలు, మేకల యజమానులు నీరు, పచ్చిక దొరికే ప్రాంతాలకు వలస వెళుతున్నారు. ప్రభుత్వం పాడి రైతులకు పశుగ్రాసం, దాణా ఉచితంగా పంపిణీ చేయాలని పలువురు కోరుతున్నారు.

నేరాల నియంత్రణకు ప్రత్యేక నిఘా

- రఘునాథ్, ఎస్ఐ



వరికుంటపాడు (ఉదయగిరి రూరల్), ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): మండలంలో నేరాల నియంత్రణకు ప్రత్యేక నిఘా ఏర్పాటుచేసి తమవంతు చర్యలు చేపడుతున్నట్లు ఎస్ఐ రఘునాథ్ తెలిపారు.

? వరుస చోరీలపై ఎలాంటి చర్యలు చేపడుతున్నారు.

! ఇటీవల పలు గ్రామాల్లో వరుస చోరీలు జరిగిన మాట వాస్తవమే. వాటి నియంత్రణకు సిబ్బంది ద్వారా ప్రత్యేక నిఘా ఏర్పాటుచేసి ప్రజలను అప్రమత్తం చేస్తున్నాం.

? ప్రమాదాల నివారణకు ఏమి చర్యలు చేపడుతున్నారు.

! జాతీయ రహదారిపై జరుగుతున్న ప్రమాదాలలో కొంతమంది ప్రాణాలు కోల్పోతుండగా, మరి కొంతమంది గాయాలపాలవుతున్నారు. అతివేగం, అవగాహన లోపంతో జరుగుతున్న ప్రమాదాలపై ర్యాలీలు, హెల్మెట్ వాడకంపై నిరంతరం సదస్సులు ఏర్పాటు చేస్తున్నాం.

? చట్టాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారా.

! చోరీలు, అత్యాచారాలు, మాదక ద్రవ్యాల వాడకం నిషేధం వంటి అంశాలపై యువత, ప్రజలు, గ్రామాల్లో అవగాహన కల్పిస్తున్నాం. చట్టాల గురించి సమగ్రంగా వివరించి శాంతి భద్రతలను కాపాడేందుకు కృషి చేస్తున్నాం.

న్యూస్ బాక్స్

రేపటి నుంచి మండల పూజా మహోత్సవాలు

ఉదయగిరి రూరల్, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గండిపాళెం జలాశయ సమీపంలో నూతనంగా నిర్మించిన గంగమ్మతల్లి ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠ చేపట్టి నలభై రోజులు పూర్తయిన సందర్భంగా ఈనెల 25 నుంచి మండలి పూజా మహోత్సవాలు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్, మాజీ ఎంపీటీసీ సభ్యుడు పాముల రమణయ్య తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ తొలిరోజు జల్దిస్నానం, గ్రామోత్సవం, 26న గంగమానుకు ఆడపడుచుల ఆనకట్ట, ముద్దలపోలు, 27న పొంగళ్లు నిర్వహించడం జరుగుతుందన్నారు. భక్తుల సౌకర్యార్థం మూడు రోజుల పాటు అన్నప్రసాద వితరణ, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందన్నారు. కావున భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని మహోత్సవాలను విజయవంతం చేయాలని కోరారు.

పెళ్లికానుక అందజేత



పెళ్లి కుమార్తెకు నగదు అందజేస్తున్న మండల టీడీపీ కన్వీనర్ బయ్యన్న

ఉదయగిరి, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కృష్ణంపల్లి బీసీ కాలనీకి చెందిన పేరుబోయిన నాగేశ్వరరావు, బాలచెన్నమ్మల కుమార్తె శిరీష వివాహం సందర్భంగా ఎమ్మెల్యే కాకర్ల సురేష్ ఆదేశాల మేరకు కాకర్ల ట్రస్టు ఆధ్వర్యంలో బుధవారం మండల టీడీపీ కన్వీనర్ చింతనబోయిన బయ్యన్న రూ.10 వేలు పెళ్లి కానుక అందజేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ బొజ్జా నరసింహాలు, ఉప్పుటూరి పెద వెంకటయ్య, సుబ్బారెడ్డి, రామ్మోహన్, సుబ్బరాయుడు, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

పదోతరగతి పరీక్షల్లో ప్రభుత్వ పాఠశాలల్లో ఉత్తమ ఫలితాలు

ఆత్మకూరు, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): పదోతరగతి పరీక్షల్లో నియోజకవర్గంలో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు కార్పొరేట్ పాఠశాలలకు ధీటుగా ఉత్తీర్ణత సాధించి ప్రతిభను చాటుకున్నారు. ఆత్మకూరు మండలంలోని 13 ప్రభుత్వ, 9 ప్రైవేట్ పాఠశాలల్లో 827 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 726 మంది పాసై 87.79 శాతం ఉత్తీర్ణతను సాధించినట్లు ఎంఈవో అనంతలక్ష్మీ తెలిపారు. ఆత్మకూరు పట్టణంలోని ప్రభుత్వ బాలికల గురుకుల పాఠశాల విద్యార్థిని కామినేని పూజిత 590 మార్కులు సాధించినట్లు ప్రిన్సిపాల్ టి కామేశ్వరి తెలిపారు. ఆత్మకూరు పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 76 శాతం ఉత్తీర్ణత సాధించగా, ప్రభుత్వ బాలికోన్నత పాఠశాలలో 83 శాతం ఉత్తీర్ణత సాధించారు. బట్టేపాడు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఆవుల అజిత్ 582 మార్కులు సాధించారని ప్రధానోపాధ్యాయుడు ఈ పెంచలయ్య తెలిపారు. ఆత్మకూరు వెస్ స్కూల్, అప్పారావుపాళెం ప్రభుత్వ ఉన్నత పాఠశాల, చెర్లోయడవల్లి, కరటంపాడు, ఎల్ఆర్‌పల్లి, మహిమలూరు, మురగళ్ల, పేరారెడ్డిపల్లి, మురగళలోని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు మంచి మార్కులు సాధించి ప్రతిభను చాటుకున్నారన్నారు.

●సంగం: పదవ తరగతి పరీక్షల్లో మండలంలోని ప్రభుత్వ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించారని డిప్యూటీ డీఈవో, ఎంఈవో జానకిరామయ్య తెలిపారు. సంగం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థిని స్వర్ణభారతి 584 మార్కులు సాధించిందన్నారు. పాఠశాలకు చెందిన 104కి 74 మంది ఉత్తీరులై 71 శాతం ఉత్తీర్ణత సాధించారు. తరుణవాయి జడ్పీహెచ్ఎస్‌లో 88 శాతం, కొరిమెర్లలో 84 శాతం, గాంధీజనసంఘం 79 శాతం, దువ్వూరు పాఠశాలలో 76 శాతం, అన్నారెడ్డిపాళెంలో 52 శాతం, మర్రిపాడులో 77 శాతం, బాలికల గురుకుల పాఠశాలలో 89 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు తెలిపారు.

● చేజర్ల: పదో తరగతి ఫలితాలలో చేజర్ల మండలంలోని గ్రామీణ ప్రాంత విద్యార్థులు సత్తా చాటారు. ఏకంగా మండలంలో ఏడుగురు 590కి పైగా మార్కులు సాధించారు. మండలంలో మొత్తం 361 మంది విద్యార్థులు



ఆత్మకూరులోని ప్రభుత్వ బాలికల గురుకుల పాఠశాల విద్యార్థిని పూజితను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ కామేశ్వరి

పరీక్షకు హాజరుకాగా 306 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. చేజర్లలోని లుంబిని విద్యాలయానికి చెందిన ఎస్‌కె అఫ్రీన్‌తాజ్ 596 మార్కులు, యు అనుషా 594 మార్కులు, ఎమ్ లహరి 594 మార్కులు, వివిఎస్. చరణ్‌రెడ్డి 593 మార్కులు, పి.ప్రణతి 592 మార్కులు, పి.ఇందుప్రియ 591 మార్కులు సాధించగా, మాముడూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన టి.చందన లక్ష్మి 592 మార్కులు సాధించారు. అత్యుత్తమ ప్రతిభ కనపరిచిన విద్యార్థులను పలువురు అభినందించారు.

●అనంతసాగరం: మండలంలో 14 ఉన్నత పాఠశాలలు ఉండగా 433 మంది పదవ తరగతి పరీక్షలకు హాజరయ్యారు. ఇందులో 360 మంది పాసై 83.14 శాతం ఉత్తీర్ణత సాధించారు. కాగా, స్థానిక శాంతినికేతన్‌లో బీ లహరి 589 మార్కులు సాధించి మండల టాపర్‌గా నిలవడంతో మండల విద్యాశాఖాధికారులు పద్మనాభం, ప్రభాకర్‌రెడ్డిలు అభినందించారు. కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ గోలి ప్రభాకర్ పాల్గొన్నారు.

● ఏఎస్ పేట : పదవ తరగతి పరీక్ష ఫలితాలలో శ్రీకోలను హైస్కూల్‌లో 100శాతం ఉత్తీర్ణత సాధించడంతో పాటు సీహెచ్ వైష్ణవి 589 మార్కులతో మండల టాపర్‌గా నిలిచింది. గుడిపాడు హైస్కూల్ విద్యార్థులు 100 శాతం ఉత్తీర్ణత సాధించారు.

●ఉదయగిరి: మండలంలో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు పదవ తరగతి పరీక్షా ఫలితాల్లో 74 శాతం



అనంతసాగరం: మండల టాపర్ లహరిని అభినందిస్తున్న ఎంఈవోలు

ఉత్తీర్ణత సాధించినట్లు ఎంఈవో షేక్ మస్తాన్‌వలి ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ పరీక్షలకు మొత్తం 368 మంది విద్యార్థులు హాజరు కాగా 273 మంది ఉత్తీర్ణత సాధించారన్నారు.

●దుత్తలూరు: మండలంలో పదో తరగతి పరీక్షా ఫలితాల్లో 92.06 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు ఎంఈవో వెంగయ్య బుధవారం తెలిపారు. ఈ పరీక్షలకు మొత్తం 378 మంది విద్యార్థులు హాజరు కాగా 348 మంది ఉత్తీర్ణత సాధించారన్నారు.

● వరికుంటపాడు(ఉదయగిరి రూరల్) : మండలంలో పదవ తరగతి ఫలితాల్లో 74.58 శాతం ఉత్తీర్ణత సాధించారు. ఎనిమిది ఉన్నత పాఠశాలలకు చెందిన 236 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 176 మంది ఉత్తీర్ణత సాధించారు. అందులో భాగంగా విరువూరు పాఠశాలకు చెందిన గుబిలి తరుణ్‌తేజ 586 మార్కులు సాధించి మండల ప్రథమ స్థానంలో నిలిచారు. ఈ సందర్భంగా అధికారులు, ఉపాధ్యాయులు విద్యార్థులను అభినందించారు.

● సీతారామపురం: మండలంలోని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు 10వ తరగతి పరీక్షా ఫలితాల్లో ప్రతిభ చూపి 82 శాతం ఉత్తీర్ణత సాధించారు. అయ్యవారిపల్లి జడ్పీ హైస్కూల్‌కు చెందిన సంగసాని గురుహాసిని 579 మార్కులు సాధించి ప్రథమ స్థానంలో నిలిచారు. డి ప్రవీణ్ 583 మార్కులు సాధించారు.

ఎస్సీ వర్గీకరణపై ఎమ్మార్పీఎస్ సంబరాలు



మంద కృష్ణమాదిగ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు

ఉదయగిరి, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణ అమలు చేయడంపై బుధవారం ఉదయగిరి పంచాయతీ బస్టాండ్ సెంటర్‌లో ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో జెండాను ఆవిష్కరించి బాణసంచా పేల్చి మిఠాయిలు పంచి సంబరాలు చేపట్టారు. అనంతరం ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సీ, ఎస్టీ, బీసీ సేవాసమితి రాష్ట్ర అధ్యక్షుడు కాకి శ్రీనివాసులు విలేఖరులతో మాట్లాడుతూ ప్రధాని నరేంద్రమోదీ, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఎస్సీ వర్గీకరణ అమలుకు చొరవ చూపడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు బకీరు జామవా, బెజవాడ బాలగురవయ్య, గడ్డం రాజా, ఇత్తడి రమణ, గురవయ్య, సురేష్ పాల్గొన్నారు.

భార్యపై భర్త హత్యాయత్నం

సైదాపురం, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): భార్యపై అనుమానంతో భర్త హత్యా యత్నానికి పాల్పడిన ఘటనపై బుధవారం రాత్రి పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం మేరకు.. కలిచేడు గ్రామా నికి చెందిన ఊటుకూరు విష్ణు, ప్రసన్న భార్యాభర్తలు. వీరిమధ్య కుటుంబ కలహాలు ఉన్నాయి. ఈనేపథ్యంలో మంగళవారం రాత్రి భార్య ప్రసన్నపై అనుమానంతో భర్త విష్ణు విచక్షణారహితంగా బ్లేడుతో దాడి చేసి తీవ్రంగా గాయపరిచి హత్యాయత్నానికి పాల్పడ్డాడు. గాయపడిన ప్రసన్న నెల్లూరులోని ఓ ప్రయివేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతోంది. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ కాంతికుమార్ తెలిపారు.

కశ్మీరు మృతులకు ఘన నివాళి

కలువాయి, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): కశ్మీరు లోయలో ఉగ్రవాదుల కాల్పుల్లో మృతిచెందిన భారత పౌరులకు కలువాయి మండల జనసేన పార్టీ ఆధ్వర్యంలో బుధవారం రాత్రి కొవ్వొత్తులతో నివాళులర్పించారు. జనసేన శ్రేణులంతా కొవ్వొత్తులు వెలిగించి చేత పట్టుకుని ర్యాలీ నిర్వహించారు. మృతుల కుటుంబాలకు సంతాపం తెలిపారు. జనసేన పార్టీ మండల కన్వీనర్ పెరంకొండ మనోహర్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు.



కలువాయిలో జనసేన పార్టీ ఆధ్వర్యంలో కశ్మీరు మృతులకు నివాళులర్పిస్తున్న నాయకులు, కార్యకర్తలు.

గ్రామాల్లో తాగునీటి ఎద్దడి నివారించాలి : ఎంపీపీ

ఆత్మకూరు, ఏప్రిల్ 23 (ఆంధ్ర జ్యోతి): మండలంలోని అన్ని గ్రామాల్లో వేసవిలో తాగునీటి ఎద్దడి నివారించాలని మండలాధ్యక్షుడు కేతా వేణుగోపాల్‌రెడ్డి సూచించారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయ సమావేశ మందిరంలో బుధవారం మండల సర్వ సభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లోని ముఖ్య ప్రదేశాల్లో చలివేంద్రాలు ఏర్పాటు చేయాలని సూచించారు. అసంపూర్తిగా ఉన్న గృహ నిర్మాణాలు పూర్తయ్యేలా ప్రజా ప్రతి నిధులు, అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు. పలువురు ప్రజాప్రతినిధులు తమ గ్రామాల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల ఉపాధ్యక్షుడు యు పెంచలరావు, ఎంపీడీవో పి ఐజాక్‌ప్రవీణ్, ఏవో కె శ్రీనివాసరావు, ఈవో పీఆర్డీ వి డేవిడ్, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, పలు శాఖల అధికారులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

సోమశిలలో 51.486 టీఎంసీల నీరు నిల్వ

అనంతసాగరం, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): సోమశిల జలాశయం పూర్తి సామర్థ్యం 77.988 టీఎంసీలు కాగా బుధవారం నాటికి 51.486 టీఎసీంలు నిల్వ ఉన్నట్లు అధికారులు తెలిపారు. ఉత్తర కాలువకు 200, దక్షిణ కాలువకు 50, డెల్టాకు 30 క్యూసెక్కులు సరఫరా చేస్తున్నారు.

రైతుల రుణ బకాయిలు వసూలు చేయాలి

సంగం, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): సంగం ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం (సొసైటీ)లో రైతులు తీసుకున్న దీర్ఘ, స్వల్పకాల రుణాలను వసూలు చేయాలని జిల్లా సహకార సంఘం అధికారి గురప్ప సిబ్బందిని ఆదేశించారు. బుధవారం ఆయన స్థానిక పీఏసీఎస్‌ను తనిఖీ చేశారు. ఇటీవల సొసైటీ తరపున కొనుగోలు చేసిన ధాన్యం, సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పెట్రోల్ బంకు లావాదేవీలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు తీసుకున్న రుణ బకాయిలను వసూలు చేసి కొత్త రుణాలు ఇవ్వాలని సొసైటీ సీఈవో దస్తగిరిని ఆదేశించారు. మండలంలో సాగయ్యే ఎడగారు పంటకు ఎరువులు విక్రయాలకు సిద్ధంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.



రికార్డులు తనిఖీ చేస్తున్న గురప్ప

టీడీపీ కార్యకర్తకు సీఎం రిలీఫ్ ఫండ్ మంజూరు

సంగం, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జండాదిబ్బకు చెందిన టీడీపీ కార్యకర్త దోర్నాదుల సురేష్‌కు ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి రూ. 8 లక్షల ఆర్థిక సాయం అందింది. ఆమేరకు బుధవారం సురేష్ కుటుంబ సభ్యులకు ఉత్తర్వులు అందాయి. దోర్నాదుల సురేష్ రోడ్డు ప్రమాదానికి గురై నెల్లూరు వైద్యశాలలో చికిత్స పొందుతున్నాడు. పేద కుటుంబం కావడంతో వైద్యం కోసం ఆర్థిక సాయం అందచేయాలని సురేష్ కుటుంబం ఆనం కైవల్యారెడ్డిని కోరారు. దీంతో ఆమె దోర్నాదుల సురేష్ పరిస్థితిని మంత్రి ఆనం రామనారాయణరెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. ఆయన స్పందించి సురేష్ కుటుంబానికి సీఎంఆర్ఎఫ్ నుంచి రూ. 8 లక్షలు మంజూరు చేయించారు. ఆమేరకు చెక్కును ఆనం కైవల్యారెడ్డి బాధితుని కుటుంబ సభ్యులకు అందచేశారు.





పోక్సో కేసులపై దృష్టి పెట్టండి

- రౌడీషీటర్ల కదలికలపై నిరంతర నిఘా ఉంచాలి
- ఏపీఎస్పీ బెటాలియన్ ఐజీ రాజాకుమారి

నెల్లూరు (క్రైం), ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి) : చిన్నపిల్లలు, మహిళలకు సంబంధించిన ఫిర్యాదులపై అలసత్వం ప్రదర్శించవద్దని, పోక్సో కేసులపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఏపీఎస్పీ బెటాలియన్ ఐజీ రాజాకుమారి జిల్లా పోలీసు అధికారులను ఆదేశించారు. బుధవారం నగరంలోని ఉమేష్‌చంద్ర కాన్ఫరెన్స్ హాల్‌లో ఎస్పీ జి కృష్ణకాంత్ నెలవారీ నేర సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశాన్ని జూమ్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఐజీ రాజకుమారి పర్యవేక్షించారు. జిల్లాలో చోటుచేసుకున్న గ్రేవ్, నాన్ గ్రేవ్, ఆస్తి సంబంధిత నేరాలలో రికవరీల గురించి స్టేషన్ల వారీగా అధికారులతో ఐజీ సమీక్షించారు. నేరాల ఛేదనకు సాంకేతికతను అందిపుచ్చుకొనేందుకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఐజీ మాట్లాడుతూ పోలీసు స్టేషన్లలో నమోదయ్యే కేసుల వివరాలను క్షుణ్ణంగా సీసీటీఎన్ఎస్‌లో ఎప్పటికప్పుడు పొందుపరచాలన్నారు. విలేజ్ విజిట్ తప్పకుండా చేయడం ద్వారా రాబోయే సమస్యలను అరికట్టవచ్చని సూచించారు. వేసవిలో దొంగతనాలు, అసాంఘిక కార్యకలాపాల నివారణపై ప్రజలకు అవగాహన కల్పించాలని, విజుబుల్ పోలీసింగ్, డ్రోన్ సర్వైలెన్స్ విరివిగా చేయాలని ఆదేశించారు. రౌడీషీటర్ల కదలికలు, కార్యకలాపాలపై నిరంతరం నిఘా ఉంచాలని, తప్పించుకుని తిరుగుతున్న నిందితులను వెంటనే అరెస్ట్ చేసి వారిపై ఉన్న నాన్ బెయిలబుల్ వారెంట్లు అమలు చేయాలని ఆదేశించారు. రాత్రి పూట అన్ని పోలీసుస్టేషన్లలో గస్తీలు ముమ్మరం చేసి అనుమానితుల వేలిముద్రలు సేకరించాలని సూచించారు. అనంతరం ఎస్పీ ఈగల్ టీమ్ ప్లకార్డులను ఆవిష్కరించారు. సమీక్షలో అదనపు ఎస్పీ సీహెచ్ సౌజన్య, లీగల్ అడ్వైజర్ శ్రీనివాసులురెడ్డి, డీఎస్పీలు, సీఐలు, ఎస్ఐ పాల్గొన్నారు.

డిగ్రీ ఫెయిల్ అయ్యానని బలవన్మరణం

నెల్లూరు(క్రైం), ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): డిగ్రీ ఫెయిల్ అయ్యానని మనస్తాపానికి గురైన ఓ యువకుడు ఆత్మహత్యాయత్నానికి పాల్పడి, వైద్యశాలలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. పోలీసుల కథనం మేరకు, నగరంలోని హరనాథపురానికి చెందిన పవన్‌కుమార్‌రెడ్డి(22) డిగ్రీ పరీక్షల్లో ఫెయిల్ అయ్యాడు. దీంతో మనస్తాపానికి గురై గతనెల 31న గడ్డిమందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. చెన్నైలోని ఓ వైద్యశాలలో చికిత్స పొందుతూ మంగళవారం నెల్లూరు లోని ఓ ప్రైవేటు వైద్యశాలకు మార్చారు. వైద్యశాలలో చేరిన కొద్దిసేపటికే మృతిచెందాడు. ఈ మేరకు మృతుడి తండ్రి రవీంద్రరెడ్డి బుధవారం బాలాజీనగర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు మృతదేహాన్ని పరిశీలించి పోస్టుమార్టం నిమిత్తం జీజీహెచ్‌కి తరలించారు. ఎస్ఐ పుల్లారెడ్డి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పెన్నాలో గుర్తుతెలియని మృతదేహం

నెల్లూరు(క్రైం), ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి) : పెన్నానదిలో గుర్తుతెలియనివ్యక్తి మృతదేహం బుధవారం తేలాడుతూ కన్పించింది. దీంతో స్థానికులు వీఆర్‌వో నరేంద్రబాబుకు సమాచారం అందించారు. ఆయన సంతపేట పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసుల సంఘటనా స్థలానికి చేరుకొని స్థానికుల సహకారంతో మృతదేహాన్ని వెలికితీశారు. మృతుడు సుమారు 40 నుంచి 45 ఏళ్లలోపు వయసు కలిగి, ఎరుపు రంగు ప్యాంటు, బులుగు, బిస్కెట్ రంగు పూల డిజైన్ చొక్కా ధరించి ఉన్నాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జీజీహెచ్‌కి తరలించారు. సంతపేట హెడ్‌కానిస్టేబుల్ ఎన్. ఏడుకొండలు ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ప్రాణం తీసిన ఈత సరదా

- ఇంజనీరింగ్ విద్యార్థి మృతి

కొడవలూరు, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): మండలంలోని రేగడిచెలిక గ్రామంలోని ఓ బావిలో ఈత కొడుతూ అనంతపురం జిల్లా కళ్యాణదుర్గంకు చెందిన ఇంజనీరింగ్ విద్యార్థి మృతి చెందిన ఘటన బుధవారం జరిగింది. వివరాల మేరకు.. నార్తురాజుపాలెం గ్రామంలోని ఓ కళాశాలలో చదువుతున్న కర్బర్ అంజనకుమార్(21) తన మిత్రులు మరో ఐదుగురితో కలసి రేగడిచెలికలో బావిలో ఈత కొట్టేందుకు వెళ్లారు. బావిలో ఈత కొడుతున్న సమయంలో అంజన కుమార్‌కు నీటిలో మునిగి ఊపిరాడక మృతి చెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని వెలికితీయించారు. ఎస్ఐ నరేష్ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నెల్లూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

యువతి ఆత్మహత్య

కొడవలూరు, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): మండలంలోని నార్తురాజుపాలెంలోని ఓ కర్మాగారంలో పనిచేస్తున్న ఛత్తీస్‌గఢ్‌కు చెందిన సునీత యాలం (21) పరిశ్రమ పరిసర ప్రాంతంలో బుధవారం ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. పరిశీలించిన పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నెల్లూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ఈ మేరకు అనుమానాస్పద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ నరేష్ తెలిపారు.

అనుమానాస్పద వ్యక్తుల పట్టివేత

పొదలకూరు, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చిట్టేపల్లిలోని తిప్ప వద్ద అనుమానాస్పదంగా సంచరిస్తున్న ఇద్దరు మహిళలు, ఒక వ్యక్తిని బుధవారం సాయంత్రం గ్రామస్థులు పట్టుకున్నారు. కావలి, నెల్లూరుకు చెందిన సుహాసిని, రత్తాలు యూపీకి చెందిన రాజేంద్రసింగ్ అనే మరొక వ్యక్తిని తీసుకుని ఆటోలో చిట్టేపల్లి వద్దకు చేరుకున్నారు. అక్కడ తిప్పపై అనుమానాస్పదంగా తిరుగుతుండగా గ్రామస్థులు గమనించి పట్టుకున్నారు. వీరి వద్ద ఉన్న బ్యాగులు తెరిచి చూడగా అందులో చైనా కత్తులు, చిన్నపాటి గునపాలు, తాళాలు ఉండటాన్ని గమనించారు. ఈ సందర్భంగా నిందితులు మాట్లాడుతూ తాము దొంగలము కాదని.. రంగురాళ్ల ఏరుకునేందుకు వచ్చామని చెబుతున్నారు. వీరిని గ్రామస్థులు పోలీసులకు అప్పగించారు.

విద్యుదాఘాతంతో యువకుడికి తీవ్ర గాయాలు

మనుబోలు, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మడమనూరు గ్రామ సమీపంలో ఉన్న ఓ పరిశ్రమలో బుధవారం ముజాయిద్దీన్ అనే యువకుడు విద్యుదాఘాతానికి గురై తీవ్రంగా గాయపడ్డాడు. వివరాలిలా ఉన్నాయి. మడమనూరు గ్రామానికి చెందిన షేక్ ముజాయిద్దీన్ ఆరునెలలుగా పరిశ్రమలో ఎలక్ట్రీషియన్‌గా పని చేస్తున్నాడు. ఈనేపథ్యంలో పరిశ్రమలో పనిచేస్తుండగా మెయిన్ లైన్ నుంచి విద్యుత్ సరఫరా రావడంతో ముజాయిద్దీన్ విద్యుదాఘాతానికి గురై గాయపడినట్లు స్థానికులు తెలిపారు. చికిత్స నిమిత్తం అతన్ని నెల్లూరుకు తరలించగా పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు తెలిపారన్నారు.

నిందితుడి కోసం గాలింపు

సంగం, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): గత నాలుగు సంవత్సరాల నుంచి కోర్టు కేసుకు హాజరు కాకుండా గైర్హాజరవుతున్న నిందితుడు పోలిశెట్టి వెంకటేశ్వర్లు ఆచూకీ తెలిస్తే పోలీస్‌స్టేషన్‌కు తెలియజేయాలని ఎస్ఐ రాజేష్ తెలిపారు. సంగం సాయి నగర్ కాలనీకి చెందిన పోలిశెట్టి వెంకటేశ్వర్లు 2017లో ఓ కేసులో నిందితుడు. కోర్టులో కేసు విచారణ జరుగుతుండగా నిందితుడు హాజరుకావడం లేదు. నాలుగు సంవత్సరాల నుంచి గైర్హాజరవుతున్నాడు. దీంతో సంగం పోలీసులు నిందితుడు పోలిశెట్టి వెంకటేశ్వర్లు ఆచూకీ కోసం గాలిస్తున్నారు. అందులో భాగంగా కనిపించడం లేదని, ఆచూకీ తెలిస్తే పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందించాలని నిందితుడి ఫోటో సమాచారం పలు చోట్ల వాల్ పోస్టర్లు అంటించారు.

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో (రూ.లలో)
బాయిలర్ లైవ్	106
స్కిన్ చికెన్	194
స్కిన్‌లెస్	214

కోడిగుడ్ల ధర (100): 420

కశ్మీర్‌లో ఉగ్ర దాడి హేయం : ఎమ్మెల్యే

కావలి, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): జమ్మూ కశ్మీర్‌లోని పహల్గామ్‌లో జరిగిన ఉగ్రవాద దాడి హేయమైన చర్య అని కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకట కృష్ణారెడ్డి ఓ ప్రకటనలో ఖండించారు. ఇటువంటి కిరాతక చర్యలు భారత ప్రజల సమైక్యతను, ధైర్యాన్ని ఎన్నటికీ దెబ్బతీయలేవని పేర్కొన్నారు. ఈ దాడికి బాధ్యత వహిస్తున్న ఉగ్రవాద సంస్థలపై కఠిన చర్యలు తీసుకోవాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను కోరారు. ఈ ఉగ్రవాద దాడిలో కావలికి చెందిన సోమిశెట్టి మధుసూదన్‌రావు ప్రాణాలు కోల్పోవడం బాధాకరమని పేర్కొన్నారు. మృతుడి ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తూ ఈ క్లిష్ట సమయంలో వారి కుటుంబ సభ్యులకు తన సానుభూతిని వ్యక్తం చేశారు. గురువారం కావలిలో జరిగే అంత్యక్రియల్లో తాను పాల్గొంటానని, కావలి ప్రజలు కూడా పాల్గొని ఆ కుటుంబానికి మనోధైర్యం కల్పించాలని తెలిపారు.

న్యూస్ బాక్స్

అన్నపుగుంటలో పూడికతీత పనుల ప్రారంభం



పూడికతీతకు సిద్ధం చేసిన ఎక్స్‌కవేటర్, ఆయిల్ ఇంజన్లు

కావలి, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని వైకుంఠపురంలో ఉన్న అన్నపుగుంటలో పూడికతీత పనులను బుధవారం కావలి మున్సిపల్ కమిషనర్ జీ.శ్రావణ్‌కుమార్ ప్రారంభించారు. అన్నపుగుంటలో మురుగు నీరు నిల్వ ఉంటున్నందున ఆ ప్రాంతంలోని బావులు, బోర్లలో మంచినీరు కలుషితమవుతుందని ఇటీవల ఆ ప్రాంత ప్రజలు కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకటకృష్ణారెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై స్పందించిన ఎమ్మెల్యే ఈ విషయం జిల్లా కలెక్టర్ ఆనంద్ దృష్టికి తీసుకెళ్లి పూడికతీత పనులకు రూ.20 లక్షలు మంజూరు చేయించారు. దీంతో ఆ నిధులతో అన్నపుగుంటలో పూడికతీత పనులకు శ్రీకారం చుట్టారు. అక్కడ ఉన్న మురుగు నీరు బయటకు తోలేందుకు అవసరమైన ఆయిల్ ఇంజన్లు ఏర్పాటు చేసి పూడిక తీసేందుకు ఎక్స్‌కవేటర్‌ను ఏర్పాటు చేసి పనులు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్‌తో పాటు డీఈ సాయికుమార్, టీడీపీ నాయకుడు దామా మాల్యాద్రి తదితరులు పాల్గొన్నారు.

పుస్తక పఠనంతోనే వ్యక్తి సమగ్ర వికాసం సాధ్యం

కావలిటౌన్, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): వ్యక్తి సమగ్ర వికాసం పుస్తక పఠనంతోనే సాధ్యమని జేబీ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ సుబ్రహ్మణ్యంనాయుడు పేర్కొన్నారు. ప్రపంచ పుస్తక దినోత్సవం సందర్భంగా బుధవారం జేబీ టాంపో గ్రంథాలయంలో గ్రంథాలయాధికారి వెంకట్రావు అధ్యక్షతన జరిగిన సదస్సులో ప్రిన్సిపాల్ పాల్గొని మాట్లాడుతూ సాంకేతిక పరిజ్ఞానం ఎంత పెరిగినా పుస్తక పఠన పరిజ్ఞానం మూలమన్నారు. వీఎస్‌యు కళాశాల గ్రంథాలయాధికారి పాపయ్య మాట్లాడుతూ మనో వికాసానికి వ్యక్తిత్వ వికాసానిని పుస్తకాన్ని మించిన ప్రత్యామ్నాయం మరొకటి లేదన్నారు. జూనియర్ కళాశాల గ్రంథాలయాధికారి కె బ్రహ్మానందం, నర్సింగ్ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ భాగ్యలక్ష్మి, అధ్యాపకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

అందుబాటులో పచ్చిరొట్ట ఎరువులు

ఉలవపాడు, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి) : వేసవి కాలంలో మట్టి నమూనా, పండ్ల తోటల్లో పచ్చి రొట్ట ఎరువుల వినియోగంపై బుధవారం మన్నేటికోట గ్రామంలో రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించినట్లు మండల వ్యవసాయ అధికారిణి తిరుమల జ్యోతి తెలిపారు. జనము, జీలుగా, పిల్లిపెసర 50 శాతం రాయితీతో ప్రస్తుతం రైతులకు అందుబాటులో ఉన్నట్లు పేర్కొన్నారు. కావలసిన రైతులు ఆయా గ్రామాల్లోని రైతుసేవా కేంద్రాల వద్ద డబ్బు చెల్లించిన విత్తనాలు తెప్పించి పంపిణీ చేస్తామన్నారు.

ఎస్సీ కార్పొరేషన్ రుణాలకు దరఖాస్తుల ఆహ్వానం

ఉలవపాడు, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసిన ఎస్సీ కార్పొరేషన్ రుణాలు మండలానికి 29 యూనిట్స్ కేటాయించినట్లు ఎంపీడీవో ఎస్ విజయ ఒక ప్రకటనలో తెలిపారు. ఎస్సీ కులాలకు చెందిన 21 సంవత్సరాలు పైబడి 50 లోపు ఉన్న అర్హులైనవారు స్థానిక సచివాలయాల్లో వెల్ఫేర్ అసిస్టెంట్‌ని సంప్రదించి ఆన్‌లైన్ దరఖాస్తు చేసుకోవాలన్నారు. మే నెల 10వ తేది దరఖాస్తు చేసుకొనుటకు చివరి రోజు అని తెలిపారు.

నేడు జువ్వలదిన్నెలో అవగాహన

బిట్రగుంట, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): బోగోలు మండలం జువ్వలదిన్నె పంచాయతీలో జాతీయ విపత్తుల నిర్వాహణలో భాగంగా జిల్లా కలెక్టర్ ఆనంద్ ఆదేశాల మేరకు గురువారం ఉదయం మాక్ డ్రిల్ నిర్వహించి అవగాహన కల్పించనున్నట్లు తహసీల్దారు సురేష్‌బాబు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ, పోలీస్, అగ్నిమాపక, విద్యుత్, నీటిపారుదల, పంచాయతీరాజ్, రవాణా, ఆరోగ్య, రోడ్లు, భవనాలు, మత్స్యశాఖల అధికారులు హాజరు కావాలని పేర్కొన్నారు. అన్ని శాఖల అధికారులకు కావలి ఆర్డీవో సన్నివంశీకృష్ణ విపత్తులపై తీసుకోవాల్సిన జాగ్రత్తలను తెలియచేస్తారని తెలిపారు.

‘పది’లో ఉత్తమ ఫలితాలు



వలేటివారిపాలెం హైస్కూల్‌లో లక్ష్మీశ్రీని అభినందిస్తున్న ఉపాధ్యాయులు

కందుకూరు, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): పదవ తరగతి పరీక్షల్లో మోడల్ స్కూళ్లు, గురుకులాలు, జిల్లా పరిషత్, ప్రభుత్వ ఉన్నత పాఠశాలల విద్యార్థులు ఉత్తమ ప్రతిభ చాటారు. కందుకూరు మండలంలోని జీ.మేకపాడులోని ఏపీ మోడల్ స్కూల్ విద్యార్థులు 34 మందికి 31మంది ఉత్తీర్ణులయ్యారని ప్రిన్సిపాల్ దాస్ తెలిపారు. పట్టణంలోని కేజీబీవీ విద్యార్థినులు ఉత్తమ ఫలితాలు సాధించారని ప్రిన్సిపాల్ స్వాతి తెలిపారు.

వంద శాతం ఉత్తీర్ణత

వలేటివారిపాలెం : మండలంలోని చుండి మోడల్‌స్కూల్, కేజీబీవీ, పోకూరు, నలదలపూరు, శాఖవరం హైస్కూల్ తదితర పాఠశాలల విద్యార్థులు 10వ తరగతిలో వంద శాతం ఉత్తీర్ణత సాధించినట్లు ఎంఈవో మల్లికార్జునరావు తెలిపారు. లో 17 మందికి గానూ 17 మంది విద్యార్థులు ఉతీర్ణులయినట్లు తెలిపారు. వలేటివారిపాలెం హైస్కూల్ విద్యార్థిని గొర్రెపాటి లక్ష్మీశ్రీ 592 మార్కులు, చుండి మోడల్‌స్కూల్ విద్యార్థిని బోడా నవ్యశ్రీ 592 మార్కులు సాధించింది. పోకూరు సాయిసిద్ధార్థ హైస్కూల్ విద్యార్థి రజిత 593 మార్కులు సాధించింది. వారిని ఉపాధ్యాయులు అభినందించారు.

గుడ్లూరులో 98 శాతం..

గుడ్లూరు : మండలంలోని గుడ్లూరు, బసిరెడ్డిపాలెం, చినలాటవరపి జడ్పీ ఉన్నత పాఠశాలలు, మొగళ్లూరు కేజీబీవీ విద్యార్థులు 98 శాతం ఉత్తీర్ణత సాధించారు.

ప్రభుత్వ పాఠశాలల్లో 72 శాతం..

అల్లూరు : ఇస్కపల్లి, అల్లూ రు, నార్తుమోపూరు జడ్పీ పాఠశాలలు, రామకృష్ణ పాఠశాలకు సంబంధించి 72 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు ఎంఈవో రవీంద్రనాథ్ తెలిపారు.

కొండాపురంలో 81 శాతం..

కొండాపురం : మండలంలోని 10 జడ్పీ ఉన్నత పాఠశాలలతోపాటు, ఆదర్శ, కెజీబీవీ పాఠశాలలకు చెందిన 10వ తరగతి విద్యార్థులు 81 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు మండల విద్యాశాఖాధికారులు కె.రవికుమార్, ఆనందరావులు తెలిపారు. ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థిని, విద్యార్థులను ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, తదితరులు ప్రత్యేకంగా అభినందించారు.

కలిగిరి మోడల్ స్కూల్ టాప్

కలిగిరి : ఏపీ మోడల్ స్కూల్ విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభను చాటినట్లు ప్రిన్సిపాల్ ఏ శ్రీను తెలిపారు. జడ్పీ హైస్కూల్‌లో 78 మందికి 59మంది మాత్రమే ఉత్తీర్ణత సాధించారు.

ప్రతిభ చాటిన విద్యార్థులు

ఉలవపాడు : మండలంలోని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు ప్రతిభ చాటారు. రామాయపట్నం జడ్పీ హైస్కూల్‌కు చెందిన ఎందేటి మౌనిక 583 మార్కులతో మండలంలోని 12 ప్రభుత్వ పాఠశాలల్లో ప్రథమ స్థానంలో ఉత్తీర్ణత సాధించింది. మండలంలో ప్రభుత్వ పాఠశాలల్లో 88.7 శా తం ఉత్తీర్ణత సాధించడం పట్ల ఎంఈవో-2 రమణయ్య విద్యార్థులకు అభినందనలు తెలిపారు. సెయిం ట్ జోసె ఫ్ స్కూల్ విద్యార్థి చేజ ర్ల వెంకట రామిరెడ్డి 592 మార్కులతో మండలం మొదటి స్థానంలో నిలిచాడు.

బోగోలులో 72 శాతం...

బిట్రగుంట : బోగోలు మండలంలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలో పదవ తరగతి పరీక్షల ఫలితాల్లో 72.35 శాతం ఉతీర్ణత సాధించినట్లు ఎంఈవోలు నరసింహారావు, జయమ్మలు తెలిపారు. అలాగే దగదర్తి మండలంలో 92 శాతం ఉతీర్ణత సాధించినట్లు ఎంఈవో భాస్కర్ తెలిపారు.

పేదల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

● ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు ● రైతులకు వ్యవసాయ పరికరాల పంపిణీ



రైతులకు రోటావేటర్, గొర్రులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు

వలేటివారిపాలెం, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): పేదలకు సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు తెలిపారు. మండలంలోని అంకభూపాలపురం, అయ్యవారిపల్లె గ్రామాల్లో ఉపాధి నిధులు రూ.90 లక్షలతో నిర్మించిన గ్రామ సచివాలయాలను బుధవారం ఆయన ప్రారంభించారు. అలాగే అంకభూపాలపురంలో పల్లెపండుగ కార్యక్రమంలో భాగంగా ఉపాధి నిధులు రూ.10 లక్షలతో నిర్మించిన సిమెంట్ రోడ్డును, గోకులం, గొర్రెల షెడ్డులను ప్రాంభించారు. ఐదుగురు రైతులకు వ్యవసాయ పరికరాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గత ప్రభుత్వ గ్రామాల్లో మౌలిక వసతులను పట్టించుకోలేదని తెలిపారు. డ్రైనేజీల వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉందని తెలిపారు. సీఎం చంద్రబాబునాయుడు పేదలకు సంక్షేమ అభివృద్ధి ఫలాలు అందించేందుకు అహర్నిశలు కృషి చేస్తున్నట్లు తెలిపారు. అంకభూపాలపురంలో డ్రైనేజీ కాలువల నిర్మాణ పనులకు ప్రతిపాదనలు తయారు చేసి ఉన్నతాదికారులకు పంపించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అనుమతులు రాగానే 15వ ఆర్థిక సంఘం నిధులతో డ్రైనేజీలు నిర్మించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో నరేంద్రదేవ్, అగ్రికల్చరల్ ఏడీ అనసూయ, పంచాయతీ రాజ్ ఏఈ శ్రీనివాసులు, ఏపీడీ బాబూరావు, ఏవో హేమంత్‌భరత్‌కుమార్, టీడీపీ మండల అధ్యక్షుడు మాదాల లక్ష్మీనరసింహం, నాయకులు ప్రగడ నరసింహం, ప్రగడ శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.

ఉగ్రదాడులకు నిరసనగా కొవ్వొత్తుల ర్యాలీ



కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహిస్తున్న బీజేపీ నాయకులు

కందుకూరు, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): కశ్మీర్ రాష్ట్రంలోని పహల్గాంలో జరిగిన ఉగ్ర దాడులకు నిరసనగా బుధవారం రాత్రి కందుకూరు పట్టణంలో బీజేపీ ఆధ్వర్యంలో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. పట్టణంలోని కోవూరు రోడ్డులో ఉన్న ప్రకాశం పంతులు విగ్రహం దగ్గర నుంచి అంబేడ్కర్ విగ్రహం వరకు ఉగ్రదాడిలో వీరమరణం పొందిన వారి ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తూ కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. దేశంలో ఉగ్రవాదం లేకుండా సమూలంగా నాశనం చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నియోజకవర్గ సమన్వయ కర్త గట్టమనేని హరిబాబు, బీజేపీ అనుబంధ సంఘాల నాయకులు గంగవరపు రామారావు, మన్నేపల్లి వరప్రసాదరావు, జొన్నాదుల సురేష్, మురళీధర్, పాణ్యం గాంధీ, చల్లా వెంకటరాజా, కూచిపూడి డేవిడ్, డాక్టరు తన్నీరు మల్లికార్జున, మంచిరాజు మురళి, చెక్కా వెంకటకేశవరావు, సుబ్రహ్మణ్యం, కొత్త శ్రీనివాసులు, చిన్నిపాండు రంగయ్య, మాల్యాద్రినాయుడు, తానికొండ కోటయ్య, రామలింగేశ్వరరావు, సాధు మాల్యాద్రి, నవులూరి రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

సీనియర్ సివిల్ న్యాయాధికారి శోభకు సత్కారం



సీనియర్ సివిల్ న్యాయాధికారిని సత్కరిస్తున్న న్యాయాధికారులు, న్యాయవాదులు

కావలి, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): కావలి సీనియర్ సివిల్ న్యాయాధికారి ఎం.శోభ కందుకూరుకు బదిలీ కావడంతో కావలి బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బుధవారం ఆమెను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా బార్ అసోసియన్ అధ్యక్షుడు కాటా సురేంద్రరెడ్డి మాట్లాడుతూ సివిల్ న్యాయాధికారి శోభ మూడేళ్లలో అనేక క్లిష్టమైన కేసులను పరిష్కరించి కక్షదారులకు సత్వరన్యాయం అందించారన్నారు. న్యాయవాదులతో స్నేహపూర్వక వాతావరణంలో ఉంటూ పెండింగ్‌లో ఉన్న పాత కేసులను కూడా పరిష్కరించటంలో చొరవ చూపారన్నారు. మండల న్యాయసేవాధికారిగా లోక్‌అదాలత్‌లో అత్యధిక కేసులు పరిష్కరించారని కొనియాడారు. సన్మాన గ్రహీత సీనియర్ సివిల్ న్యాయాధికారి ఎం.శోభ మాట్లాడుతూ న్యాయవాదులు సహకారం వలననే తాను కావలిలో క్లిష్టమైన కేసులు కూడా పరిష్కరించగలిగానని చెప్పారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ న్యాయాధికారి ఈ.సుధాకర్, మెజిస్ట్రేట్ విక్రమసిన్హా, సీనియర్ న్యాయవాదులు దేవరపల్లి వేణుగోపాల్‌రెడ్డి, కలీంరోజ్‌దార్ అహ్మద్, కలికి శ్రీనివాసులురెడ్డి, జీ. రాజేంద్రవరప్రసాద్, కే. చక్రపాణి, కెన్నడీ, పువ్వాడ ప్రసాద్, పీవీ శివప్రసాద్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రధానోపాధ్యాయుడికి ఘన సన్మానం



భీమేశ్వరరావును సన్మానిస్తున్న ఎమ్మెల్యే కాకర్ల

కలిగిరి, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): స్థానిక జడ్పీ హైస్కూల్‌లో బుధవారం జరిగిన హెచ్‌ఎం శిరోభూషణం భీమేశ్వర ఉద్యోగ విరమణ కార్యక్రమంలో ఎమ్మెల్యే కాకర్ల సురేష్ పాల్గొని ఆయనను ఘనంగా సన్మానించారు. ప్రధానోపాధ్యాయుడిగా బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి పాఠశాల అభివృద్ధికి, విద్యార్థుల్లో క్రమశిక్షణ, నైపుణ్యం పెంపొందించడానికి కృషి చేశారని కొనియాడారు. పదవీ విరమణ అనేది ఉద్యోగ జీవితంలో ఒక భాగమని, విశ్రాంత సమయంలో ఆరోగ్యంగా జీవించాలని ఆకాక్షించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

కలుగోళ్లశాంభవి ఆలయ హుండీ లెక్కింపు



హుండీలో కానుకలను లెక్కిస్తున్న సిబ్బంది

కావలి, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కలుగోళ్ల శాంభవి ఆలయంను దేవాదాయశాఖలో విలీనం చేసిన తర్వాత తొలిసారిగా ఆశాఖ ఆధ్వర్యంలో బుధవారం హుండీ లెక్కింపు చేట్టారు. దేవదాయ శాఖ కోవూరు ఈవో కృష్ణప్రసాద్, బిట్రగుంట ఈవో కావలి ఇన్‌చార్జి రాధాకృష్ణ, దేవస్థాన దర్మకర్తలి మండలి సభ్యులు కసవరాజు కృష్ణమోహన్ పర్యవేక్షణలో భక్తులు హుండీ లెక్కింపు చేట్టారు. 18 నెలలకు హుండీ రాబడి రూ.5,10,190 వచ్చినట్లు తెలిపారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించకుంటే చర్యలు



ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పిస్తున్న ప్రాంతీయ రవాణాశాఖ అధికారి టీవీఎస్ లక్ష్మి

కందుకూరు, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): ట్రాఫిక్ నిబంధనలు పాటించకుంటే వాహన చోదకులపై కఠిన చర్యలు తప్పవని కందుకూరు ప్రాంతీయ రవాణా శాఖ అధికారి టీవీఎస్ లక్ష్మి పేర్కొన్నారు. పట్టణంలోని పామూరురోడ్డు సర్కిల్‌లో బుధవారం సాయంత్రం ఆమె ప్రత్యేక వాహనాల తనిఖీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వాహనాల ధ్రువీకరణ పత్రాలు, డ్రైవింగ్ లైసెన్సులను పరిశీలించిన ఆమె ద్విచక్ర వాహనదారులు తప్పకుండా హెల్మెట్ ధరించాలని, కార్లు నడిపేవారు విధిగా సీటుబెల్టు ధరించాలని సూచించారు. సీటు బెల్టు లేకుండా నడుపుతున్న రెండు కార్లు, పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించిన రెండు ఆటోలు, డ్రైవింగ్ లైసెన్సు లేకుండా నడుపుతున్న ఓ ట్రక్కుపైన ఆమె కేసులు నమోదు చేశారు. ఈ సందర్భంగా రహదారి భద్రతపై వాహన చోదకులకు అవగాహన కల్పించారు.

వేగంగా కావలి కాలువ పూడికతీత పనులు



వేములపాడు వద్ద కావలి కాలువలో పూడిక తీస్తున్న భారీ ఎక్స్‌కవేటర్

జలదంకి, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): గత ఐదేళ్లలో వైసీపీ ప్రభుత్వం సాగునీటి వనరుల మరమ్మతులను గాలికొదిలేసింది. చెరువులు, సోమశిల ప్రాజెక్టు కింద ఉన్న కాలువలపై ఉన్న తూములకు ఏర్పాటు చేసిన గేట్లు రిపేర్లు చేయకుండా సాగునీటిరంగాన్ని పూర్తిగా విస్మరించింది. ఇందుకు ప్రత్యక్ష ఉదాహరణ సోమశిల రిజర్వాయరు పరిధిలోని కావలి కాలువ. ఈ కాలువ కింద లక్ష ఎకరాల ఆయకట్టు ఉండగా, ఐదేళ్ల వైసీపీ పాలనలో తట్టమట్టి పూడిక తీసిన పాపాన పోలేదు. కూటమి ప్రభుత్వం వచ్చిన వెంటనే సాగునీటి రంగంపై దృష్టి పెట్టి ఎక్కడికక్కడ పంటకాలువలు, చెరువలు మరమ్మతులు చేయాలో గుర్తించి పనులు చేయిస్తోంది. ఇందులో భాగంగా కావలి కాలువకు రూ.4కోట్లను పూడికతీత పనులకు కేటాయించి యుద్ధప్రాతిపదికన పనులు ప్రారంభించింది. మే5వతేదీలోపు ఈ పనులు పూర్తి చేసి ఐఏబీలో నిర్ణయించిన ప్రకారం రెండోపంటకు కావలికాలువకు సాగునీరు ఇచ్చే లక్ష్యంతో పనులను ఇంజనీర్లు చేయిస్తున్నారు. కావలి, ఉదయగిరి ఎమ్మెల్యేలు కావ్య క్రిష్ణారెడ్డి, కాకర్ల సురేష్‌లు పనులు జరుగుతున్న తీరును ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ త్వరితగతిన పూర్తయ్యేలా ఇంజనీర్లను పురమాయిస్తున్నారు. ఈ పూడికతీత పూర్తయితే చివరిఆయకట్టు భూములకు కూడా సోమశిల జలాలు పుష్కలంగా అందుతాయి.

రైతులు మట్టి నమూనా పరీక్షలు చేయించుకోవాలి



మట్టి నమూనాలు సేకరిస్తున్న వ్యవసాయాధికారి సైదా

కొండాపురం, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): ప్రతి రైతు తమ భూముల్లో మట్టి నమూనా పరీక్షలు చేయించుకోవాలని మండల వ్యవసాయ అధికారి చంద్రభాను తెలిపారు. ఈ మేరకు బుధవారం మండలంలోని పార్లపల్లి, సత్యవోలు పంచాయతీల్లో రైతులకు అవగాహన కల్పించారు. అయన మాట్లాడుతూ మండలంలో 1014 మట్టి నమూనాలు సేకరించి పరీక్షలు చేయడం లక్ష్యంగా నిర్ణయించామన్నారు. మట్టి పరీక్షలతో భూమిలోని లోపం గుర్తించి నివారించుకునేందుకు అవకాశం ఉంటుందని సూచించారు. ఈ కార్యక్రమంలో వీఏఏలు లక్ష్మీప్రసన్న, సుమతి, రైతులు పాల్గొన్నారు.

విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత స్థితికి చేరాలి



లింగసముద్రం ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న ఎంపీడీవో శ్రీనివాసులు

లింగసముద్రం, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత స్థితికి చేరాలని ఎంపీడీవో కట్టా శ్రీనివాసులు తెలిపారు. బుధవారం లింగసముద్రంలోని ప్రాథమిక పాఠశాలలో జరిగిన వార్షికోత్సవంలో అయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఇటీవల స్థానిక కేఆర్ జడ్పీ హైస్కూల్‌లో కాంప్లెక్స్ స్థాయిలో జరిగిన టాలెంట్ టెస్ట్‌లో ఆ పాఠశాల నుంచి విజేతలుగా నిలిచిన ముగ్గురు విద్యార్థులకు ఎంఈవో-2 శివకుమార్, కాంప్లెక్స్ చెర్మన్ యు మాధవరావు, హెచ్‌ఎం ఎం సుధాకర్, ఉపాధ్యాయులు కె వెంకటేశ్వర్లు, ఇన్నాయమ్మ, షాహిద్దీన్, సుజాత తదితరులతో కలసి ఎంపీడీవో బహుమతులు అందజేశారు.

రేపే బ్రహ్మాండమైన విడుదల



మీ అభిమాన థియేటర్లలో

సమాజ శ్రేయస్సే వ్యక్తి శ్రేయస్సు - విద్య లక్ష్యం విజ్ఞానము - విద్య వ్యాపారవస్తువు కారాదు

బి.వి.సుబ్బయ్య హైస్కూల్ పేర్నమిట్ట, ఒంగోలు

స్థాపితం: 1963 ప్రభుత్వంచే గుర్తింపబడిన విద్యాసంస్థ


Cell: 94944 70850, 88855 10515, 94942 20476, 79013 03125

✤ ఒకరిద్దరి విద్యార్థుల ర్యాంకుల గురించే కాకుండా విద్యార్థులందరికి అత్యధిక మార్కులు వచ్చునట్లు బోధించే విద్యా సంస్థ
✤ మా సంస్థ లక్ష్యం : ప్రతి విద్యార్థిని సమర్థునిగా, ఉత్తమ పౌరునిగా, తోటి మానవుని గౌరవించే వానిగా తయారు చేయటమే మా సంస్థ లక్ష్యం
✤ ప్రతి విద్యార్థి మీద మా ఉపాధ్యాయులు వ్యక్తిగత శ్రద్ధ తీసుకొందురు. అందువలననే ఈ సంస్థ సగటు మార్కును ప్రకటించగలుగుచున్నది.

2025 మార్చి 10వ తరగతి పబ్లిక్ పరీక్షా ఫలితాల శాతం : 97%
2025 మార్చి 10 వ తరగతి సగటు మార్కు : 483.31%

అడ్మిషన్లు జరుగుచున్నవి

పరీక్షకు హాజరైనవారు: 133
ప్రథమ శ్రేణి: 125 ద్వితీయ శ్రేణి: 04



586/600 స్కూల్ ఫస్ట్	586/600 స్కూల్ ఫస్ట్	583/600 స్కూల్ సెకండ్	582/600 స్కూల్ థర్డ్	580/600	579/600	570/600	569/600
టి. అనిల్ కుమార్	కె. బ్రహ్మచరణ్	ఎ. బ్రహ్మనంద రెడ్డి	ఇ. పూర్ణ వంశీ	సిహెచ్. సుజీవన్	యస్.వి. సిద్ధార్థ	యం.వి.యస్. ధీరజ్	వై. జశ్వంత్
H.T.No: 2517103297	H.T.No: 2517103960	H.T.No: 2517104542	H.T.No: 2517104706	H.T.No: 2517104800	H.T.No: 2517103660	H.T.No: 2517103165	H.T.No: 2517103926

550 పైగా మార్కులు వచ్చిన వారు: 25
500 పైగా మార్కులు వచ్చిన వారు: 63
450 పైగా మార్కులు వచ్చిన వారు: 96

జనరల్ తెలుగు	హిందీ	ఇంగ్లీషు	లెక్కలు	సైన్సు	సోషల్
100	98	97	100	100	100

ఈ విజయము మా సంస్థ సమిష్టి కృషి ఫలితము

సెక్రటరీ & కరస్పాండెంట్: బి.కోటిలింగము, B.E.
హెడ్ మాస్టర్: వై.వేణుగోపాల్ రెడ్డి B.A, B.Ed., B.L.

KALYANI ADS

తోకజాడిస్తే పీడీ యాక్ట్

శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే సహించం

నగరంలో రోజూ రాత్రి వాహనాల తనిఖీలు

సమయానికి దుకాణాలు మూసేయాలి

అదనపు ఎస్పీ సౌజన్య వెల్లడి



ఇంటర్వ్యూ...

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట), ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి) : నెల్లూరు నగరంలో శాంతి భద్రతల పరిరక్షణే లక్ష్యంగా పోలీసు శాఖ ముందుకు అడుగులు వేస్తోందని అదనపు ఎస్పీ సీహెచ్ సౌజన్య తెలిపారు. తోక జాడించే వారిపై పీడీ యాక్ట్ నమోదు చేస్తామని చెప్పారు. నగరంలో వరుసగా జరుగుతున్న హత్యలు, హత్యాయత్నాలు, దాడుల నేపథ్యంలో నగర ప్రజలు భయాందోళనలకు గురవుతున్నారు. ఈ క్రమంలో శాంతి భద్రతలను గాడిన పెట్టేందుకు ప్రత్యేకంగా తీసుకుంటున్న చర్యలపై ఏఎస్పీ ఆంధ్రజ్యోతితో మాట్లాడారు.

? నగరంలో శాంతిభద్రతలకు ఎలాంటి చర్యలు తీసుకుం టున్నారు.

! నగరంలో శాంతిభద్రతలు గాడిన పెట్టేందుకు ప్రత్యేక ప్రణాళికను అమలు చేస్తున్నాం. ప్రతీ రోజూ రాత్రి 9 గంటల నుంచి అర్ధరాత్రి వరకు వాహన తనిఖీలు చేపడుతున్నాము. రౌడీషీటర్లపై ప్రత్యేక నిఘా ఉంచడం తోపాటు వారంలో ఆదివారం ఒక్కరోజే కాకుండా ప్రతీ రోజు రౌడీషీటర్లను స్టేషన్‌కు పిలిపిస్తున్నాము. బహిరంగ ప్రదేశాల్లో మద్యపానం చేసే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటున్నాము. నిర్దిష్ట సమయానికి మించి దుకాణాలు, హోటల్స్ షాపింగ్ మాల్స్ తెరచి ఉంటే అటువంటి వాటిపై చర్యలు తీసుకుంటున్నాము.

? వాహన తనిఖీలతో ఫలితాలు ఉన్నాయా.

! నగరంలోని ప్రధాన కూడళ్లు, జాతీయ రహదారి నుంచి నగరంలోకి వచ్చే ప్రదేశాలు, అసాంఘిక కార్యకలాపాలు జరిగే ప్రాంతాల్లో తనిఖీలు చేపడుతున్నాం. నాతోపాటు నగర డీఎస్పీ, సీఐలు, ఎస్ఐలు, సిబ్బంది, ప్రత్యేక బృందాలుగా వాహన తనిఖీల్లో పాల్గొంటున్నారు. అనుమానాస్పదంగా ఉన్న వ్యక్తులను స్టేషన్‌కు తరలించి విచారిస్తున్నాము. అనవసరంగా రాత్రి పూట రోడ్లపైకి వస్తున్న వారిపై చర్యలు తీసుకుంటాము. నేరాలకు పాల్పడే వారిపై బ్యాడ్‌క్యారెక్టర్‌తో షీట్స్ ఓపెన్ చేసేందుకు వెనుకాడము.

? రౌడీషీటర్లపై ఎలాంటి నిఘా ఉంచారు.

! రౌడీషీటర్లు, పదే పదే నేరాలకు పాల్పడే వారిపై ప్రత్యేక నిఘా ఉంచా ము. ప్రజలను భయభ్రాంతులకు గురిచేయడం, శాంతిభద్రతలకు విఘా తం కలిగించే వారిపై పీడీ యాక్ట్ అమలు చేస్తాం. రౌడీషీటర్లకు తరచూ కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నాము. కత్తులు, మారణాయుధాలు పెట్టుకొని తిరుగుతున్న వారిపై కఠినంగా వ్యవహరిస్తాము. నేర నియంత్రణకు ప్రజల సహకారం అవసరం. గంజాయి విక్రయాలు, సేవించడం, బహిరంగ మద్యపానం, మహిళలతో అసభ్యకరంగా ప్రవర్తిస్తుండటం, దొంగతనాలు, అల్లరు, ఇతర నేరాలు జరుగుతుంటే ప్రజలు 112 నెంబరుకుగానీ, స్థానిక పోలీసులకుగానీ సమాచారమివ్వాలి. అలాంటి వారి వివరాలను గోప్యంగా ఉంచుతాం.

ఉగ్రదాడి విషాదం

● మంత్రులు నారాయణ, ఆనం, ప్రజా ప్రతినిధుల ఆగ్రహం

నెల్లూరు (హరనాథపురం), ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి) : కశ్మీరులో పర్యాటకులపై మంగళవారం జరిగిన ఉగ్రవాదుల దాడి యావత్ భారతావనిని కలచి వేసింది. మతోన్మాదంతో అమాయకులను అమానుషంగా పొట్టనపొట్టుకోవడం అందరినీ వేదనకు గురిచేసింది. ముష్కరుల దమనకాండ బాధాకరమని, వారికి తగిన గుణపాఠం తప్పదని జిల్లాకు చెందిన మంత్రులు, ప్రజాప్రతినిధులు ఆవేదన, ఆగ్రహం వ్యక్తం చేశారు.

● పిరికిపంద చర్య

పహల్గామ్‌లో జరిగిన ఉగ్రవాద దాడి పిరికిపంద చర్య. ట్రెక్కింగ్‌కు వెళ్లిన టూరిస్టులను చంపడం తీవ్రంగా కలిచివేసింది. మృతులకు నివాళి అర్పిస్తున్నా, గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని భగవంతుడిని ప్రార్థిస్తున్నా.

- నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి

● వణికేలా సమాధానం ఉండాలి

పట్టపగలు ఉగ్రవాదులు జరిపిన మారణకాండ దుర్మార్గం. మరోసారి ఇలాంటిది జరగకుండా ఉగ్రవాదులకు, వారికి వెన్నుదన్నుగా నిలిచేవారికి వెన్నులో వణుకుపుట్టేలా సమాధానం ఇవ్వాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరుతున్నా.

- సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి

● ముష్కరులను ఉరితీయాలి

అమాయకుల ప్రాణాలు బలిగొన్న ముష్కర మూకలను ఉరి తీయాలి. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి. మారణ హోమానికి పాల్పడ్డ ఉగ్రవాదులకు భద్రతాదళాలు త్వరలోనే తగిన గుణపాఠం చెబుతాయి.

- కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి

● మృతుల ఆత్మకు శాంతి కలగాలి

కాశ్మీర్ ఉగ్రవాదుల దాడిలో మరణించిన వారి ఆత్మశాంతి కోసం భగవంతుని ప్రార్థిస్తున్నా. ఆ కుటుంబాలకు నా సంతాపం తెలియజేస్తున్నాను. ఉగ్రవాద వ్యతిరేక పోరాటంలో దేశం మొత్తం ఒక్కటిగా నిలవాలని ఆకాంక్షిస్తున్నాను.

- రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి

● తీవ్రంగా కలిచివేసింది

కశ్మీర్‌లో ఉగ్రదాడి తీవ్రంగా కలిచివేసింది. ఆ ఘటనలో కావలికి చెందిన సోమిశెట్టి మధుసూదన్‌రావు మృతి చాలా బాధ కలిగించింది. ఆయన కుటుంబానికి కూటమి ప్రభుత్వం అండగా ఉంటుంది. ఉగ్రదాడిలో మృతి చెందిన వారికి నివాళులర్పిస్తున్నాం.

- రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి పొంగూరు నారాయణ

● తీరని విషాదం

కావలికి చెందిన సోమిశెట్టి మధుసూదన్‌రావు ఉగ్రదాడిలో ప్రాణాలు కోల్పోవడం తీరని విషాదం. ఆయన కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నాను. అన్యంపుణ్యమెరుగని అమాయకుల ప్రాణాలు పొట్టన పెట్టుకోవడం అమానుషం.

- రాష్ట్ర దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి

● మృగాల్లా దాడి

కాశ్మీర్ అందాలను తిలకించేందుకు వచ్చిన అమాయక పర్యాటకులపై ముష్కరుల దాడి మృగాలను తలపించింది. ప్రాణాలు కోల్పోయిన వారిలో కావలి వాసి ఉన్నారన్న వార్తతో దిగ్భ్రాంతికి గురయ్యాను. వారి కుటుంబా నికి మనోధైర్యం ప్రసాదించాలని భగవంతుని ప్రార్థిస్తున్నాను.

- ఎమ్మెల్సీ బీద రవిచంద్ర

ఉద్యానం ఉసూరు!

- కందుకూరు ఏడీ కార్యాలయం రద్దు
- ఏడాది కాలంగా హెచ్‌వో పోస్టు ఖాళీ
- 20వేల ఎకరాలకుపైగా ఉద్యాన పంటలు
- కానీ ఒక్కరే అధికారి
- యంత్రాంగం కొరతతో రైతులకు అందని సేవలు

కందుకూరు డివిజన్‌లో ఉద్యాన పంటల విస్తీర్ణం అధికంగా ఉంది. ఇప్పటికే 20 వేలకుపైగా ఎకరాల్లో పంటలు సాగవుతుండగా ఏడాదికేడాదికి ఆ సాగు విస్తీర్ణం గణనీయంగా పెరుగు తోంది. ఇలాంటి తరుణంలో కందుకూ రులోని ఉద్యానశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ (ఏడీ) కార్యాలయం రద్దవడం ఆ ప్రాంత రైతులకు శాపంగా మారే ప్రమాదం ఉంది. ఇక్కడి ఏడీ పోస్టును కుప్పంకు బదలాయించటంతోపాటు కార్యాలయ సిబ్బందిని కూడా ఒంగోలు, పల్నాడు డివిజన్లకు కేటాయిస్తూ ఉద్యానశాఖ డైరెక్టర్ ఉత్తర్వులు జారీ చేసిన విషయం తెలిసిందే. ప్రభుత్వ చర్యలతో తాము నష్టపోతామని రైతులు వాపోతున్నారు.





కందుకూరులో రద్దయిన ఉద్యానశాఖ ఏడీ కార్యాలయం

కందుకూరు, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): కందుకూరు నియోజకవర్గంలో గతంలో ఉలవపాడు ఉద్యానవన శాఖాధికారి, కందుకూరు ఉద్యానవన శాఖాధికారితోపాటు ఏడీ కార్యాలయంలో ఒక టెక్నికల్ హెచ్‌వో పనిచేసే వారు. అయితే ఏడీ కార్యాలయ టెక్నికల్ హెచ్‌వో పోస్టును మూడేళ్ల క్రితమే ప్రభుత్వం రద్దుచేయగా ప్రస్తుతం ఏకంగా ఏడీ కార్యాలయాన్నే రద్దు చేసింది. జిల్లా ఉద్యానవన శాఖాధికారి డివిజన్‌లోని ఉద్యాన శాఖ అధికారులతో సమన్వయం చేసుకుంటూ ఈ ప్రాంత రైతులకు అన్నిరకాల సేవలు అందేలా చూడాలని ప్రభుత్వం ఆదేశించింది. అయితే జిల్లాలోనే అత్యధికంగా పండ్లతోటలు, ఇతర ఉద్యాన పంటల సాగయ్యే కందుకూరు ప్రాంతంలో ప్రస్తుతం ఉలవపాడు ఉద్యానశాఖాధికారి ఒక్కరి మాత్రమే అందుబాటులో ఉండటం గమనార్హం.

● వేలాది ఎకరాల్లో పంటలు

కందుకూరు పరిధిలోని ఉలవపాడులో అంతర్జాతీయ గుర్తింపు కలిగిన మామిడి తోటలు వేలాది ఎకరాల్లో విస్తరించి ఉన్నాయి. అలాగే నిమ్మ, బత్తాయి, సపోట, జామ, బొప్పాయి తదితర పండ్లతోటలు కూడా వేలాది ఎకరాల్లో సాగవుతున్నాయి. ఉలవపాడు మండలం కరేడులో సామాజిక అటవీశాఖ అభివృద్ధి చేసిన జీడిమామిడి తోటలు కూడా ఉన్నాయి. కందుకూరు ప్రాంతం లో వేలాది ఎకరాల్లో మిరప సాగవుతోంది. ఉద్యాన శాఖ అంచనాల ప్రకారం 9200 ఎకరాల్లో మామిడితోటలు విస్తరించి ఉండ గా వాస్తవానికి ఈ విస్తీర్ణం 11వేల ఎకరాలకుపైనే ఉంటుందని అంచనా. అలాగే 1365 ఎకరాల్లో మిరప సాగవుతున్నట్లు ఉద్యాన శాఖ అధికారులు చెబుతుండగా గత కొన్నేళ్లుగా నియోజకవర్గంలో ఏటా 4వేల ఎకరాల్లో మిరప సాగవుతున్నట్లు అంచనా. ఇవికాక నిమ్మ 370 ఎకరాలు, జామ 72 ఎకరాలు, సపోటా 1170 ఎకరాలు, జీడి మామిడి 850 ఎకరాల్లో సాగవుతున్నాయి. అలాగే కూరగాయల తోటలు, మునగ, ఆవాలు తదితర ఉద్యాన పంటలూ చెప్పుకోదగిన విస్తీర్ణంలోనే ఉన్నాయి.

ప్రభుత్వ పథకాలు అందవని ఆందోళన

ఉద్యాన శాఖాధికారులు తగినంతమంది లేకపోవటంతో ప్రభుత్వ పథకా లపై అవగాహన కల్పించే పరిస్థితి ఉండదని, ఫలితంగా తాము తీవ్రంగా నష్టపోయే ప్రమాదం ఉందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఉద్యాన శాఖ ద్వారా ప్రభుత్వం రైతులకు డ్రిప్, స్ప్రింక్లింగ్‌తోపాటు ఆధునిక యంత్ర పరికరాలు, ఇతర ప్రోత్సాహకాలు అందజేస్తున్నది. ఇప్పటికే సాగులో ఉన్న పండ్ల తోటల నిర్వహణకు వివిధ రూపాలలో ప్రోత్సాహకాల తోపాటు నూతనంగా పండ్లతోటలు సాగుచేసే రైతులకు ఉపాధి హామీ పథకం అనుసంధానంతో పలురకాల రాయితీలు కల్పిస్తున్నది. అలాగే పండ్లతోటల్లో నీటికుంటల ఏర్పాటునూ ప్రోత్సహిస్తోంది. ఈ నేపథ్యంలో ఆయా పథకాల ఫలాలు తమకు సకాలంలో అందాలన్నా, ఫైళ్లు త్వరిత గతిన కదలాలన్నా ఉద్యాన అధికారుల కొరత ఉంటే కష్టమని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఏడాదిగా కందు కూరు హెచ్‌వో పోస్టు ఖాళీగా ఉంది. ఉలవపాడు ఉద్యాన అధికారి జ్యోతి ఇన్‌చార్జి కావటంతో ఆమెపై పనిభారం పెరుగుతోంది. పండ్లతోటలకు సోకే వివిధ రకాల తెగుళ్లు, వ్యాధుల నివారణకు రైతులకు సకాలంలో తగిన సూచనలు కూడా ఇచ్చే పరిస్థితి లేకుండాపోయింది. ఏడీ పోస్టు రద్దుచేసిన ప్రభుత్వం కనీసం పంటల విస్తీర్ణానికి అనుగుణంగా కందుకూరుకు ఉద్యాన అధికారిని తక్షణం నియమించటంతోపాటు గతంలో ఉన్న టెక్నికల్ హెచ్‌వో పోస్టును కూడా మంజూరు చేయాలని రైతులు కోరుతున్నారు.



హౌసింగ్ అధికారులతో చర్చిస్తున్న నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి

అర్హులందరికీ పక్కా ఇళ్లు

● నుడా చైర్మన్ కోటంరెడ్డి

నెల్లూరు (జడ్పీ), ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో అర్హులైన ప్రతి పేదవాడికి సొంత ఇంటికలను నెరవేర్చటమే ప్రభుత్వ లక్ష్యమని నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి తెలిపారు. నుడా పరిధిలో పక్కా ఇళ్ల నిర్మాణాలు, మంజూరుపై బుధవారం హౌసింగ్ పీడీ వేణుగోపాల్‌తో ఆయన తన చాంబర్‌లో చర్చించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పేదవాడి ఇంటి నిర్మాణానికి గత టీడీపీ ప్రభుత్వంలో రూ.2.50లక్షలు ఇస్తే, వైసీపీ అధికారంలోకి వచ్చాక ఆ మొత్తాన్ని రూ.1.80లక్షలకు కుదించిందన్నారు. ఆ నిధులు ఇంటి నిర్మాణానికి చాలకపోవటంతో పేదలు ఎవరూ ఇళ్ల నిర్మాణాలను ముందుకు రాలేదన్నారు. దీంతో టీడీపీ అధికారంలోకి రాగానే ఎస్టీ,ఎస్సీలకు రూ.75 వేల నుంచి రూ.లక్ష వరకు, బీసీలకు రూ.50 వేలు చొప్పున అదనంగా నగదు అందిస్తున్నదని పేర్కొన్నారు. దీంతో జిల్లాలోని 6,020 ఇళ్లకు రూ.16.38కోట్లు అదనంగా నిధులు మంజూరు చేశారని ఆయన వివరించారు. నుడా పరిధిలో నూతన గృహాలకు దరఖాస్తు చేసుకున్న అర్హులందరికీ గృహాలు మంజూరు చేయాలని ఆయన అధికారులను ఆదేశించారు. ఇంకా ఎవరైనా దరఖాస్తు చేసుకోకుంటే వెంటనే స్థానిక సచివాలయాల వద్ద దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో నుడా కార్యదర్శి పెంచలరెడ్డి కూడా పాల్గొన్నారు.

డిగ్రీ పరీక్షలకు ఒకరి గైర్హాజరు

వెంకటాచలం, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి) : విక్రమ సింహపురి యూనివర్సిటీ పరిధిలోని అనుబంధ కళాశాలలో బుధవారం జరిగిన డిగ్రీ రెండవ సెమిస్టర్ రెగ్యులర్, సప్లిమెంటరీ పరీక్షలలో ఒక విద్యార్థి గైర్హాజరైనట్లు వీఎస్‌యూ పరీక్షల నిర్వాహణాధికారి డాక్టర్ ఆర్ మధుమతి ఒక ప్రకటనలో తెలిపారు. మధ్యాహ్నం జరిగిన పరీక్షలలో 13 మంది విద్యార్థులకుగాను 12 మంది హాజరయ్యారు.

మత్స్యశాఖ ఎఫ్‌డీవోపై విచారణ

బుచ్చిరెడ్డిపాళెం, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి) : మండలంలోని మత్స్యశాఖ ఎఫ్‌డీవో పొట్టియ్యపై మత్స్యకార సంఘం అధ్యక్షుడు కామాక్షయ్య ఫిర్యాదుతో జిల్లా కలెక్టర్ ఆనంద్ విచారణకు ఆదేశించారు. ఈ మేరకు బుధవారం ఆ శాఖ ఏడీ శ్రీనివాసులు కనిగిరి రిజర్వాయర్ వద్ద మత్స్యకారులతో విచారణ చేపట్టారు. మత్స్యకార సంఘం సభ్యుల వద్ద వసూళ్లకు పాల్పడడంతో పాటు రసీదులో తక్కువ రాసి ఎక్కువ మొత్తం తీసుకునేవారని పలువురు మత్స్యకారులు ఆరోపించారు. అధ్యక్షుడి ఎన్నిక ఆ అధికారి కనుసన్నల్లో ఓ ఫొటో స్టూడియోలో నిర్వహించారని పలువురు డైరెక్టర్లు వివరించారు. పాలకమండలి సమక్షంలో జరగాల్సిన ప్రెసిడెంట్ ఎన్నిక ఫొటో స్టూడియోలో పెట్టడం, ఇంత జరిగితే నోటీసులు ఇవ్వకపోవడంపై విచారణాధికారి ఎఫ్‌డీవోని నిలదీయడంతో ఆయన ఖంగుతిన్నారు. విచారణ మేరకు సమగ్ర నివేదికను కలెక్టర్‌కు సమర్పించనున్నట్లు విచారణాధికారి చెప్పారు.

4.82లక్షల మందికి బీమా : డ్వామా పీడీ

పొదలకూరు, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో 4.82లక్షల మందికి బీమా సౌకర్యం కల్పించడమే లక్ష్యం అని డ్వామా పీడీ గంగాభవానీ పేర్కొన్నారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయ సమావేశ మందిరంలో బుధవారం రాపూరు, పొదలకూరు, సైదాపురం, కలువాయి మండలాల ఉపాధి ఉద్యోగులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఉపాధి పనులకు హాజరయ్యే కూలీల సంక్షేమం కోసం ప్రధానమంత్రి సురక్ష బీమా యోజన పథకాలను ప్రవేశ పెట్టినట్లు చెప్పారు. కమిషనర్ ఆదేశాల మేరకు రెండు బీమా యోజనాలను కూలీలకు వర్తింపచేసేందుకు క్షేత్రస్థాయిలో ఎస్ఏలు, టీఏలు, ఏపీఓలు కృషి చేయాల్సిందిగా ఆదేశించారు. మొదటి బీమా సౌకర్యంకు సంబంధించి రూ.20 చెల్లించాలని, రెండో బీమాకు రూ.436 చెల్లించాల్సి ఉంటుందన్నారు. కూలీల బ్యాంకు ఖాతాల నుంచి బ్యాంకర్లు మినహాయించుకునే విధంగా ఏర్పాట్లు చేయాల్సిందిగా సూచించారు. ప్రధానమంత్రి సురక్ష బీమా యోజనలో రూ.20 చెల్లిస్తే ప్రమాదవశాత్తు మృతిచెందితే రూ.2లక్షలు, ప్రధానమంత్రి జీవన్ జ్యోతి యోజనలో రూ.436 చెల్లిస్తే ప్రమాదవశాత్తు మరణించినా లేదా సహజ మరణం అయినా రూ.2లక్షలు అందజేయడం జరుగుతుందన్నారు.

పీజీ సెట్ అర్హత పరీక్షలకు దరఖాస్తు చేసుకోండి

వెంకటాచలం, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): ఏపీ పీజీ సెట్ అర్హత పరీక్షలకు దరఖాస్తు చేసుకోవాలని వర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ కే సునీత బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2025-26 ఏడాదికిగాను పోస్ట్ గ్రాడ్యుయేట్ (ఎంఏ, ఎంకామ్, ఎంఎస్సీ, ఎంఎస్‌డబ్ల్యూ తదితర) కోర్సులలో ప్రవేశార్థం ఏపీ పీజీ సెట్ అర్హత పరీక్షలను జూన్ 9 నుంచి 13వ తేదీ వరకు నిర్వహించనున్నారన్నారు. ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తుల స్వీకరణ ప్రారంభమైందన్నారు. అర్హత కలిగిన అభ్యర్థులు ఏపీ ఆన్‌లైన్ గేట్‌వే ద్వారా దరఖాస్తు ఫీజు చెల్లించి దరఖాస్తును సమర్పించాలన్నారు. అర్హత ప్రమాణాలు, సీట్లు, సిలబస్, ఇతర సూచనలు, ఆన్‌లైన్ దరఖాస్తు ప్రక్రియకు సంబంధించిన పూర్తి సమాచారం వెబ్‌సైట్‌లో లభిస్తుందన్నారు. వీఎస్‌యూ కళాశాల, కావలి పీజీ సెంటర్, అనుబంధ కళాశాలలో అందించబడుతున్న కోర్సుల వివరాలు జతచేయబడుతుందన్నారు. జిల్లాలోని విద్యార్థులందరూ ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవాలన్నారు. మరిన్ని వివరాల కోసం యూనివర్సిటీలోని డీవోఏ కార్యాలయాన్ని సంప్రదించాలని సూచించారు.

హాయ్.. నెల్లూర్..!



నగరంలో సందడి చేసిన హీరోయిన్ శ్రీదేవి

నెల్లూరు (సాంస్కృతికం) ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): ప్రేక్షకులను 'హాయ్.. నెల్లూర్...' అంటూ పలకరించి కోర్టు సిని హీరోయిన్ శ్రీదేవి నగరంలో సందడి చేశారు. మాగుంట లేఅవుట్‌లో సీఎంఆర్ జ్యూవెలరీలో సోమా ఎక్స్‌క్లూజివ్ వెండి ఆభరణాలను షోరూమ్‌ను బుధవారం ఆమె రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, టీడీడీ నేత గిరిధర్‌రెడ్డిలతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె షోరూమ్ అంతా కలియతిరిగి, వెండి ఆభరణాలను అలంకరించుకుని ప్రదర్శించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ సోమా ఎక్స్‌క్లూజివ్ వెండి ఆభరణాలను నెల్లూరు ప్రారంభించడం ఆనందంగా ఉందన్నారు. ఈ ఆభరణాలు ఎంతో అందంగా ఉన్నాయని, అందరికీ అందుబాటులో ఫ్యాక్టరీ అవుట్‌లెట్ ధరలకే విక్రయించడం గొప్ప విషయమని పేర్కొంటూ సీఎంఆర్ యాజమాన్యాన్ని అభినందించారు. రూరల్ ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి మాట్లాడుతూ సీఎంఆర్ అధినేతలు వెండి ఆభరణాల్లో అద్భుత కలెక్షన్స్‌తోపాటు 92.5 క్వాలిటీ కలిగిన జ్యూవెలరీ తయారీ ధరలకే విక్రయిస్తున్నారని, వినియోగదారులంతా వినియోగించుకోవాలని తెలిపారు. సీఎంఆర్ జ్యూవెలరీ అధినేతలు మావూరి శ్రీనివాసరావు, సంతోష్, గణేష్ మాట్లాడుతూ వెండి జ్యూవెలరీ డిజైన్ల ప్రత్యేకతలు, డిస్కౌంట్స్ తదితర విషయాలను వివరించారు. హీరోయిన్ శ్రీదేవిని చూసేందుకు భారీగా అభిమానులు తరలిరావడంతో షోరూమ్ బయట రోడ్డు కిక్కిరిసింది.

పొగాకు మద్దతు ధరకు కృషి చేస్తా

● వేలం కేంద్రం సందర్శనలో ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల

కలిగిరి, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): పొగాకు రైతులకు మద్దతు ధర అందించడానికి తనవంతు కృషి చేస్తానని ఎమ్మెల్యే కాకర్ల సురేష్ పేర్కొన్నారు. బుధవారం 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన 'పెరగని ధరలు-పొగాకు రైతుల ఆందోళన' కథనంతో పాటు నియోజకవర్గంలోని పలువురు రైతులు పొగాకు మద్దతు ధర పెరగకపోవడం, లోగ్రేడు పొగాకు బేళ్లను కొనుగోలు చేయకపోవడం తదితర అంశాలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకురావడంతో స్పందించిన ఆయన బుధవారం వేలం కేంద్రాన్ని సందర్శించారు. కొనుగోళ్లలో రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. పొగాకు ధరలు పెరగకపోవడానికి, లోగ్రేడు పొగాకును కొనుగోలు చేయకపోవడానికి గల కారణాలను బోర్డు అధికారులతోపాటు, పొగాకు కొనుగోలు కంపెనీల ప్రతినిధులను ప్రశ్నించారు. అంతర్జాతీయ మార్కెట్‌నుబట్టి పొగాకు ధర ఉంటుందని, మార్కెట్ డిమాండ్‌ను బట్టి పొగాకు కొనుగోలు చేయడం జరుగుతుందని వారు తెలిపారు. దీంతో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్‌ల దృష్టికి తీసుకెళ్లి రైతుకు మద్దతు ధర అందించేందుకు కృషి చేస్తానని ఎమ్మెల్యే తెలిపారు. ఈ కార్యక్రమంలో పొగాకు రైతు సంఘం నాయకులు రావూరి శ్రీకాంత్, లక్ష్మీనరసింహ, రావులకొల్లు సర్పంచు పూసాల వెంగపనాయుడు, బోర్డు అధికారులు, రైతులు, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.



పొగాకు వేలం కేంద్రంలో ఎమ్మెల్యే కాకర్ల సురేష్

ఎన్ఎంసీ కమిషనర్‌గా నందన్ బాధ్యతల స్వీకరణ

నెల్లూరు(సిటీ), ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): ఎన్ఎంసీ కమిషనర్‌గా వైవో. నందన్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. కార్పొరేషన్‌లోని కమిషనర్ చాంబరులో ఈ మేరకు ఆయన దస్త్రాలపై సంతకం చేశారు. అనంతరం ఆయన్ను కార్పొరేషన్‌లోని విభాగాధిపతులు, ఉద్యోగులు, సిబ్బంది మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. అందరి సమన్వయంతో ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని, ప్రజల నుంచి వచ్చే వినతులపై తక్షణం స్పందించాలని ఈ సందర్భంగా ఆయన అధికారులకు సూచించారు. అనంతరం నగరంలో దోమల నివారణపై పారిశుధ్య విభాగంతో సమీక్ష నిర్వహించారు. అనంతరం ఆయన పారిశుధ్య కార్మికులకు టోపీలు అందచేశారు.

ఆంధ్రజ్యోతి క్లాసిఫైడ్స్

మహిళలకు ఉచిత శిక్షణ

ప్రభుత్వ పథకం ద్వారా మహిళలకు ఉచితంగా కంప్యూటర్ టాలీ, టైలరింగ్ కోర్సుల నందు శిక్షణ ఇచ్చి ఉపాధి కల్పించబడును. ఉచిత హాస్టల్ వసతి కలదు. సం.ప్ర. 81061 46126

AJR-205632

WANTED

Female Telecallers to Work in Administrative Sector Salary 10-20K, Qual: Degree Balaji Nagar, Nellore. **Cell: 90005 76621**

AJR-211839

పాఠకులకు ముఖ్య గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా నమ్మించబడిన/క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.

మేనేజర్ - ఏడివిటి



బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)	
ఒక గ్రాము ధర	రూ.9306
వెండి కిలో ధర	రూ. 99,500
వెండి ఒక గ్రాము	రూ.102.50

వైభవంగా శ్రీమహావిష్ణువు కల్యాణం

సైదాపురం, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని కృష్టారెడ్డిపల్లి గ్రామం వైకుంఠపురంలో తాతయ్యస్వామి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న బ్రహ్మోత్సవాల సందర్భంగా బుధవారం రాత్రి శ్రీమహావిష్ణువు, మహాలక్ష్మీ కల్యాణ మహోత్సవం వైభవంగా జరిగింది. ఉదయం తిరుచ్చి ఉత్సవం, స్నపన తిరుమంజనం, రాత్రి గజవాహన సేవ కార్యక్రమాలు నిర్వహించారు. జిల్లా నలుమూలల నుంచి భక్తులు పాల్గొని స్వామివార్లను దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. కార్యక్రమంలో ఉభయ దాతలు కటారు రఘురామయ్య, వల్లూరు సురేంద్ర నాయుడు, మనుబోలు సరసారెడ్డి, ఎన్ శ్రీనాథ్‌రెడ్డి దంపతులు పాల్గొన్నారు.

వేంకటేశ్వరస్వామి విగ్రహ ప్రతిష్ఠ

బుచ్చిరెడ్డిపాళెం, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి) : మండలంలోని నాగాయగుంటలో బుధవారం వేంకటేశ్వరస్వామి ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో కోవూరు మాజీ ఎమ్మెల్యే నల్లపురెడ్డి ప్రసన్న కుమార్ రెడ్డి పాల్గొని స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థప్రసాదములు స్వీకరించారు. ఆయన వెంట పలువురు వైసీపీ నాయకులు ఉన్నారు.

న్యూస్ బాక్స్

మహిళా, శిశు సంరక్షణ చట్టాలపై అవగాహన ఉండాలి

బుచ్చిరెడ్డిపాళెం, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): మహిళ, శిశు సంరక్షణ చట్టాలపై మహిళలు అవగాహన కలిగి ఉండాలని బాలల సంరక్షణ అధికారి బి.సురేష్ అన్నారు. బుధవారం బుచ్చిరెడ్డిపాళెంలోని మండల సమైక్య కార్యాలయంలో మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో వీవోఏలు, అంగన్వాడీ కార్యకర్తలకు బాల్య వివాహాలు, అక్రమ రవాణా, లైంగిక వేధింపులు, మహిళా, శిశు సంరక్షణ చట్టాలపై అవగాహన కల్పించారు. సదస్సులో తెలుసుకున్న విషయాలను పొదుపు సంఘాల సభ్యులకు వివరించి అవగాహన కల్పించాలని ఏపీఎం శ్రీధర్ సూచించారు. ఈ కార్యక్రమంలో సుమలత, కమల, సీసీలు, తదితరులు పాల్గొన్నారు.

డీఐఈవో సుబ్బారావు బాధ్యతల స్వీకరణ

నెల్లూరు(విద్య), ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి) : జిల్లా ఇంటర్ విద్యాశాఖాధికారిగా వీవీ సుబ్బారావు బుధవారం నగరంలోని ఇంటర్ బోర్డు కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా కాంట్రాక్ట్ లెక్చరర్స్ జేఏసీ రాష్ట్ర కోచైర్మన్ కల్లూరి శ్రీనివాస్ ఆయనను అభినందించి తమ సమస్యల పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో కాంట్రాక్ట్ లెక్చరర్స్ ప్రతినిధులు సుదర్శన్ రావు, సుబ్బారావు, నారాయణ, బాలపున్నమ్మ, పద్మావతి తదితరులు పాల్గొన్నారు.

● **అభినందనలు**

డీఐఈవోగా బాధ్యతలు చేపట్టిన సుబ్బారావును జిల్లా కాంట్రాక్ట్ లెక్చరర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఐ.సునీల్‌శర్మ పుష్పగుచ్ఛం అందచేసి అభినందనలు తెలిపారు. జిల్లాలోని కాంట్రాక్ట్ లెక్చరర్ల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి పీ.కోటేశ్వరరావు, కోశాధికారి సురేష్, నిర్వాహక కార్యదర్శి జి.గౌతమ్, నేతలు పాల్గొన్నారు.

నేటి నుంచి వేసవి సెలవులు

జిల్లాలోని అన్ని మేనేజ్‌మెంట్‌ల పాఠశాలలకు ఏప్రిల్ 24 (నేటి నుంచి) జూన్ 11 వరకు వేసవి సెలవులను ప్రకటిస్తున్నట్లు డీఈవో డాక్టర్ ఆర్.బాలాజీరావు ఒక ప్రకటనలో తెలిపారు. పాఠశాలలన్నీ జూన్ 12వతేదీన తిరిగి పునః ప్రారంభమవుతాయన్నారు. సెలవుల్లో ఎట్టి పరిస్థితుల్లోనూ తరగతులు నిర్వహించరాదని, నిబంధనలు అతిక్రమించి తరగతులు నిర్వహిస్తే శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

టెన్త్‌లో రామయ్య బడి విద్యార్థుల ప్రతిభ

నెల్లూరు(విద్య), ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి) : టెన్త్ ఫలితాల్లో మూలాపేటలోని నగరపాలక ఉన్నత పాఠశాల(రామయ్య బడి)కు చెందిన ఎం.లహరి 576, ఎ.శరణ్య 574, ఎస్.దివ్య 573, ఎల్.రామ్‌చరణ్ 549, షామీర్ 524, మన్మధరావు 515, జాస్మిన్ 512, ప్రశాంత్ 509, శ్రీరామ్ 505 మార్కులు సాధించారు. ఈ సందర్భంగా పాఠశాల సిబ్బంది విద్యార్థులను అభినందించారు.

భూసార పరీక్షలపై అవగాహన

సైదాపురం, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అనంతమడుగు, లింగసముద్రం గ్రామాల్లోని రైతు సేవా కేంద్రాల పరిధిలో రైతులకు భూసార పరీక్షలపై ఏవో హైమావతి బుధవారం అవగాహన సదస్సులు నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయ భూముల్లో మట్టినమూనాలు సేకరించి పంటలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో రాజశేఖర్, శ్యామ్, కుమారి పాల్గొన్నారు.

● **మనుబోలు:** ప్రతీ రైతు వారి పొలాల్లో మట్టి పరీక్షలు తప్పనిసరిగా చేయించాలని ఎంఏవో జహీర్ తెలిపారు. మండలంలోని జట్లకొండూరులో బుధవారం పొలాల్లోంచి మట్టిపరీక్షల కోసం మట్టినమూనాలు సేకరించారు. 1246 మట్టినమూనాలు సేకరించాలని లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. మట్టి పరీక్షలు చేయిస్తేనే ప్రభుత్వం జింకు, జిప్సం ఉచితంగా ఇస్తుందని చెప్పారు.

‘పది’లో బాలికల ప్రతిభ

బుచ్చిరెడ్డిపాళెం, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): పదవ తరగతి ఫలితాల్లో మండలంలో పలు ప్రభుత్వ పాఠశాలల్లో బాలికలు అత్యుత్తమ ప్రతిభ కనబరిచారు. బెజవాడ బుజ్జమ్మ ప్రభుత్వ జడ్పీ హైస్కూల్‌లో వవ్వేటి సగ్నశ్రీ 591 మార్కులు సాధించింది. ఈ మార్కులతో ట్రిపుల్ ఐటీలో సీటు సాధించాలన్న కల నేరవేరుతుందని విద్యార్థి, తల్లిదండ్రులు ఆనందం వ్యక్తం చేశారు. అలాగే మండలంలోని రామచంద్రాపురంలోని గురుకుల పాఠశాలలో విద్యార్థులు 98 శాతం ఉత్తీర్ణత సాధించారు. బెజవాడ బుజ్జమ్మ జడ్పీ హైస్కూల్లో 76 శాతం, మినగల్లు జడ్పీ హైస్కూల్‌లో 62, పెనుబల్లి జడ్పీ హై స్కూల్లో 65, డీఎల్ఎన్ఆర్ జడ్పీ హైస్కూల్లో 47, దామరమడుగు జడ్పీ హైస్కూల్లో 45, రేబాల జడ్పీ హైస్కూల్‌లో 44 శాతం ఉత్తీర్ణత సాధించినట్టు సీఆర్‌పీ మల్లేశ్వరరెడ్డి తెలిపారు.



మనుబోలు హైస్కూల్లో విద్యార్థిని లక్ష్మీసాహితికి స్వీటు తినిపిస్తున్న హెచ్ఎం, విద్యాకమిటీ సభ్యులు, ఉపాధ్యాయులు



వవ్వేటి సగ్నశ్రీ

● **60 శాతం ఉత్తీర్ణత**

మనుబోలు, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం బుధవారం విడుదల చేసిన పదోతరగతి ఫలితాల్లో మండ లంలో 60శాతం ఉత్తీర్ణత సాధించింది. మండలంలో ఆరు ప్రభుత్వ, ఒక ప్రైవేట్ పాఠశాల ఉన్నాయి. వీటినుంచి 210మంది పరీక్షలు రాయగా 125మంది మాత్రమే ఉత్తీ ర్ణులయ్యారని ఎంఈవో-2 రమేష్ తెలిపారు. మండల టాపర్‌గా మనుబోలు పాఠశాలకు చెందిన తంబరపు లక్ష్మీసాహితి (571) నిలిచింది. అదే పాఠశాలకు చెందిన కే. మౌనిక (570) మండలంలో ద్వితీయ స్థానం దక్కించుకుంది. వీరిని ఆ పాఠశాల హెచ్ఎం. డేవిడ్, విద్యాకమిటీ చైర్మన్ బండికట్టు రవీంద్ర, ఇతర ఉపాధ్యా యులు అభినందించారు.

● **పొదలకూరు :** పదో తరగతి పరీక్షా ఫలితాల్లో ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులు అత్యుత్తమ ఫలితాలు సాధించి ప్రతిభ కనపరిచారు. పొదలకూరు లోని డీఎన్ఆర్ జడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో ఎం సాయిదేవకి 591 మార్కులు సాధించింది. తాటిపర్తి హైస్కూల్‌లో తనిష్క 586, బాలుర ఉన్నత పాఠశాలలో వి.శ్రీనివాసులు 582, విరువూరు జడ్పీ హైస్కూల్‌లో లహరి 576, ఆర్.పూర్ణిమ 559 మార్కులు సాధించారు. వీరిని అయా పాఠశాలల హెచ్ఎంలు అభినందించారు.

● **వెంకటాచలం :** మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో పదవ తరగతి పరీక్షా ఫలితాల్లో 76 శాతం విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. మండలంలోని 8 జెడ్పీ ఉన్నత పాఠశాలల్లో 394 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 299 మంది విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారు. మండలంలో మూడు రెసిడెన్షియల్ పాఠశాలల్లో 93 శాతం ఉత్తీర్ణత సాధించారు. గొలగమూడి సమీపంలోని బీసీ గురుకుల బాలికల పాఠశాల విద్యార్థిని బీ పూజిత 588 మార్కులతో ప్రథమ స్థానంలో నిలిచారు. స్వర్ణభారత్ ట్రస్ట్ ప్రాంగణంలో ఉన్న స్వర్ణభారతీ విద్యామందిర్ విద్యార్థి ఎం మన స్విని 589 మార్కులతో మండలంలోనే ప్రథమస్థానంలో నిలిచారు.

విద్యార్థులు, వృద్ధులకు అన్నదానం

బుచ్చిరెడ్డిపాళెం, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి) : బుచ్చిరెడ్డిపాళెంలోని డీఎల్ఎన్ఆర్ హైస్కూలు సమీపంలోని ప్రగతి చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న బధిరుల పాఠశాలలో విద్యార్థులకు, విలియమ్స్‌పేటలోని శ్రీకృష్ణ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వృద్ధాశ్రమంలో వృద్ధులకు పంచేడుకు చెందిన పెనాక అమరనాథరెడ్డి, పూనూరు కృష్ణారెడ్డి బుధవారం అన్నదానం చేశారు. అనంతరం విద్యార్థుల స్థితిగతులు గురించి అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో స్కూలు కరస్పాండెంట్ ప్రకాష్, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.



భోజనానికి ముందు ప్రార్థన చేస్తున్న బధిర విద్యార్థులు

దుకాణాల వేలం అడ్డుకున్న బీజేపీ, సీపీఎం

బుచ్చిరెడ్డిపాళెం, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): బుచ్చి నగర పంచాయతీలో బుధవారం నిర్వహించిన దుకాణాల వేలం పాటలను స్థానిక బీజేపీ, సీపీఎం నాయకులు అడ్డుకున్నారు. దీంతో వేలం పాటల్లో గందరగోళం పరిస్థితి నెలకొంది. కమిషనర్, పాటదారుల మధ్య వాగ్వాదాలు జరిగాయి. దీంతో కమిషనర్ బాలకృష్ణ పాటలను వాయిదా వేశారు. జీవనోపాధి కోసం వచ్చిన పేద, మధ్య తరగతి వ్యాపారుల నుంచి డిపాజిట్ పేరుతో లక్షలు తీసుకోవడం సరికాదని నాయకులు హెచ్చరించారు. ఎస్సీ కేటగిరీ రిజర్వేషన్లు సైతం కమిషనర్ మార్చేస్తున్నారని ఆవేదన చెందారు. అధ్వానంగా ఉన్న దుకాణాలకు మరమ్మతులు చేయించి వేలం పాటలు నిర్వహించాలని కోరారు.



వేలం పాటల్లో కమిషనర్‌ను అడ్డుకుంటున్న బీజేపీ, సీపీఎం నాయకులు

నెల్లూరు కార్పొరేషన్ ఈఈకి నోటీసులు

● అవినీతి ఆరోపణలపై వివరణ కోరిన ప్రిన్సిపల్ సెక్రటరీ

నెల్లూరు(సిటీ), ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): నెల్లూరు నగర కార్పొరేషన్‌లోని ఇంజనీరింగ్ విభాగం ఈఈ అళహరి శేషగిరిరావు, డీఈ శ్రీనివాసరావు, ఏఈలు షేక్ ఫాజిల్, ఖాదర్‌లపై విజిలెన్స్ నివేదిక ఆధారంగా జరిగిన విచారణ అనంతరం వారి వివరణ కోరుతూ ప్రభుత్వ ముఖ్యకార్యదర్శి సురేష్‌కుమార్ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. గతంలో ప్రత్యేక అభివృద్ధి నిధుల(ఎస్డీఎఫ్)లో ఈ నలుగురు అధికారులు అవినీతి ఆరోపణలు ఎదుర్కొన్న నేపధ్యంలో విజిలెన్స్ విచారణలో వాస్తవాలని తేలినట్లు సమాచారం. ఈ మేరకు ఆ నివేదిక ఆధారంగా 15 రోజుల్లోగా లిఖితపూర్వక వివరణ అందించాలని, లేకపోతే నివేదికనే ప్రమాణికంగా తీసుకుని చర్యలుంటాయని హెచ్చరిస్తూ ఆదేశాలిచ్చారు. విజిలెన్స్ నివేదిక, అవినీతి ఆరోపణలపై పూర్తి సమాచారం అందాల్సి ఉంది.

29, 30 తేదీల్లో రంగా వర్సిటీ వజ్రోత్సవాలు

అమరావతి, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం వజ్రోత్సవాలు ఈ నెల 29, 30 తేదీల్లో జరగనున్నాయి. 1964 జూన్ 12న హైదరాబాద్‌లోని రాజేంద్రనగర్‌లో ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ విశ్వవిద్యాలయం స్థాపించగా, దీనికి 1996 నవంబరు 7న ప్రముఖ పార్లమెంటేరియన్ ఆచార్య ఎన్జీ రంగా పేరు పెట్టారు. రాష్ట్ర విభజన తర్వాత హైదరాబాద్ నుంచి 2016 మేలో గుంటూరు జిల్లా లాం వద్దకు విశ్వవిద్యాలయాన్ని మార్చారు. వజ్రోత్సవ వేడుకలకు రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్, సీఎం చంద్రబాబు, పలువురు కేంద్ర, రాష్ట్ర మంత్రులు, ప్రముఖులను వర్సిటీ అధికారులు ఆహ్వానించా రు. ఈ సందర్భంగా ఎగ్జిబిషన్ స్టాల్స్, రైతు చర్చాగోష్ఠులు ఏర్పాటు చేస్తున్నారు.

పశు, మత్స్య పరిశోధనకు 195.73కోట్లు

అమరావతి, ఏప్రిల్23(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో పశు, మత్స్య పరిశోధనకు సంబంధించి 2025-26 బడ్జెట్ కేటాయింపులకు అనుగుణంగా రూ.195.73కోట్ల విడుదలకు ప్రభుత్వం పరిపాలన అనుమతిస్తూ బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. తిరుపతిలోని ఎస్వీ వెటర్నరీ యూనివర్సిటీకి రూ.154.57కోట్లు, ఏపీ ఫిషరీస్ యూనివర్సిటీకి రూ.38కోట్లు, పులివెందులలోని సెంటర్ ఫర్ అడ్వాన్స్డ్ రీసెర్చ్ ఆన్ లైవ్‌స్టాక్‌కు రూ.3కోట్లు, మత్స్య, పశుసంవర్ధక, పాడి పరిశ్రమాభివృద్ధి సచివాలయ ఆర్థిక అవసరాలకు రూ.16.15లక్షలు కేటాయించారు.

● **ఉద్యాన వర్సిటీకి 97.87 కోట్లు**

పశ్చిమగోదావరి జిల్లా వెంకట్రామన్నగూడెంలోని డాక్టర్ వైఎస్సార్ ఉద్యాన విశ్వవిద్యాలయానికి 2025-26 బడ్జెట్ అంచనా ప్రకారం రూ.97.87 కోట్లు ప్రభుత్వం మంజూరు చేసింది. వర్సిటీ ఉద్యోగుల జీతాలు, కంటింజెన్స్, వాటర్ చార్జీలు, స్కాలర్‌షిప్‌లు, స్టైఫండ్స్, వాహనాలకు కలిపి ఈ మొత్తాన్ని కేటాయించింది.

ఉగ్రవాద దాడి పిరికిపంద చర్య : జనసేన

వెంకటాచలం, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): జమ్ము కశ్మీర్‌లోని పహల్గామ్ ప్రాంతంలో టూరిస్టులపై ఉగ్రవాదులు జరిపిన దాడిని పిరికిపంద చర్యగా సర్వేపల్లి నియోజకవర్గ జనసేన పార్టీ సమన్వయకర్త బొబ్బేపల్లి సురేష్ నాయుడు అభివర్ణించారు. మండలంలోని సర్వేపల్లి గ్రామంలో బుధవారం సాయంత్రం జనసేన పార్టీ ఆధ్వర్యంలో ఉగ్రవాద దాడిలో ప్రాణాలు కోల్పోయిన వారికి కొవ్వొత్తులతో సంతాపం తెలియజేశారు. కార్యక్రమంలో జనసేన నేతలు పినిశెట్టి మల్లికార్జున్, సందూరి శ్రీహరి, చల్లా చెంచయ్య, మణి, షేక్ రహీమ్, అశోక్, సుమన్, కిరణ్, ఏడుకొండలు తదితరులున్నారు.




కొవ్వొత్తులతో నివాళులర్పిస్తున్న జనసేన నాయకులు

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

● కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి

విడవలూరు, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): ప్రజా సంక్షేమమే లక్ష్యంగా ప్రభుత్వం పని చేస్తుందని కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి తెలిపారు. స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో బుధవారం ప్రత్యేక ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. అనంతరం రైతులకు స్ప్రేయర్లు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి హామీని నెరవేరుస్తూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రజా రంజక పాలన సాగిస్తున్నారన్నారు. కోవూరు నియోజకవర్గంలో సకాలంలో కాలువల పూడికతీసి సాగునీరు అందించటమే కాకుండా ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి ధాన్యం అమ్మకాల్లో రైతులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చేశామన్నారు. తద్వారా సకాలంలో ధాన్యం నగదు రావటంతో రైతులు ఆనందంగా ఉన్నారన్నారు. విడవలూరులో అసంపూర్తిగా ఉన్న మినీ క్రీడా కేంద్రాన్ని పూర్తి చేస్తామన్నారు. త్వరలో కాలనీల్లో పర్యటించి వారి సమస్యలను అడిగి తెలుసుకుంటానన్నారు. అనంతరం కుట్టు శిక్షణ కేంద్రాన్ని ప్రారంభించి మహిళలతో మాట్లాడారు. ఈ కార్యక్ర మంలో తహసీల్దారు చంద్రశేఖర్, ఎంపీపీ ఏకుల శేష మ్మ, ఎంపీడీవో నగేష్‌కుమారి, ఈస్టర్న్ చానల్ డీసీ చైర్మన్ పాశం శ్రీహరిరెడ్డి, మండల ఇన్‌చార్జి అడపాల శ్రీధర్‌రెడ్డి, నాయకులు బెజవాడ వంశీ కృష్ణారెడ్డి, సత్యవోలు సత్యంరెడ్డి, చెముకుల శ్రీనివాసులు, పొన్నలూరు పురంధర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



అర్జీలు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి

రైతుల వాటా చెల్లింపునకు చొరవ తీసుకోవాలి

బుచ్చిరెడ్డిపాళెం, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): షుగర్ ఫ్యాక్టరీలో రైతులకు వాటా ధనం చెల్లించేందుకు ప్రత్యేక చొరవ తీసుకోవాలని దామరమడుగు చెరకు రైతులు కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డిని కోరారు. బుధవారం వారు నెల్లూరులోని ఎమ్మెల్యే నివాసంలో ప్రశాంతిరెడ్డితో భేటీ అయ్యారు. ఫ్యాక్టరీకి సంబంధించిన వివిధ అంశాలపై చర్చించారు. ఎంతో విలువైన షుగర్ ఫ్యాక్టరీ భూములను ప్రైవేటు పరం కాకుండా చూడడంతోపాటు కాలుష్య రహిత పరిశ్రమలు ఏర్పాటుతోపాటు వీలైనంత త్వరగా బాధిత రైతు కుటుంబాలకు న్యాయం చేయాలని కోరారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ గత ఎన్నికల్లో షుగర్ ఫ్యాక్టరీ కార్మికులకు, రైతులకు ఇచ్చిన హామీ మేరకు సీఎం చంద్రబాబునాయుడితో చర్చించిన తరువాత నిర్ణయం తీసుకున్నామని తెలిపారు. భూములను ఏపీఐఐసీకి కేటాయించి కాలుష్య రహిత పరిశ్రమల ఏర్పాటుకు నిర్ణయించినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు కమలాకర్‌రెడ్డి, వంశీకృష్ణారెడ్డి, జగదీష్, శేషయ్య, రైతులు సోమారెడ్డి, మల్లికార్జున, హరిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



మీ శ్రేయస్సును కోరే వారికి అందించండి
పదవీ విరమణ శుభాకాంక్షలు
ఆంధ్రజ్యోతి అందిస్తుంది సులువైన మార్గం
25% తగ్గింపు
5% GST is Applicable on Bill Amount
మీ ఆత్మీయులలో...
మీ సహోద్యోగులలో...
మీ కుటుంబ సభ్యులలో..
మీ స్నేహితులలో...
ఎవరైనా రిటైర్ అవుతున్నారా ?
అలాంటి వారు తమ విధినిర్వహణలో మీకు ఎన్నో సలహాలు, సూచనలు ఇచ్చి వుంటారు. అయితే వారికి తీపిగుర్తుగా మీ అమూల్యమైన కానుకగా ఆంధ్రజ్యోతి ద్వారా అందించండి. పదవీవిరమణ శుభాకాంక్షలు.
పూర్తి వివరాలకు సంప్రదించండి
ఆంధ్రజ్యోతి కార్యాలయము
ప్రకటనల విభాగము
నెం.91, ఉడ్‌కాంప్లెక్స్, అయ్యప్పగుడి దగ్గర, నెల్లూరు. సెల్ : 9985411429
నెల్లూరు : 9985411013, 9985420777, 7013499962, 9985401179, 9985921383, 9985404646
కావలి : 9985411434, 9492769371
నాయుడుపేట : 9985402921, 9493579466
గూడూరు : 9985491777, 9985403226
ఆత్మకూరు : 9652319122

C.R.I.M.E N.E.W.S

పోక్సో కేసులపై దృష్టి పెట్టండి

● రౌడీషీటర్ల కదలికలపై నిరంతర నిఘా ఉంచాలి

● ఏపీఎస్పీ బెటాలియన్ ఐజీ రాజాకుమారి

నెల్లూరు (క్రైం), ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి) : చిన్నపిల్లలు, మహిళలకు సంబంధించిన ఫిర్యాదులపై అలసత్వం ప్రదర్శించవద్దని, పోక్సో కేసులపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఏపీఎస్పీ బెటాలియన్ ఐజీ రాజాకుమారి జిల్లా పోలీసు అధికారులను ఆదేశించారు. బుధవారం నగరంలోని ఉమేష్‌చంద్ర కాన్ఫరెన్స్ హాల్‌లో ఎస్పీ జి కృష్ణకాంత్ నెలవారీ నేర సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశాన్ని జూమ్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఐజీ రాజకుమారి పర్యవేక్షించారు. జిల్లాలో చోటుచేసుకున్న గ్రేవ్, నాన్ గ్రేవ్, ఆస్తి సంబంధిత నేరాలలో రికవరీల గురించి స్టేషన్ల వారీగా అధికారులతో ఐజీ సమీక్షించారు. నేరాల ఛేదనకు సాంకేతికతను అందిపుచ్చుకొనేందుకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఐజీ మాట్లాడుతూ పోలీసు స్టేషన్లలో నమోదయ్యే కేసుల వివరాలను క్షుణ్ణంగా సీసీటీఎన్ఎస్‌లో ఎప్పటికప్పుడు పొందుపరచాలన్నారు. విలేజ్ విజిట్ తప్పకుండా చేయడం ద్వారా రాబోయే సమస్యలను అరికట్టవచ్చని సూచించారు. వేసవిలో దొంగతనాలు, అసాంఘిక కార్యకలాపాల నివారణపై ప్రజలకు అవగాహన కల్పించాలని, విజబుల్ పోలీసింగ్, డ్రోన్ సర్వైలెన్స్ విరివిగా చేయాలని ఆదేశించారు. రౌడీషీటర్ల కదలికలు, కార్యకలాపాలపై నిరంతరం నిఘా ఉంచాలని, తప్పించుకుని తిరుగుతున్న నిందితులను వెంటనే అరెస్ట్ చేసి వారిపై ఉన్న నాన్ బెయిలబుల్ వారెంట్లు అమలు చేయాలని ఆదేశించారు. రాత్రి పూట అన్ని పోలీసుస్టేషన్లలో గస్తీలు ముమ్మరం చేసి అనుమానితుల వేలిముద్రలు సేకరించాలని సూచించారు. అనంతరం ఎస్పీ ఈగల్ టీమ్ ప్లకార్డులను ఆవిష్కరించారు. సమీక్షలో అదనపు ఎస్పీ సీహెచ్ సౌజన్య, లీగల్ అడ్వైజర్ శ్రీనివాసులురెడ్డి, డీఎస్పీలు, సీఐలు, ఎస్ఐ పాల్గొన్నారు.

డిగ్రీ ఫెయిల్ అయ్యానని బలవన్మరణం

నెల్లూరు(క్రైం), ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): డిగ్రీ ఫెయిల్ అయ్యానని మనస్తాపానికి గురైన ఓ యువకుడు ఆత్మహత్యాయత్నానికి పాల్పడి, వైద్యశాలలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. పోలీసుల కథనం మేరకు, నగరంలోని హరనాథపురానికి చెందిన పవన్‌కుమార్‌రె డ్డి(22) డిగ్రీ పరీక్షల్లో ఫెయిల్ అయ్యాడు. దీంతో మనస్తాపానికి గురై గతనెల 31న గడ్డిమందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. చెన్నైలోని ఓ వైద్యశాలలో చికిత్స పొందుతూ మంగళవారం నెల్లూరు లోని ఓ ప్రైవేటు వైద్యశాలకు మార్చారు. వైద్యశాలలో చేరిన కొద్దిసేపటికే మృతిచెందాడు. ఈ మేరకు మృతుడి తండ్రి రవీంద్రరెడ్డి బుధవారం బాలాజీనగర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు మృతదేహాన్ని పరిశీలించి పోస్టుమార్టం నిమిత్తం జీజీహెచ్‌కి తరలించారు. ఎస్ఐ పుల్లారెడ్డి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పెన్నాలో గుర్తుతెలియని మృతదేహం

నెల్లూరు(క్రైం), ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి) : పెన్నానదిలో గుర్తుతెలియనివ్యక్తి మృతదేహం బుధవారం తేలాడుతూ కన్పించింది. దీంతో స్థానికులు వీఆర్‌వో నరేంద్రబాబుకు సమాచారం అందించారు. ఆయన సంతపేట పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసుల సంఘటనా స్థలానికి చేరుకొని స్థానికుల సహకారంతో మృతదేహాన్ని వెలికితీశారు. మృతుడు సుమారు 40 నుంచి 45 ఏళ్లలోపు వయసు కలిగి, ఎరుపు రంగు ప్యాంటు, బులుగు, బిస్కెట్ రంగు పూల డిజైన్ చొక్కా ధరించి ఉన్నాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జీజీహెచ్‌కి తరలించారు. సంతపేట హెడ్‌కానిస్టేబుల్ ఎన్. ఏడుకొండలు ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ప్రాణం తీసిన ఈత సరదా

● ఇంజనీరింగ్ విద్యార్థి మృతి

కొడవలూరు, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): మండలంలోని రేగడిచెలిక గ్రామంలోని ఓ బావిలో ఈత కొడుతూ అనంతపురం జిల్లా కళ్యాణదుర్గంకు చెందిన ఇంజనీరింగ్ విద్యార్థి మృతి చెందిన ఘటన బుధవారం జరిగింది. వివరాల మేరకు.. నార్తురాజుపాలెం గ్రామంలోని ఓ కళాశాలలో చదువుతున్న కర్ణర్ అంజనకుమార్(21) తన మిత్రులు మరో ఐదుగురితో కలసి రేగడిచెలికలో బావిలో ఈత కొట్టేందుకు వెళ్లారు. బావిలో ఈత కొడుతున్న సమయంలో అంజన కుమార్‌కు నీటిలో మునిగి ఊపిరాడక మృతి చెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని వెలికితీయించారు. ఎస్ఐ నరేష్ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నెల్లూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

యువతి ఆత్మహత్య

కొడవలూరు, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): మండలంలోని నార్తురాజుపాలెంలోని ఓ కర్మాగారంలో పనిచేస్తున్న చత్తీస్‌గఢ్‌కు చెందిన సునీత యాలం (21) పరిశ్రమ పరిసర ప్రాంతంలో బుధవారం ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. పరిశీలించిన పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నెల్లూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ఈ మేరకు అనుమానాస్పద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ నరేష్ తెలిపారు.

అనుమానాస్పద వ్యక్తుల పట్టివేత

పొదలకూరు, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చిట్టేపల్లిలోని తిప్ప వద్ద అనుమానాస్పదంగా సంచరిస్తున్న ఇద్దరు మహిళలు, ఒక వ్యక్తిని బుధవారం సాయంత్రం గ్రామస్థులు పట్టుకున్నారు. కావలి, నెల్లూరుకు చెందిన సుహాసిని, రత్నాలు యూపీకి చెందిన రాజేంద్రసింగ్ అనే మరొక వ్యక్తిని తీసుకుని ఆటోలో చిట్టేపల్లి వద్దకు చేరుకున్నారు. అక్కడ తిప్పపై అనుమానాస్పదంగా తిరుగుతుండగా గ్రామస్థులు గమనించి పట్టుకున్నారు. వీరి వద్ద ఉన్న బ్యాగులు తెరిచి చూడగా అందులో చైనా కత్తులు, చిన్నపాటి గునపాలు, తాళాలు ఉండటాన్ని గమనించారు. ఈ సందర్భంగా నిందితులు మాట్లాడుతూ తాము దొంగలము కాదని.. రంగురాళ్ల ఏరుకునేందుకు వచ్చామని చెబుతున్నారు. వీరిని గ్రామస్థులు పోలీసులకు అప్పగించారు.

విద్యుదాఘాతంతో యువకుడికి తీవ్ర గాయాలు

మనుబోలు, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మడమనూరు గ్రామ సమీపంలో ఉన్న ఓ పరిశ్రమలో బుధవారం ముజాయిద్దీన్ అనే యువకుడు విద్యుదాఘాతానికి గురై తీవ్రంగా గాయపడ్డాడు. వివరాలిలా ఉన్నాయి. మడమనూరు గ్రామానికి చెందిన షేక్ ముజాయిద్దీన్ ఆరునెలలుగా పరిశ్రమలో ఎలక్ట్రీషియన్‌గా పని చేస్తున్నాడు. ఈనేపథ్యంలో పరిశ్రమలో పనిచేస్తుండగా మెయిన్ లైన్ నుంచి విద్యుత్ సరఫరా రావడంతో ముజాయిద్దీన్ విద్యుదాఘాతానికి గురై గాయపడినట్లు స్థానికులు తెలిపారు. చికిత్స నిమిత్తం అతన్ని నెల్లూరుకు తరలించగా పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు తెలిపారన్నారు.

నిందితుడి కోసం గాలింపు

సంగం, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): గత నాలుగు సంవత్సరాల నుంచి కోర్టు కేసుకు హాజరు కాకుండా గైర్హాజరవుతున్న నిందితుడు పోలిశెట్టి వెంకటేశ్వర్లు ఆచూకీ తెలిస్తే పోలీస్‌స్టేషన్‌కు తెలియజేయాలని ఎస్ఐ రాజేష్ తెలిపారు. సంగం సాయి నగర్ కాలనీకి చెందిన పోలిశెట్టి వెంకటేశ్వర్లు 2017లో ఓ కేసులో నిందితుడు. కోర్టులో కేసు విచారణ జరుగుతుండగా నిందితుడు హాజరుకావడం లేదు. నాలుగు సంవత్సరాల నుంచి గైర్హాజరవుతున్నాడు. దీంతో సంగం పోలీసులు నిందితుడు పోలిశెట్టి వెంకటేశ్వర్లు ఆచూకీ కోసం గాలిస్తున్నారు. అందులో భాగంగా కనిపించడం లేదని, ఆచూకీ తెలిస్తే పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందించాలని నిందితుడి ఫోటో సమాచారం పలు చోట్ల వాల్ పోస్టర్లు అంటించారు.

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో (రూ.లలో)
బాయిలర్ లైవ్	106
స్కిన్ చికెన్	194
స్కిన్‌లెస్	214

కోడిగుడ్ల ధర (100): 420

27న తాటిపర్తి రోడ్డు ప్రారంభం

నెల్లూరురూరల్, ఏప్రిల్ 23,(ఆంధ్రజ్యోతి): నెల్లూరు - తాటపర్తి రోడ్డును ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి శ్రద్ధ తీసుకుని నిర్మించారని, ఈనెల 27న దాన్ని ప్రారంభించనున్నట్లు టీడీపీ నేత కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి తెలిపారు. బుధవారం దేవరపాళెం వద్ద ప్రారంభోత్సవ ఏర్పాట్లను పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ దేవరపాళెం నుంచి కందమూరు వరకు రహదారి ఛిద్రంగా తయారై ప్రయాణానికి కష్టంగా మారిందన్నారు. ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి చొరవ తీసుకుని ఆధునీకీకరించారని తెలిపారు. ఈ రహదారిని ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, రూరల్ ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డిలతోపాటు మరి కొంతమంది ప్రముఖులు ప్రారంభిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్‌అండ్‌బీ అధికారులు, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.



ప్రారంభోత్సవ ఏర్పాట్లలో గిరిధర్‌రెడ్డి

న్యూస్ బాక్స్

ఘంటసాలకు ఘన నివాళి

● అలరించిన స్వరాంజలి, నృత్య విభావరి



ఘంటసాల, కాకివాయి జయంతిలకు నివాళి, ఎంఆర్ ప్రసాద్‌కు సంతాపం తెలుపుతున్న ప్రముఖులు

నెల్లూరు (సాంస్కృతికం) ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని పురమందిరంలో బుధవారం రాత్రి ఘంటసాల కళానికేతన్ ఆధ్వర్యంలో పద్మశ్రీ ఘంటసాల వెంకటేశ్వరరావు, డాక్టర్ కాకివాయి జశ్వంతి వర్ధంతులను, డాక్టర్ మెట్టు రామచంద్రప్రసాద్ సంతాప సభను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వక్తలు జయప్రకాష్, హరినారాయణరెడ్డి, పాటూరు శ్రీనివాసులు, ఘంటసాల కళానికేతన్ అధ్యక్షుడు ఆనందరావు వారి జ్ఞాపకాలను నెమరువేసుకుని నివాళులు అర్పించారు. అనంతరం పాటూరు శ్రీనివాసులు, ఆయన శిష్యబృందం నిర్వహించిన సంగీత విభావరి ప్రేక్షకులను ఉర్రూతలూగించింది. సురభి గాయత్రి శిష్యబృందం నిర్వహించిన నృత్య విభావరి కనువిందు చేసింది.-

టెన్త్‌లో వీపీఆర్ విద్య విద్యార్థుల ఘనత



గాయత్రి, వైష్ణవి, వర్ష

నెల్లూరు(విద్య), ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి) : టెన్త్ ఫలితాల్లో వీపీఆర్ విద్య పాఠశాల విద్యార్థులు ప్రభంజనం సృష్టించారని పాఠశాల ప్రతినిధులు ఒక ప్రకటనలో తెలిపారు. నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ పాఠశాలలో విద్యార్థులు పి.గాయత్రి 587, వి.వైష్ణవి 584, వి.వర్ష 581 మార్కులు సాధించారన్నారు. అలాగే 500కు పైగా 27 మంది విద్యార్థులు ఉత్తమ మార్కులు సాధించగా, వందశాతం ఫలితాలు సొంతం చేసుకున్నారన్నారు. నిరుపేద కుటుంబాలకు చెందిన విద్యార్థులకు అన్ని సౌకర్యాలను ఉచితంగా అందించి వారికి నాణ్యమైన విద్యను బోధిస్తుండడంతోనే ఈ ఫలితాలు సాధ్యమయ్యాయన్నారు. ఇదే స్ఫూర్తితో ముమ్ముందు మరిన్ని ఉత్తమ ఫలితాలు సాధించేలా విద్యార్థులను తీర్చిదిద్దుతామని వారు తెలిపారు. విద్యార్థులను ఎంపీ దంపతులు అభినందించారన్నారు.

● శ్రీచైతన్య విద్యాసంస్థల్లో...

పది ఫలితాల్లో శ్రీచైతన్య విద్యాసంస్థల విద్యార్థులు అత్యుత్తమ ఫలితాలు సాధించారని విద్యాసంస్థల ఏజీఎం నర్రా శ్రీకాంత్ తెలిపారు. విద్యాసంస్థల్లో జరిగిన అభినందన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ముమ్ముందు మరిన్ని ఉత్తమ ఫలితాలు సాధిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో జోనల్ కోఆర్డినేటర్ భాషా, నాగరాజు, డీన్ కోమల్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.


● రవీంద్రభారతిలో...

పత్తేఖాన్‌పేట రవీంద్రభారతి పాఠశాల విద్యార్థులు ఎస్ఎస్‌సీలో ఉత్తమ ఫలితాలు సొంతం చేసుకున్నారని జోనల్ ఇన్‌చార్జి వై.శ్రీహరి తెలిపారు. పాఠశాలలో జరిగిన అభినందన కార్యక్రమంలో విద్యార్థులకు స్వీట్లు పంపిణీ చేసి అభినందించారు. ఈ కార్యక్రమంలో జోనల్ డీన్ పి.శ్రీనివాసులురెడ్డి, ప్రిన్సిపాల్ ఎం.సుమలత, సిటి ప్రిన్సిపాల్ వి.వంశీకృష్ణ పాల్గొన్నారు.

● శ్రీనేతాజీ పాఠశాలలో...

టెన్త్ ఫలితాల్లో నేతాజీ పైలట్ స్కూల్ విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించారని విద్యాసంస్థ చైర్మన్ ఎంవీ.నేతాజీ సుబ్బారెడ్డి తెలిపారు. పాఠశాలలో బుధవారం నిర్వహించిన అభినందన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. అనంతరం విద్యార్థులను ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రెసిడెంట్ వేదవతి, డైరెక్టర్లు కె.నరేంద్రరెడ్డి, డాక్టర్ ఎస్.సుబ్రామ్, డాక్టర్ అలేఖ్యరెడ్డి, ప్రిన్సిపాల్ జీవీ.సుధ, వైస్ ప్రిన్సిపాల్ కె.స్పందన, హెచ్‌ఎం నరసింహారావు, ఏవో చెంచయ్య పాల్గొన్నారు.

● ఎల్ఎల్ఎఫ్ పాఠశాలలో...



ఎల్ఎల్ఎఫ్ పాఠశాల విద్యార్థులు టెన్త్‌లో ఉత్తమ ఫలితాలు సొంతం చేసుకున్నారని కరస్పాండెంట్ ఈ.కృష్ణచైతన్య తెలిపారు. పాఠశాలలో జరిగిన అభినందన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. అనంతరం విద్యార్థులను అభినందించారు.

● ప్రభుత్వ బడిలో విద్యార్థుల ప్రతిభ

నగరంలోని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచారు. దర్గామిట్ట జడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థులను డిప్యూటీ ఈవో ఎస్‌వి.నాయక్, ఎంఈవో మురళీధర్, హెచ్‌ఎం కృష్ణారెడ్డి, సిబ్బంది అభినందించారు.

మత్స్యభవన్ ఆధునీకీకరణకు ప్రణాళికలు

నెల్లూరు(సిటీ), ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): నగరంలోని 3వ డివిజన్ పరిధిలో ఉన్న మత్స్యభవన్ ఆధునీకరణకు ప్రణాళికలు తయారు చేయాలని కమిషనర్ వైవో. నందన్ ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. పారిశుధ్య పనులు ఆకస్మిక తనిఖీల్లో భాగంగా బుధవారం అక్కడ వెళ్లిన ఆయన మత్స్యభవన్‌ను పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ చేపల క్రయ,విక్రమాలు యథావిధిగా జరుపుతూనే, ఎవరికి ఇబ్బందులు తలెత్తకుండా ఆధునీకీకరణ పనులు జరిగేలా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అక్కడ మరిన్ని మెరుగైన వసతులు కల్పనకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్నారు. అనంతరం రామలింగాపురంలోని అన్న క్యాంటీన్ పరిశీలించి, ఆహార పదార్థాల నాణ్యతను తనిఖీ చేశారు. కాగా 13వ డివిజన్ బాలాజీనగర్ పరిసరాల్లో ఎంహెచ్‌వో చైతన్య పారిశుధ్య పనులను పరిశీలించారు.

● చలివేంద్రాల దాతలకు అభినందనలు

వేసవిని దాహార్తిని తీర్చే దిశగా చలివేంద్రాల ఏర్పాటుకు ముందుకు వస్తున్న దాతలకు అభినందనలు తెలియచేస్తున్నట్లు నగర కమిషనర్ వైవో. నందన్ తెలిపారు. బుధవారం నగరంలోని 45వ డివిజన్ పరిధి వెంకటరామాపురంలో డాక్టర్ పోకల రవి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని టీడీపీ నేత వేమిరెడ్డి విజయభాస్కర్‌రెడ్డితో కలిసి ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు ఇండ్ల రాఘవేంద్రారావు, పుట్టా అజయ్, సురేంద్ర, శ్రీనివాసులు, జితేంద్ర, జిస్సీ, ప్రసాద్ పాల్గొన్నారు.



చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న కమిషనర్ నందన్

కార్పొరేట్‌కు దీటుగా ప్రభుత్వ స్కూళ్లు



కృషినగర్ జడ్పీ హైస్కూల్లో విద్యార్థులతో కలిసి సంబరాలు చేసుకుంటున్న తల్లిదండ్రులు



విద్యార్థినులను అభినందిస్తున్న శేషు స్కూల్ కరస్పాండెంట్ శేషు





అత్యధిక మార్కులు సాధించిన వీబీఆర్ స్కూలు విద్యార్థులు జ్వాలా ప్రగ్నేష్, తేజశ్విని

నెల్లూరురూరల్, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): ఈసారి పది ఫలితాలను కార్పొరేట్ స్కూళ్లకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలు సొంతం చేసుకున్నాయి. నెల్లూరురూరల్ పరిధిలోని ధనలక్ష్మీపురం (కృషినగర్) జడ్పీ హైస్కూల్లో మల్లెల పూజిత 595 మార్కులు సాధించి ఔరా అనిపించుకుంది. నవలాకులతోట జడ్పీ హైస్కూల్లో ఎండీ జువేరియా 594 మార్కులతో సత్తాచాటింది. కాగా పదిలో మంచి ఫలితాలు రావడంతో కృషినగర్ పాఠశాలలో హెల్పింగ్ హ్యాండ్స్ సొసైటీ ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి తల్లిదండ్రులు సంబరాలు చేసుకున్నారు.

'పది'లో ' వీబీఆర్ ' ప్రబంజనం

నెల్లూరు రూరల్లోని ధనలక్ష్మీపురంలో ఉన్న వీబీఆర్ రెసిడెన్షియల్ ఇంగ్లీష్ మీడియం హైస్కూల్ విద్యార్థులు పదో తరగతి ఫలితాల్లో ప్రభంజనం సృష్టించింది. తమ స్కూల్ విద్యార్థి బీహెచ్ఎస్ జ్వాలా ప్రగ్నేష్ 595 మార్కులతో మొదట స్థానంలో నిలిచినట్లు స్కూల్ చైర్మన్ ఊటుకూరు శ్రీనివాసులురెడ్డి, కరస్పాండెంట్ కాటం శ్రీనివాసులురెడ్డి తెలిపారు. బీ తేజశ్విని 594, ఆర్ సిద్దార్థ 592, కే వెంకట కిషోర్‌రెడ్డి 591, కే భార్గవరెడ్డి 591, వై అంజన సౌమ్య 590, ఎం తులసిరాం 590 మార్కులు సాధించారని వారు చెప్పారు. వీరితోపాటు 590 పైన మార్కులు సాధించిన వారు ఏడుగురు, 580 మార్కులు సాధించిన వారు 24 మంది, 570 మార్కులు సాధించిన వారు 53 మంది ఉన్నారని పేర్కొన్నారు. తమ స్కూల్లో పది విద్యార్థులకు ప్రత్యేక తరగతులు, నిపుణులైన వారితో శిక్షణ, అందిస్తున్నామని తెలిపారు. అందువల్లే ఈ మార్కులు తమ సొంతమయ్యాయని చెప్పారు.

'పది' ఫలితాల్లో శేషు ప్రభంజనం

పదో తరగతి ఫలితాల్లో నెల్లూరురూరల్లోని బుజబుజనెల్లూరులో గల శేషు హైస్కూల్ ప్రభంజనాన్ని సృష్టించింది. తమ స్కూల్‌కు చెందిన జీ సౌమ్య దియాన్ని 573 మార్కులతో స్కూల్ మొదట స్థానంలో నిలవగా, 567 మార్కులతో సంతోష్‌కుమార్, 561 మార్కులతో జీ.సాధ్వశ్రీ మూడవ స్థానంలో నిలిచినట్లు కరస్పాండెంట్ బీ శేషుయాదవ్ తెలిపారు. నూటికి నూరుశాతం ఉత్తీర్ణతతో తమ స్కూల్ ప్రత్యేకతను చాటుకున్నదని తెలిపారు.

జడ్పీ చైర్‌పర్సన్ అభినందనలు

నెల్లూరు (జడ్పీ) : టెన్త్ ఫలితాల్లో ఉత్తమ మార్కులతో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులకు జడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ ఒక ప్రకటనలో అభినందనలు తెలిపారు. జడ్పీ యాజమాన్య పరిధిలో 10211 మంది పరీక్షలు రాయగా 7,414 మంది ఉత్తీర్ణత సాధించారని పేర్కొన్నారు. విద్యార్థులతోపాటు ఉపాధ్యాయులకు అభినందనలు తెలుపుతున్నామన్నారు.

● నగరంలోని జనహిత, వాత్సల్య అనాధ శరణాలయం నిర్వహిస్తున్న భారతీయ విద్యా వికాస్ హైస్కూల్ విద్యార్థులు 93 శాతం ఉత్తీర్ణత సాధించారు. 560 మార్కులు సాధించిన ఏ.హేమంత్‌ను ఆడిటర్ లక్ష్మణరావు సన్మానించి రూ.2 వేల బహుమతి అందజేశారు. ఆర్టీసీ విశ్రాంత మేనేజర్ రామలింగేశ్వరరావు రూ.1116 అందజేశారు.

టెన్త్ ఫలితాలలో ప్రైవేటు పాఠశాలల హవా..!



డాక్టర్ కిషోర్స్ రత్నం పాఠశాలలో జరిగిన అభినందన కార్యక్రమం



ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులతో నారాయణ యాజమాన్యం

నెల్లూరు(విద్య), ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి) : పదో తరగతి పరీక్ష ఫలితాల్లో జిల్లాలోని పలు ప్రైవేట్ విద్యాసంస్థల విద్యార్థులు తమ హవా కొనసాగించారు. బాలబాలికలు ఎవరికి వారు పోటీపడి అత్యుత్తమ మార్కులు సొంతం చేసుకున్నారు. ఈ సందర్భంగా ఆయా యాజమాన్యాలు హర్షం వ్యక్తం చేస్తూ విద్యార్థులను అభినందించాయి.

● డాక్టర్ కిషోర్స్ రత్నం పాఠశాలల్లో ...

పది ఫలితాల్లో డాక్టర్ కిషోర్స్ రత్నం విద్యాసంస్థల విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించారని జనరల్ మేనేజర్ రామ్మూర్తినాయుడు తెలిపారు. బుధవారం పాఠశాలలో జరిగిన అభినందన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. తమ విద్యాసంస్థలకు చెందిన ఎస్.నారాయణ్ 595 మార్కులు, ఎ.ఉదయ్‌ప్రణవ్ 594, సీహెచ్.నవదీప్ 594, వై.చరణ్‌తేజ్ 593, వై.రాహిణి 593, ఎస్.రిషికారెడ్డి 592, డి.రిషితా 592, ఎస్‌కె.నఫియానుహానా 591, ఎస్.సాయిశ్రీ 591, యు.హంసిని 590, టి.మధులిక 590, ఎం.పూజితారెడ్డి 590, గిరివర్ధన్ 590 మార్కులు సాధించారన్నారు. మొత్తం మీద 590 మార్కులపైన 12 మంది, 580 మార్కులపైన 40 మంది, 550కు పైగా 136 మంది, 500కుపైగా 251 మంది ఫలితాలు సాధించారన్నారు. అనంతరం విద్యార్థులను డైరెక్టర్లు డాక్టర్ కృష్ణకిషోర్, వాసంతికిషోర్, రోషిణి, ఈశ్వర్ ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో మేనేజర్లు రాజేష్, అజయ్‌సింగ్, ఏవో తుహీనా తదితరులు పాల్గొన్నారు.

● రత్నం హైస్కూల్‌లో...

లక్ష్మీపురం రత్నం హైస్కూల్ విద్యార్థులు టెన్త్‌లో ఉత్తమ ఫలితాలు సాధించారని కరస్పాండెంట్ వేణు తెలిపారు. బుధవారం పాఠశాలలో జరిగిన అభినందన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. తమ పాఠశాలకు చెందిన టి.బద్రీనాథ్ 596 మార్కులు, బి.చారుమతి 593, పి.సంతోష్ 592, కె.మోహనిష్ 591, ఎం.సాత్విక 590 మార్కులు సాధించారన్నారు. వీరితోపాటు 580 మార్కులకు పైగా 20 మంది, 550కుపైగా 67 మంది, 500కు పైగా 106 మంది ఫలితాలు సాధించారన్నారు. అనంతరం విద్యార్థులను ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

● నారాయణ విద్యా సంస్థల్లో...

పదో తరగతి ఫలితాల్లో నారాయణ విద్యాసంస్థల విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సొంతం చేసుకున్నారని విద్యాసంస్థల డైరెక్టర్ పొంగూరు రమాదేవి తెలిపారు. బుధవారం నగరంలోని నారాయణ విద్యాసంస్థలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. తమ విద్యార్థుల్లో గొల్లా దీక్షిత 598 మార్కులతో జిల్లాలోనే అగ్రస్థానంలో నిలిచిందన్నారు. అలాగే కె.కుందన వర్షిత, కె.సాయిబిల్వేష్, ఐ.తన్వి, బి.రోహన్‌వరుణ్, భవ్యశ్రీలు 597 మార్కులు, వెంకటజితేష్‌కుమార్‌రెడ్డి, టి.తనూష, ఎస్‌కె.సుమైరా, ఎన్.దీపక్‌సాయి, వి.ప్రలేఖ్యారెడ్డి, బి.వెంకటకార్తిక్, జి.వెంకటలక్ష్మీనేహ, కె.జీతులు 596 మార్కులు సాధించారన్నారు. వీరితో పాటు 595కు పైగా 26 మంది, 590కు పైగా 139, 580కు పైగా 381, 570కు పైగా 609 మంది విద్యార్థులు ఫలితాలు సాధించారన్నారు. అనంతరం విద్యార్థులను ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో విద్యాసంస్థల జీఎం వేమిరెడ్డి విజయభాస్కర్‌రెడ్డి, ఏజీఎంలు డీన్‌లు, ప్రిన్సిపాల్స్, సిబ్బంది పాల్గొన్నారు.

● సిటి స్కూల్‌లో...

నగరంలోని సిటి స్కూల్ విద్యార్థులు టెన్త్‌లో ఉత్తమ ఫలితాలు సాధించారని కరస్పాండెంట్ పి.మల్లికార్జున తెలిపారు. పాఠశాలలో జరిగిన అభినందన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. తమ పాఠశాల విద్యార్థులు దేవ మురుగన్ 593, అసజాద్‌అహ్మద్ 589, లేఖశ్రీ 584, దర్శిల్ 583 మార్కులు సాధించారన్నారు. అనంతరం విద్యార్థులను అభినందించారు.

● శ్రీలక్ష్మీ పాఠశాలలో...

నగరంలోని శ్రీలక్ష్మీ పాఠశాల విద్యార్థులు టెన్త్‌లో ఉత్తమ మార్కులు సాధించారని కరస్పాండెంట్ సి.శ్రీనివాస్ తెలిపారు. పాఠశాలలో జరిగిన అభినందన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. తమ విద్యార్థిని ఎస్‌డి.నాజియా 564 మార్కులతో అగ్రస్థానంలో నిలిచిందన్నారు. అలాగే మిగిలిన విద్యార్థులు 96శాతం ఫలితాలు సాధించారన్నారు. అనంతరం విద్యార్థిని ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

● శ్రీసింహపురి పాఠశాలలో...

టెన్త్ ఫలితాల్లో శ్రీసింహపురి పాఠశాల విద్యార్థులు మంచి ఫలితాలు సాధించారని హెచ్‌ఎం వై.మోహన్‌రాజు తెలిపారు. పాఠశాలలో జరిగిన అభినందన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ తమ విద్యార్థులు కె.కృష 563, ఏవీఎస్.స్నేహప్రియ 563, ఏవీఎస్.స్నేహవల్లి 553, కె.లక్ష్మీతేజు 544, డి.లోహిత 530 మార్కులు సాధించారన్నారు. అందరి సమష్టి కృషితోనే ఈ ఫలితాలు సాధించామని తెలిపారు. అనంతరం విద్యార్థులను అభినందించారు.

● శ్రీగీతాంజలిలో....

గీతాంజలి పాఠశాలకు చెందిన విద్యార్థులు టెన్త్‌లో ఉత్తమ మార్కులు సాధించారని కరస్పాండెంట్ వెంకటరామయ్య తెలిపారు. పాఠశాలలో జరిగిన అభినందన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ తమ విద్యార్థులు నస్నికుమారి 583, వై.కుశల్ 575, వై.నవదీప్ 575, జె.కీర్తన 551 మార్కులు సాధించారన్నారు. అనంతరం విద్యార్థులను ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం కె.ప్రసన్నలక్ష్మి, ఉపాధ్యాయులు శారద, రాజ్యశ్రీ, శ్రీనివాస్, వేణు, ప్రసాద్, మురళి తదితరులు పాల్గొన్నారు.

● ఓవెల్ పాఠశాలలో..

టెన్త్ ఫలితాల్లో ఓవెల్ పాఠశాల విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచారని కరస్పాండెంట్ ఆర్.వేణు తెలిపారు. బుధవారం పాఠశాలలో జరిగిన అభినందన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. అనంతరం విద్యార్థులను అభినందించారు. ఈ కార్యక్రమంలో సీఈవో ప్రమీల, జీఎం మహదేవయ్య, ఈడీ బాలు పాల్గొన్నారు.



రాజరాజేశ్వరి ఆలయ విమాన గోపురానికి పూజలు చేస్తున్న ఏసీ జనార్దన్‌రెడ్డి

రాజరాజేశ్వరి ఆలయంలో పంచనామా

నెల్లూరు (సాంస్కృతికం) ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని రాజరాజేశ్వరి ఆలయంలో అమ్మవారి విమాన గోపురం పునఃనిర్మాణం సందర్భంగా బుధవారం దేవదాయ, పోలీసు, రెవెన్యూ శాఖ అధికారులు పంచనామా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ సహాయ కమిషనర్ జనార్దన్‌రెడ్డి గాలి గోపురానికి పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు.

రేపు సిద్ధివిఘ్నేశ్వరాలయ వార్షికోత్సవం



స్వామివారికి అలంకరించనున్న కొత్త స్వర్ణ మకర తోరణం

నెల్లూరు (సాంస్కృతికం) ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి) :నగరంలోని పప్పులవీధిలో గల సిద్ధివిఘ్నేశ్వరాలయంలో శుక్రవారం 41వ వార్షికోత్సవం నిర్వహించనున్నట్లు ఆలయ చైర్మన్ బయ్యా ప్రసాద్, కమిటీ సభ్యులు తెలిపారు. బుధవారం ఆలయంలో వారు బ్రోచర్లు ఆవిష్కరించారు. శుక్రవారం ఉదయం నదీ తీర్థగ్రహణం, ఆలయ ప్రవేశం, మధ్యాహ్నం 12గంటల వరకు ప్రత్యేక పూజలు, హోమాలు జరుగుతాయని తెలిపారు. మధ్యాహ్నం 12.15గంటలకు మహాకుంభాభిషేకం, సాయంత్రం 5గంటలకు సిద్ధివిఘ్నేశ్వరస్వామికి నూతన స్వర్ణ మకర తోరణం అలంకరణ జరుగుతుందని తెలిపారు. అనంతరం సిద్ధి,బుద్ధి సమేత విఘ్నేశ్వరుడికి పుష్పయాగం నిర్వహించనున్నట్లు తెలిపారు. పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొని కార్యక్రమాలను విజయవంతం చేయాలని కోరారు.

బహిరంగ ప్రకటన

[illegible]


Perepi Venugopal, B.Com, B.L., Advocate, Tekkemitta, Nellore. Cell : 8374259528

బహిరంగ ప్రకటన

[illegible]

Perepi Venugopal, B.Com, B.L., Advocate, Tekkemitta, Nellore. Cell : 8374259528





ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
5
తిరుపతి
జిల్లా వార్తలు
గురువారం 24 ఏప్రిల్ 2025

ఆంధ్రజ్యోతి పాఠకులకు గమనిక

ఆంధ్రజ్యోతి కొత్త చందాదారులుగా చేరదలచుకున్న వారు అలాగే ప్రస్తుత చందాదారులకు పేపరు పంపిణీ విషయంలో ఎలాంటి సమస్యలు ఎదురైనా ఈ క్రింది ఫోన్ నెంబర్లకు సంప్రదించగలరు.

తిరుపతి, చంద్రగిరి, రేణిగుంట	: 99854 38368
చిత్తూరు, పూతలపట్టు, గంగాధర నెల్లూరు	: 99854 10940
పలమనేరు, కుప్పం, పుంగనూరు	: 97036 18724
మదనపల్లి, పీలేరు, తంబళ్ళపల్లి	: 99854 22298
శ్రీకాళహస్తి, పుత్తూరు, నగరి, సత్యవేడు	: 99890 59755



ఇంద్రజ ఇంటికి వెళ్లి ఇంద్రజను సన్మానిస్తున్న డీఈవో కుమార్

పేదింట మెరిసిన విద్యాకుసుమం

వెంకటగిరి టౌన్, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): పేదింట విద్యాకుసుమం మెరిసింది. ప్రభుత్వ యాజమాన్య పాఠశాలల్లో జిల్లాలో టాపర్‌గా కలపాటి ఇంద్రజ నిచిచింది. డక్కిలి మండలం చాపలపల్లి హరిజన వాడకు చెందిన మోహన్, వరలక్ష్మి దంపతుల కుమార్తె ఇంద్రజ 5వ తరగతి నుంచి వెంకటగిరి గురుకుల పాఠశాలలో చదువుతోంది. దాతల ప్రోత్సాహం సద్వినియోగం చేసుకుంది. టెన్త్‌లో 600కిగాను 594 మార్కులు సాధించింది. 'మా పాఠశాలకు కలెక్టర్ రెండుసార్లు వచ్చారు. ఆయన్ను ఆదర్శంగా తీసుకుని నేనూ ఐఏఎస్ కావాలనే పట్టుదలతో చదువులో రాణించాలనుకున్నా. అమ్మ, నాన్న కూలి పనులు చేసుకుంటున్నారు. వారి శ్రమ వృథా కాకుండా ఉండేందుకు నేను కష్టపడి చదివా'నని ఇంద్రజ చెప్పారు. కాగా, ఫలితాలు విడుదలయ్యాక డీఈవో కుమార్ తదితరులు చాపలపల్లి హరిజన వాడకు వెళ్లి ఇంద్రజకు శాలువాకప్పి సన్మానించారు. రూ.లక్ష నగదు అందజేశారు.

సాయివైశాలి @ 598

గూడూరు, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): గూడూరుకు చెందిన శ్రీచైతన్య పాఠశాల విద్యార్థిని సాయివైశాలి పదో తరగతిలో 598 మార్కులు సాధించింది. రాష్ట్రస్థాయిలో మూడో స్థానంలో నిలిచింది. ఈమె తండ్రి రామసాయి ఎన్‌డీసీసీ బ్యాంకులో సూపర్‌వైజర్‌గాను, తల్లి పద్మజ చిల్లకూరు గిరిజనకాలనీలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయురాలిగా పనిచేస్తున్నారు. తమ కుమార్తె రాష్ట్రస్థాయిలో మూడో స్థానంలో నిలవడం ఎంతో ఆనందంగా ఉందని తల్లిదండ్రులు తెలిపారు. 'చిన్నతనం నుంచే చదువు పట్ల శ్రద్ధతో ఉండేది. క్రమశిక్షణతో, ప్రణాళికాబద్ధంగా చదివింది. పాఠశాలలో ప్రిన్సిపాల్, సిబ్బంది ప్రత్యేక శ్రద్ధ చూపారు. ఐఏఎస్ కావాలన్నది ఆమె కోరిక' అని తల్లిదండ్రులు చెప్పారు.



తల్లిదండ్రులతో సాయివైశాలి

10 నుంచి 19వ స్థానానికి దిగజారిన జిల్లా

ఉత్తీర్ణతా శాతం 90.07 నుంచి 79.83 కి పడిపోయిన వైనం

ఈ ఏడాదీ అమ్మాయిలే టాప్

బాలికల ఉత్తీర్ణత 83.18, బాలుర శాతం 76.83



పది!! కింద పడి

పదో తరగతి ఫలితాల్లో జిల్లా రాష్ట్రస్థాయిలో 19వ స్థానంలో నిలిచింది. గతేడాది 90.07 శాతం ఉత్తీర్ణతతో రాష్ట్రంలో 10వ స్థానంలో నిలిచిన జిల్లా.. ఈ ఏడాది 79.83 శాతం ఉత్తీర్ణతతో ఏకంగా 9 స్థానాలు దిగజారింది. గతేడాదితో పోల్చితే 10.24 శాతం తక్కువగా ఉత్తీర్ణత నమోదైంది. రాష్ట్ర సగటు ఉత్తీర్ణత 81.14 శాతంకంటే కూడా జిల్లా ఉత్తీర్ణత శాతం తక్కువ కావడం గమనార్హం. గతంలో మాదిరిగానే ఈఏడాది కూడా ఫలితాల్లో బాలుర కన్నా బాలికలు 6.35 శాతం అధికంగా ఉత్తీర్ణత సాధించి తమ ఆధిపత్యాన్ని కొనసాగించారు. గతేడాది బాలుర కంటే 2.38శాతం అధిక ఉత్తీర్ణత సాధించిన బాలికలు ఈ ఏడాది తమ ఉత్తీర్ణతను మరింతగా మెరుగు పరుచుకుని అదనంగా మరో 3.97 శాతం ఉత్తీర్ణతను నమోదు చేశారు.

- తిరుపతి(విద్య)



ప్రభుత్వ బడుల్లో టాపర్లు

జిల్లాలోని ప్రభుత్వ యాజమాన్య పరిధిలోని పాఠశాలల్లో టాపర్లుగా నిలిచిన విద్యార్థుల వివరాలిలా ఉన్నాయి. కలపాటి ఇంద్రజ (ఏపీ ఆర్ఈఐఎస్, వెంకటగిరి) 594, ఎం.సేవిత (జడ్పీహెచ్ఎస్, కోటకాడపల్లె, ఎర్రావారిపాళెం) 591, ఆదేరు వందన (జడ్పీహెచ్ఎస్ మేనకూరు, నాయుడుపేట), ఎ.కేతన్ (ఎంపీఎల్ హెచ్ఎస్, బాబు అగ్రహారం, శ్రీకాళహస్తి) 589, డి.స్నేహశ్రీ సాయి (జీహెచ్ఎస్ పాకాల), కె.చరిష్మ (జడ్పీహెచ్ఎస్, పాలమంగళం) 588, టి.జ్ఞానేశ్వర్ (ఏపీ మోడల్‌స్కూల్, ఎర్రావారిపాళెం) 587, షేక్ సానియా అక్తర్ (జడ్పీహెచ్ఎస్ బాలికలు, వెంకటగిరి), టి.విశ్వనాథ్ (ఎస్వీజీఎన్ఎం హైస్కూల్ తిరుపతి) 586, వి.జి.మహాలక్ష్మి (జడ్పీహైస్కూల్ నారాయణవనం), ఎ.సంప్రీత్ (జడ్పీహెచ్ఎస్, రంగంపేట), చింతా మాధురి (ప్రభుత్వ బాలికల పాఠశాల, తిరుపతి) 585, పి.తనీష్ రాజ్ (జడ్పీహెచ్ఎస్ బాయ్స్, శ్రీకాళహస్తి), మేకల శేఖర్ (జడ్పీహెచ్ఎస్, నెలబల్లి రెట్టపల్లి)854, మూడే కీర్తనా బాయ్ (ఏపీటీడబ్ల్యుఆర్ కళాశాల, శ్రీకాళహస్తి), సి.యమున (జడ్పీపీ బాలికలు, సూళ్లూరుపేట) 583 మార్కులు సాధించారు. వీరితోపాటు మరో ఆరు గురికి 582, ఇద్దరికి 581, ఇంకో ఆరుగురికి 580 మార్కుల రాగా.. 200 మంది ప్రభుత్వ విద్యార్థులు 560కి పైగా మార్కులు పొందారు.

67 పాఠశాలల్లో వంద శాతం

గతేడాది జిల్లాలో 204 పాఠశాలలు వంద శాతం ఉత్తీర్ణత సాధించగా, ఈసారి కేవలం 67 మాత్రమే 100 శాతం ఉత్తీర్ణత సాధించాయి. తిరుపతి అర్బన్ మండలం అత్యధికంగా 90.47 శాతం ఉత్తీర్ణత నమోదు చేయగా పాకాల మండలం అత్యల్పంగా 55.35 శాతం ఉత్తీర్ణత నమోదు చేసింది. ఇక సబ్జెక్టుల వారీగా చూస్తే... తెలుగులో 95.03, హిందీలో 99.66, ఇంగ్లీషులో 97.07, గణితంలో 85.16, జనరల్ సైన్స్‌లో 88.47, సోషల్ స్టడీస్‌లో 93.97 ఉత్తీర్ణత శాతం నమోదైంది.

మేనేజ్‌మెంట్ల వారీగా..

ఏపీ మోడల్ స్కూల్స్‌లో 81.43 శాతం (గతేడాది 96.03 శాతం) ఉత్తీర్ణత సాధించారు. ప్రభుత్వ పాఠశాలల్లో 52.13 శాతం (గతేడాది 82.26).. ఎయిడెడ్ పాఠశాలల్లో 82.14 శాతం (90.78).. బీసీ వెల్ఫేర్ పాఠశాలలు 93.32 శాతం (99.75).. ఏపీఆర్ఈఐఎస్‌లో 93.75 శాతం (98.77).. ఏపీఎస్‌డబ్ల్యుఆర్ఎస్‌లో 86.98 శాతం (95.60).. ఏపీటీఈఆర్ఎస్ పాఠశాలల్లో 74.77 శాతం (83.97).. కేజీబీవీ స్కూల్స్ 83.42 శాతం (85.79).. మున్సిపల్ పాఠశాలలు 64.77 శాతం (81.22).. జిల్లా పరిషత్ పాఠశాలు 66.03 శాతం (83.56).. ప్రైవేట్ అన్ఎయిడెడ్ పాఠశాలలు 94.10 శాతం (98.39) చొప్పున ఉత్తీర్ణత సాధించాయి.

మండలాల వారీగా ఉత్తీర్ణతా శాతమిలా

మండలాల వారీగా ఫలితాలను చూస్తే.. తిరుపతి అర్బన్‌లో అత్యధికంగా 90.47 శాతం.. పాకాలలో అత్యల్పంగా 55.35 శాతం ఉత్తీర్ణత నమోదు చేసింది. ఇక, ఎర్రావారిపాళెంలో 89.35 శాతం, చిల్లకూరు 86.59, ఓజిలి 85.47, ఆర్సీపురం 84.80, కోట 84.54, చిట్టమూరు 83.84, ఏర్పేడు 83.70, నాగలాపురం 83.19, గూడూరు 82.03, శ్రీకాళహస్తి 80.99, చంద్రగిరి 80.46, వెంకటగిరి 79.47, నాయుడుపేట 77.98, సూళ్లూరుపేట 77.96, చిన్నగొట్టిగల్లు 76.85, పుత్తూరు 76.67, డక్కిలి 76.64, వాకాడు75.50, తిరుపతి రూరల్ 73.11, రేణిగుంట 72.99, పిచ్చాటూరు 72.11, పెళ్లకూరు 70.90, కేవీబీ పురం 70.55, బాలాయపల్లి 70.09, తొట్టంబేడు 69.86, దొరవారిసత్రం 69.51, వడమాలపేట 68.87, సత్యవేడు 67.74, తడ 67.31, నారాయణవనం 62.37, వరదయ్యపాళెం 60.00, బీఎన్ కండ్రిగ మండలం 59.94 శాతం చొప్పున ఉత్తీర్ణత సాధించాయి.

బాలికలదే పైచేయి

- మొత్తం పరీక్షలు రాసింది: 26,679 మంది
- ఉత్తీర్ణత సాధించింది: 21,298 (79.83 శాతం)
- బాలురు: 14,063కి 10,804 పాస్ (76.83 శాతం ఉత్తీర్ణత)
- బాలికలు: 12,616కి 10,494 (83.18శాతం)
- ప్రథమ శేణి ఉత్తీర్ణత: 17,630 మంది
- ద్వితీయ శ్రేణి: 2,546 - తృతీయ శ్రేణి: 1,122

ఓపెన్ స్కూల్ టెన్త్‌లో 25.63, ఇంటర్లో 51.32 ఉత్తీర్ణత

తిరుపతి(విద్య), ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): ఏపీ సార్వత్రిక విద్యాపీఠం టెన్త్‌లో 25.63, ఇంటర్‌లో 51.32 శాతం మంది జిల్లా విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. టెన్త్ పరీక్షలకు 913 మంది హాజరుకాగా 234 మంది ఉత్తీర్ణులయ్యారు. రాష్ట్రంలో జిల్లా 13వ స్థానంలో నిలిచింది. ఇంటర్‌లో 2648 మందికిగాను 1359 మంది (51.32శాతం) ఉత్తీర్ణులు కావడంతో జిల్లా 10వ స్థానంలో నిలిచింది.



సేవితకు ప్రోత్సాహకాన్ని అందజేస్తున్న కలెక్టర్ వెంకటేశ్వర్

ఆ పల్లె మురిసింది

- టెన్త్‌లో ఇద్దరు బాలికల ప్రతిభ
- ఒకరిది తిరుపతి జిల్లాలో రెండో స్థానం.. మరొకరు చిత్తూరు జిల్లా టాపర్

ఎర్రావారిపాలెం, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): కోటకాడపల్లె పంచాయతీ తడికించేనుపల్లె. ఇది ఎర్రావారిపాలెం మండలంలో.. ప్రాథమిక వసతులు అంతంతమాత్రంగా ఉండే కుగ్రామం. ఆ ఊరి నుంచి ఇద్దరు బాలికలు పదో తరగతిలో ప్రతిభ చూపారు. వీరిలో సేవిత.. పేద గిరిజన కుటుంబానికి చెందిన బాలిక. కోటకాడపల్లె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదివింది. 591 మార్కులతో ఈమె ప్రభుత్వ పాఠశాలల విభాగంలో.. తిరుపతి జిల్లాలో రెండోస్థానంలో నిలిచింది. ఈమె తల్లిదండ్రులు వ్యవసాయ కూలీలు. సేవితను బుధవారం తిరుపతిలో కలెక్టర్ వెంకటేశ్వర్, డీఈవో కుమార్ సన్మానించారు. ప్రతిభకు పేదరికం అడ్డుకాదని నిరూపించిన ఈమెకు ఎంఈవో సతీష్ బాబు నగదు పారితోషకాన్ని అందజేశారు.



మంజుల

తడికించేను పల్లెకు చెందిన ఊటుకూరు చిరంజీవి కుమార్తె మంజుల చిత్తూరు జిల్లా బైరెడ్డిపల్లె రెసిడెన్షియల్ స్కూల్‌లో చదివింది. 10వ తరగతిలో 590 మార్కులతో చిత్తూరు జిల్లాలో ఈమె టాప్‌లో ఒకరిగా నిలిచింది. ఈ బాలిక తల్లిదండ్రులూ రెక్కాడితేగాని డొక్కాడని వారే.

19 నుంచి సప్లిమెంటరీ పరీక్షలు

సప్లిమెంటరీ పరీక్షలు మే 19 నుంచి 28వ తేదీ వరకు జరగనున్నాయి. గురువారం నుంచి ఈనెల 30వ తేదీలోపు ఫీజు చెల్లించాల్సి ఉంది. రూ.50 అపరాధ రుసుముతో మే నెల ఒకటి నుంచి 18వ తేదీ వరకు ఫీజు చెల్లించే వెసులుబాటు ఇచ్చారు. రీకౌంటింగ్ ఒక్కో సబ్జెక్టుకు రూ.500 కాగా, రీ వెరిఫికేషన్ ఒక్కో సబ్జెక్టుకు రూ.వెయ్యి మొత్తాన్ని మే ఒకటవ తేదీ వరకు ఆన్‌లైన్ ద్వారా చెల్లించవచ్చు.

నాన్నా.. లే నాన్న

- మంచి మార్కులు సాధించా



జశ్వంత్

మృతదేహం వద్ద విలపించిన కుమారుడు

కొడుకు మార్కులు తెలిసి సంబరపడ్డ కాసేపటికే రోడ్డు ప్రమాదంలో దుర్మరణం

శ్రీకాళహస్తి, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): 'నాన్నా.. నీ ముఖంలో నవ్వు కోసం నేను మంచి మార్కులు సాధించా. ఒకసారి లే.. నాన్నా' అంటూ మృతదేహం వద్ద విలపిస్తున్న కుమారుడిని చూసి అందరూ తల్లడిల్లారు. అంతకుముందే.. టెన్త్ ఫలితాల్లో తన కుమారుడికి మంచి మార్కులు వచ్చాయని తెలిసి మంచి బహుమతి తీసివ్వాలంటూ తన మిత్రుడి వద్ద సంబరపడ్డ ఆ తండ్రి.. కాసేపటికే రోడ్డు ప్రమాదంలో దుర్మరణం చెందారు. ఈ విషాద ఘటన శ్రీకాళహస్తి శివారులో చోటుచేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. నాయుడుపేటకు చెందిన ముత్యాలయ్య(42) ట్రాక్టర్ డ్రైవర్. ఈయనకు ఇద్దరు కుమారులు. తన స్థాయికి మించి.. పిల్లలిద్దరినీ కార్పొరేట్ పాఠశాలలో చదివించారు. పెద్దకుమారుడు జశ్వంత్ ఇటీవల టెన్త్ పరీక్షలు రాశాడు. బుధవారం ముత్యాలయ్య ట్రాక్టర్ నడుపుకొంటూ తొట్టంబేడు మండలం లక్ష్మీపురం వచ్చారు. అక్కడి నుంచి వరిపొట్టు లోడుతో మిత్రుడు మస్తాన్‌బాషాతో కలిసి నాయుడుపేటకు బయలుదేరారు. ఇంతలో తన కుమారుడు 545 మార్కులతో టెన్త్ పాసయ్యాడని తెలిసి ముత్యాలయ్య సంబర పడ్డారు. పక్కనే ఉన్న బాషాతో సంతోషం పంచుకున్నారు. తన కుమారుడికి మంచి బహుమతి ఇవ్వడంతోపాటు స్నేహితులకు పార్టీ ఇవ్వాలని చెప్పారు. మార్గమధ్యలో శ్రీకాళహస్తి పట్టణ శివార్లలోని చెన్నై రహదారి పక్కన ట్రాక్టర్‌ను నలిపారు. బాషాతో కలిసి పక్కనే టిఫిన్ చేసేందుకు నిలబడి ఉండగా.. అటుగా వెళుతున్న ఓ ట్రాక్టర్ ముత్యాలయ్యను ఢీకొంది.



ముత్యాలయ్య (ఫైల్ ఫొటో)

ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన ఆయన్ను స్థానికులు సమీపంలోని ప్రైవేటు వైద్యశాలకు తరలించగా, అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. అప్పటి వరకు కుమారుడిని తలచుకుంటూ సంబరపడ్డ ముత్యాలయ్యను గుర్తు చేసుకుంటూ మిత్రుడు విలపించాడు. శ్రీకాళహస్తి రెండో పట్టణ సీఐ వెంకటేశ్వర్లు ఘటనా స్థలానికి చేరుకుని ప్రమాదానికి కారణమైన ట్రాక్టర్‌ను సీజ్ చేసి, డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం శ్రీకాళహస్తి ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి తరలించారు. సమాచారం తెలుసుకున్న ముత్యాలయ్య కొడుకు జశ్వంత్ ఆస్పత్రికి చేరుకుని తండ్రితో ఉన్న అనుబంధాన్ని గుర్తు చేసుకుంటూ విలపించాడు. నాన్నకు ప్రేమతో తన పది పరీక్ష ఫలితాలు అంకితం చేస్తున్నట్లు చెప్పాడు.

కరెంటు పోతే లిఫ్టులో ఇరుక్కోకుండా

తిరుమలలో ఏఆర్డీ విధానం

తిరుమల, ఏప్రిల్23(ఆంధ్రజ్యోతి): తిరుమలలో బహుళ అంతస్తుల భవనాలన్నింటిలోనూ లిఫ్టులకు ఆటోమెటిక్ రెస్క్యూ డివైజ్ (ఏఆర్డీ) ఏర్పాటు చేసేందుకు టీటీడీ సిద్ధమవుతోంది. ఒక అతిథిగృహంలో మంగళవారం కరెంట్ పోవడంతో కడపకు చెందిన ముగ్గురు మహిళలు, ఇద్దరు చిన్నారు 18 నిమిషాల పాటూ లిఫ్ట్‌లో ఇరుక్కుపోయిన సంఘటన నేపథ్యంలో ఏఆర్డీ వ్యవస్థ అన్ని లిఫ్ట్‌ల్లోనూ తప్పనిసరి చేయాలని భావిస్తున్నారు. తిరుమలలో ప్రస్తుతం 7,500పైగా గదులున్నాయి. వీటిలో 80 శాతం భవనాల్లో లిఫ్టులు ఉన్నాయి. సాధారణంగా తిరుమలలో కరెంట్ సరఫరా నిలిచిపోయినప్పుడు 35 నుంచి 40 సెంకడ్లలలో జనరేటర్ ద్వారా విద్యుత్ సరఫరా జరుగుతుంది. అయితే జనరేటర్ ఆన్‌లో ఉన్నప్పుడు గీజర్లు, ఏసీ, లిఫ్ట్ వంటివి పనిచేయవు. ఆ సమయంలో లిఫ్టులు తిరిగి కరెంటు వచ్చేదాకా ఎక్కడున్నవి అక్కడే నిలచిపోతాయి. అటువంటి సందర్భంలో ఏఆర్డీ వ్యవస్థ గనుక ఉంటే సమీప అంతస్థులోకి చేరుకుని లిఫ్ట్ తలుపులు తెరుచుకుంటాయి. టీటీడీ ఈ విధానాన్ని గత మూడేళ్లుగా సన్నిధానం అతిథిగృహంలో వినియోగిస్తోంది. దాతల ఆధ్వర్యంలో నడుస్తున్న అన్ని అతిథిగృహాల్లో ఏఆర్డీ సిస్టమ్‌ను వెంటనే అమలుచేయాలని విద్యుత్ విభాగం అధికారులకు సూచనలు చేశారు. మిగిలిన భవనాల్లోనూ ఏర్పాటుకు టీటీడీ సిద్ధమవుతోంది.



పోలీసు బదిలీల్లో వారు కోరుకున్న ప్రాంతం అడిగి తెలుసుకుని పోస్టింగ్ ఇస్తున్న ఎస్పీ

పోలీసు శాఖలో 393 మంది బదిలీ

- కౌన్సిలింగ్ నిర్వహించి.. ఆప్షన్లు తీసుకుని పోస్టింగులిచ్చిన ఎస్పీ

తిరుపతి(నేరవిభాగం), ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): జిల్లా పోలీసు శాఖలో బుధవారం 393 మందిని బదిలీ చేశారు. దీని కోసం కౌన్సెలింగ్ నిర్వహించి.. సిబ్బంది నుంచి నాలుగేసి ఆప్షన్లు తీసుకున్న ఎస్పీ హర్షవర్ధనరాజు.. అందులో నుంచి ఒక ప్రాంతానికి బదిలీ చేస్తూ అనంతరం ఉత్తర్వులు జారీ చేశారు. జిల్లా పోలీసు కార్యాలయంలో అదనపు ఎస్పీలు రవిమనోహరాచ్చారి, వెంకట్రావు, నాగభూషణం, రామకృష్ణ ఆధ్వర్యంలో ఐదేళ్ల పాటు ఒకే చోట తిష్ట వేసి కూర్చున్న వారికి స్థాన చలనం కలిగించారు. ఉదయం ఏడు గంటలకే జిల్లా నలుమూల నుంచి బదిలీల కోసం దరఖాస్తు చేసుకున్న వారు ఎస్పీ కార్యాలయానికి చేరుకున్నారు. మొదట బదిలీల కోసం దరఖాస్తు చేసుకున్న దాదాపు 27 మంది నుంచి నాలుగు స్టేషన్లు ఆప్షన్లు తీసుకున్నారు. ఇందులో బాగా పనిచేసే వారికి సముచిత స్థానం కల్పించారు. ఇందులో చిత్తూరు జిల్లా నుంచి తిరుపతి జిల్లాలో కలిసిన వారు ముగ్గురు, నెల్లూరు జిల్లా నుంచి వచ్చిన వారు ఐదుగురు, తిరుపతి జిల్లా వారు 19 మంది ఉన్నారు. వీరందరికీ అక్కడికక్కడే బదిలీ ఉత్తర్వులు అందచేశారు. అలాగే వంద మంది హెడ్ కానిస్టేబుళ్ల, 266 మంది కానిస్టేబుళ్లకు కౌన్సెలింగ్ నిర్వహించిన ఎస్పీ వారు కోరుకున్న నాలుగు ఆప్షన్లలో ఉన్న ఖాళీలను బట్టి పోస్టింగ్ కల్పించారు. ఇందులో మెడికల్ గ్రౌండు కింద ఉన్న వారికి పెద్దపీట వేశారు. ప్రస్తుతం బదిలీ చేసిన వారందరూ దాదాపు కోరుకున్న స్థానాలకే బదిలీ కావడంతో పోలీసులు ఆనందం వ్యక్తం చేశారు. ఉదయం 10 గంటలకు ప్రారంభమైన బదిలీల ప్రక్రియ మధ్యాహ్నం రెండు గంటలకు ముగిసింది. ఈ బదిలీల ప్రక్రియలో డీఎస్పీలను భాగస్వామ్యం చేసి వారి వద్ద పనిచేసి ప్రస్తుతం బదిలీ చేస్తున్న వారి పనితీరు, ప్రతిభ తెలుసుకుంటూ వారు కోరుకున్న ప్రాంతాలకు 393 మందిని బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. కొందరు ఎమ్మెల్యేలు, నేతల నుంచి సిఫార్సు లేఖలు తెచ్చిచ్చారు. అయితే ఏఎస్ఐలు, కానిస్టేబుళ్ల కోరుకున్న నాలుగు ప్రాంతల్లోనే ఒక చోటికి ఎస్పీ బదిలీ చేయడంతో వారు కోరుకున్న చోటికే పోస్టింగ్ ఇచ్చినట్లయింది.

WE ARE HIRING

Energetic and passionate educators with fluency in english for the following Subjects are Invited to send your Resume.

OPEN POSITIONS

CBSE SCHOOL

Principal, Teachers For Mathematics, English, Biology.

JUNIOR COLLEGE

Sr. Lecturers in Physics, Chemistry, Mathematics

DEGREE COLLEGE

Computer Science, Arithmetic & Reasoning

ENGINEERING

Professors, Associate Professors, Assistant Professors in the Department of CSE, ECE, AI & DS, EEE.

Experience in the Concern field is desirable.
Interested candidates may apply through e-mail on or
Before 30th APRIL - 2025.

Send Your Resume to Mail : careersvijayam@gmail.com

VIJAYAM

STATE BOARD | CBSE | JUNIOR | DEGREE | HOTEL MANAGEMENT | BUSINESS SCHOOL | Dr.VIIT | VIJAYAM

20-49, Beside Over Bridge, Naidu Buildings, Mittoor, Chittoor. Contact : 08572 - 230145, 230146.
Website : www.vijayam.edu.in Mail : vijayam2000@yahoo.com



తిరుమలలో ప్రారంభమైన భాష్యకారుల ఉత్సవాలు

తిరుమల శ్రీవారి ఆలయంలో భాష్యకారుల ఉత్సవాలు బుధవారం ప్రారంభమయ్యాయి. 19 రోజుల పాటు జరిగే ఈ ఉత్సవాల్లో మే 2న భాష్యకార్ల సాత్తుమొర ఉంటుంది. శ్రీరామానుజులవారు జన్మించిన ఆరుద్ర నక్షత్రాన్ని పురస్కరించుకుని ప్రతి ఏడాదీ శ్రీవారి ఆలయంలో భాష్యకార్ల సాత్తుమొర నిర్వహిస్తారు. మొదటిరోజున బుధవారం ఉదయం శ్రీరామానుజులవారిని బంగారు తిరుచ్చిపై ఆలయ నాలుగు మాడవీధుల్లో ఊరేగింపు నిర్వహించారు. ఈసందర్భంగా జీయంగార్లు దివ్యప్రబంధ గోష్ఠి చేపట్టారు. ఈ కార్యక్రమంలో తిరుమల పెద్ద, చిన్న జీయర్ స్వాములు, ఆలయ అధికారులు పాల్గొన్నారు.

- తిరుమల, ఆంధ్రజ్యోతి

తిరుమల ఘాట్‌లో పల్టీకొట్టిన సుమో



● ఏడుగురికి గాయాలు

తిరుమల మొదటిఘాట్‌రోడ్డులో బుధవారం సుమో బోల్తాపడి ఏడుగురు భక్తులు గాయపడ్డారు. కర్ణాటకకు చెందిన ఓ భక్తబృందం శ్రీవారిని దర్శించుకుని బుధవారం ఉదయం వాహనంలో తిరుమల నుంచి తిరుగు ప్రయాణమయ్యారు. 35వ మలుపు వద్ద సుమో అదుపుతప్పి బోల్తా పడింది. క్షతగాత్రులను తిరుపతిలో రుయాస్పత్రికి తరలించి వైద్యం అందించారు.

- తిరుమల, ఆంధ్రజ్యోతి


సర్వదర్శనానికి 6 గంటలు

తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 6 గంటల సమయం పడుతోంది. బుధవారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్‌2లో 6 కంపార్టుమెంట్లలో సర్వదర్శన భక్తులు, వైకుంఠం క్యూకాంప్లెక్స్‌1లో 3 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు.

సోమవారం హుండీ ఆదాయం: రూ.3.61 కోట్లు

మంగళవారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 61,828

తలనీలాలు సమర్పించినవారు: 21,165





సివిల్స్‌లో సాయి 'తేజ'స్సు

● కోచింగ్ లేకుండానే 154వ ర్యాంకు సాధన

నాయుడుపేట, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): సాధించిన దానితో ఆ యువకుడు సంతృప్తి చెందలేదు. అనుకున్న లక్ష్యం కోసం పట్టుదలతో శ్రమించాడు. నిన్నటి సివిల్స్ ఫలితాల్లో 154వ ర్యాంకుతో మెరిశాడు. నాయుడుపేట మండలం చిలమత్తూరుకు చెందిన నెల్లూరు సాయితేజ. ఈయన తండ్రి శ్రీనివాసులు చిల్లకూరు మండలం గమళ్ళదిబ్బలో ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా, తల్లి సరస్వతి ఓజిలిలో హెల్త్ సూపర్‌వైజరుగా పనిచేస్తున్నారు. వీరు 20 ఏళ్ళ కిందట చిల్లకూరులో స్థిరపడ్డారు.

ఎలాంటి కోచింగూ పొందలేదు

సివిల్ సర్వీసెస్ కోసం ఎలాంటి కోచింగ్ ప్రత్యేకించి తీసుకోలేదు. అంతా ఆన్‌లైన్ ద్వారా మెటీరియల్‌తో ప్రిపేర్ అయ్యాను. ఐఎఫ్ఎస్‌కి ఎంపిక కావాలనేది నా లక్ష్యం. అందుకే గతేడాది సివిల్స్‌లో 558వ ర్యాంకు వచ్చినా మళ్లీ రాశాను. ఈసారి 154వ ర్యాంకు వచ్చింది. అమ్మానాన్న, కుటుంబ సభ్యులు ఈవిషయంలో బాగా ప్రోత్సహించారు.

- నెల్లూరు సాయితేజ, సివిల్స్ 154వ ర్యాంకర్

పట్టువదలని విక్రమార్కుడిలా..

సాయితేజ 1నుంచి 5వ తరగతి వరకు నాయుడుపేట మండలం గొట్టిప్రోలు ఎలిమెంటరీ పాఠశాలలో చదివారు. 6 నుంచి 10 వరకు చిల్లకూరు లిటిల్ ఏంజిల్స్ ఇంగ్లీషు మీడియం స్కూల్‌లో, ఇంటర్మీడియట్ శ్రీచైతన్య(విజయవాడ)లో చదివారు. హైదరాబాదులో బీటెక్ చదివారు. సివిల్ సర్వీసెస్‌కు మంచి ర్యాంకుతో ఎంపిక కావాలని ధ్యేయంగా పెట్టుకున్నారు. ఇందుకోసం కష్టపడి ప్రిపేర్ అయ్యారు. కష్టం ఫలించి గతేడాది 558వ ర్యాంకు పొందారు. అయినప్పటికీ సాయితేజ సంతృప్తి చెందలేదు. పట్టుదల వదలని విక్రమార్కుడిలా ప్రయత్నాన్ని కొనసాగించారు. ఫలితంగా తాజాగా ప్రకటించిన సివిల్స్ ఫలితాల్లో 154వ ర్యాంకు పొందారు. ఈయన భార్య జ్యోతిర్మయి సాఫ్ట్‌వేర్ ఇంజనీరుగా పనిచేస్తున్నారు. తమ్ముడు నెల్లూరు విష్ణుతేజ చెన్నైలో సాఫ్ట్‌వేర్ ఇంజనీరుగా పనిచేస్తున్నారు. సాయితేజకు సివిల్స్‌లో మెరుగైన ర్యాంకు వచ్చిందని తెలియగానే చిలమత్తూరులో ఆనందోత్సాహాలు వెల్లివిరిశాయి.



భార్య, తల్లిదండ్రులతో సాయితేజ

అనుకున్నది సాధించాడు

చిల్లకూరు, ఆంధ్రజ్యోతి: 'మా అబ్బాయి సాయితేజకు ఐఏఎస్ కావాలన్నది లక్ష్యం. గతేడాది 558వ ర్యాంకుతో ఐపీఎస్‌కు ఎంపికయ్యాడు. ఐఏఎస్ కావాలన్న పట్టుదలతో ఈసారి 154వ ర్యాంకుతో అనుకున్నది సాధించాడు' అని సాయితేజ తల్లిదండ్రులు నెల్లూరు శ్రీనివాసులు, సరస్వతి బుధవారం ఆనందం వ్యక్తంచేశారు. తమ కుమారుడు కొన్నేళ్లుగా బీహెచ్ఈఎల్ కంపెనీలో ఇంజనీరుగా పనిచేస్తున్నాడన్నారు. ఐఏఎస్‌గా పేదలకు న్యాయం చేయడమే అతడి ఉద్దేశ్యమని చెప్పారు.

రైల్లో చోరీ చేసి పారిపోతూ... గ్రామస్తులకు పట్టుబడ్డ నంద్యాలవాసి

● పోలీసులకు అప్పగించిన చెంగారెడ్డిపల్లెవాసులు



రైల్లో దొంగతనం చేసి గ్రామస్తులకు పట్టుబడిన దొంగ

రేణిగుంట, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): రైల్లో దొంగతనం చేసి గ్రామస్తులకు పట్టుబడిన నిందితుడిని పోలీసులకు అప్పగించారు. ఈ సంఘటన బుధవారం ఉదయం 2 గంటలకు తిరుపతి జిల్లా రేణిగుంట మండలంలోని చెంగారెడ్డిపల్లెలో జరిగింది. గ్రామస్తులు తెలిపిన వివరాల మేరకు.. మంగళవారం అర్ధరాత్రి గూడూరు నుంచి తిరుపతికి వెళ్తున్న రైలులో బ్యాగును ప్రయాణికుడు చోరీ చేశాడు. బ్యాగుతో రేణిగుంట రైల్వేస్టేషన్ ఔటర్‌లో దిగి పారిపోయే క్రమంలో చెంగారెడ్డిపల్లెలోకి చేరుకున్నాడు. వీధి కుక్కలు పెద్ద ఎత్తున మొరగడంతో గ్రామస్తులు ఒక్కసారిగా మేల్కొన్నారు. దీంతో నిందితుడు ముళ్లపొదల్లో దాక్కున్నాడు. గ్రామస్తులు నిందితుడిని పట్టుకుని దేహశుద్ధి చేశారు. అతని ఆధార్ కార్డు ద్వారా నంద్యాలకు చెందిన హరీష్‌గా గుర్తించారు. చోరీ చేసిన బ్యాగ్‌ను పరిశీలించగా బంగారు నగలు ఉన్నట్టు గుర్తించారు. అయితే అవి రోల్డ్ గోల్డ్ అని తెలుసుకున్నారు. బంగారు నగలు అనుకుని ఆ బ్యాగ్‌ను చోరీ చేసి ఉంటాడని భావించారు. నెం.100కు ఫోన్ చేసి నిందితుడిని అర్బన్ పోలీసులకు అప్పగించారు. చోరీ జరిగింది రైలులో కావడంతో రైల్వే జీఆర్పీ పోలీసులకు నిందితుడిని అప్పగించారు. జీఆర్పీ ఎస్ఐ రవి నిందితుడిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు.

జిల్లాలో ఐదుగురు సీఐల బదిలీ

● వీఆర్‌లో ఉన్న ఇద్దరికి పోస్టింగ్
● ఈస్ట్‌కు శ్రీనివాసులు నియామకం



సీఐ శ్రీనివాసులు

తిరుపతి(నేరవిభాగం), ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఐదుగురు సీఐలను బదిలీ చేస్తూ అనంతపురం రేంజ్ డీఐజీ షిమోషీ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుతం బదిలీ అయిన వారిలో తిరుపతి వెస్ట్‌లో పనిచేస్తున్న రామకృష్ణను సోషల్ మీడియా విభాగానికి నియమించారు. ఈస్ట్ సీఐగా పనిచేస్తున్న జగదీష్‌ను అనంతపురం పీటీసీకి.. జిల్లా ఎస్పీ వీఆర్‌లో ఉన్న మద్దయ్యాచారిని తిరుమల స్పెషల్ బ్రాంచ్‌కు, తిరుపతిలో సోషల్ మీడియాలో సీఐగా పనిచేస్తున్న ఇమ్రాన్ బాషాను భాకరాపేటకు, వీఆర్‌లో ఉన్న కె.శ్రీనివాసులును తిరుపతి ఈస్ట్‌కు నియమించారు. వెస్ట్ పీఎస్‌లో అటాచ్‌మెంటులో సీఐగా పనిచేస్తున్న మురళీమోహన్‌ను అక్కడే రెగ్యులర్ సీఐగా నియమించారు. వీరందరూ తక్షణం వారి వారి స్థానాల్లో బాధ్యతలు తీసుకోవాలని డీఐజీ తన ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

తిరుపతిలో బాలికపై అత్యాచారం

● పోలీసుల అదుపులో ముగ్గురు నిందితులు

తిరుపతి(నేరవిభాగం), ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): తిరుపతిలో బాలికపై ముగ్గురు యువకులు అత్యాచారానికి పాల్పడ్డారు. ఈ మేరకు బుధవారం బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. తిరుపతి నగరానికి చెందిన 16 ఏళ్ల బాలికకు చెర్లోపల్లెకు చెందిన రవికుమార్‌తో పరిచయం వుంది. ఇతను ఫ్లోరింగ్ టైల్స్ పనులు చేస్తున్నాడు. ఇతని స్నేహితులు సింగాలకుంటకు చెందిన సాయికుమార్ ఫోటో ఫ్రేమ్ వర్కు చేస్తున్నాడు. ఈ నెల 17న ఆ బాలిక సాయికుమార్‌తో కలిసి వెళ్లింది. ఇంట్లో కనిపించకపోవడంతో తల్లితండ్రులు వెస్ట్ పీఎస్‌లో ఫిర్యాదు చేశారు. కాగా, చెర్లోపల్లె వద్ద గది తీసుకున్న ముగ్గురు ఆ బాలికపై అత్యాచారం చేసినట్లు బుధవారం బాధితులు ఫిర్యాదు చేయడంతో సీఐ మురళీమోహన్ వెంటనే కేసు నమోదు చేసి నిందితులను అదుపులోకి తీసుకున్నారు. ఈ ఘటనపై విచారిస్తున్నారు. ఈ ఘటనలో సాయికుమార్ స్నేహితుడు ప్రకాశం జిల్లాకు చెందిన రవి సైతం పాల్గొన్నట్లు రుజువు కావడంతో అతడిపైనా కేసు నమోదు చేశారు.

'ఎంఎస్ఎంఈ' పార్కుల అభివృద్ధికి ప్రణాళిక

● ఇంటికొక పారిశ్రామికవేత్తను తయారు చేస్తాం
● ఉమ్మడి జిల్లా అధికారుల సమీక్షలో మంత్రి శ్రీనివాస్



కలెక్టరేట్‌లో అధికారులు, పరిశ్రమలతో మాట్లాడుతున్న మంత్రి కొండపల్లి శ్రీనివాస్

తిరుపతి(కలెక్టరేట్), ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): రెండేళ్లలో అన్ని నియోజకవర్గాల్లో ఎంఎస్ఎంఈ పార్కులు రాబోతున్నాయని, వాటి అభివృద్ధికి ప్రణాళికలు రూపొందించామని సూక్ష్మ, చిన్న, మధ్యతరగతి పరిశ్రమల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ అన్నారు. ఎంఎస్ఎంఈ పార్కులతో అటు పారిశ్రామికాభివృద్ధి, ఇటు నిరుద్యోగ నిర్మూలనకు చర్యలు చేపడుతున్నామన్నారు. కలెక్టరేట్‌లో బుధవారం సాయంత్రం చిత్తూరు ఉమ్మడి జిల్లా అధికారులతో పాటు ఎఫ్ఎస్ఎంఈ, ఫ్యాప్సియో, ఫుడ్ ప్రాసెసింగ్ అసోసియేషన్, టెక్స్‌టైల్ నగరి అసోసియేషన్, ఛాంబర్ ఆఫ్ కామర్స్ ప్రతినిధులతో ఆయన సమీక్షించారు. నెల్లూరు, తిరుపతి, చిత్తూరు జిల్లాల్లో ఎంఎస్ఎంఈలో వృద్ధి సాధిస్తున్నామని వారి కోసం బెస్ట్ పాలసీ తీసుకొస్తామన్నారు. ఔత్సాహికులకు చేయూతనిచ్చి, ఉత్పత్తులను పెంచే దిశగా ఊతమివ్వడం ఉద్యోగ ఉపాధి అవకాశాలు మార్కెటింగ్ సదుపాయాల పెంపు కోసం కృషి చేస్తుందన్నారు. తిరుపతి, చిత్తూరులో పరిశ్రమల అభివృద్ధికి చాలా అవకాశాలు ఉన్నాయన్నారు. ఎంఎస్ఎంఈ పాలసీని తీసుకువచ్చి సింగిల్‌విండో పద్ధతిన అన్ని ఏర్పాటు చేస్తున్నారన్నారు. రాష్ట్రంలో పేదరిక నిర్మూలనకు సీఎం సూచించిన ప్రణాళికల ఆధారంగా కృషి చేస్తున్నామన్నారు. స్వయం సహాయక సంఘాల వారు తీసుకునే రుణాలను జీవనోపాధి వైపు మళ్లించి వ్యాపారవేత్తలుగా తయారుచేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. తద్వారా ప్రతి కుటుంబంలో ఒక పారిశ్రామికవేత్తను తయారు చేయడమే లక్ష్యమన్నారు. అంతకుముందు పరిశ్రమల అసోసియేషన్, చాంబర్ ఆఫ్ కామర్స్ అనేక సమస్యలను మంత్రి దృష్టికి తీసుకొచ్చారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ వెంకటేశ్వర్‌తో పాటు ఎంఎస్ఎంఈ, ఉమ్మడి జిల్లాఅధికారులు పాల్గొన్నారు.

శ్రీసిటీలో ఆక్సిజన్ పరిశ్రమకు భూమిపూజ

పరిశ్రమల ప్రతినిధులతో మంత్రి కొండపల్లి సమావేశం



వరదయ్యపాళెం, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): శ్రీసిటీలో ఎంఎస్ఎంఈ కేటగిరికి చెందిన 'గుప్తా ఆక్సిజన్ ప్రైవేటు లిమిటెడ్'కు బుధవారం రాష్ట్ర ఎంఎస్ఎంఈ, సెర్ప్, ఎన్ఆర్ఐ సాధికారత, సంబంధాలశాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ భూమిపూజ చేశారు. రూ.40కోట్లతో నిర్మిస్తున్న ఈ పరిశ్రమ 2025 అక్టోబరు నాటికి ఉత్పత్తులు ప్రారంభించనుంది. డ్యూ గ్యాస్ పేరిట పారిశ్రామిక గ్యాస్‌ను ఇది ఉత్పత్తి చేస్తుంది. ఏపీ ఆటోమేటిక్ రంగాలకు గ్యాస్ సరఫరా చేయనుంది. ఈ కార్యక్రమంలో మంత్రితోపాటు శ్రీసిటీ ఎండీ రవీంద్ర సన్నారెడ్డి, ఆసంస్థ ఎండీ, సీఈవో ఆనంద గుప్తా తదితరులు పాల్గొన్నారు. అనంతరం మంత్రి శ్రీసిటీ పరిసరాల్లో పర్యటించారు. ఎవర్టన్ టీ పరిశ్రమను సందర్శించారు. 90శాతం పైగా స్థానిక గ్రామీణ మహిళలకు ఉపాధి కల్పిస్తున్న ఎంఎస్ఎంఈ పరిశ్రమ, మహిళా సాధికారత, సమ్మిళిత వృద్ధికి చక్కని నమూనాగా కొనియాడారు. తన పర్యటనలో భాగంగా ఆయన శ్రీసిటీ పరిశ్రమల సీఈవోలతో సమావేశమయ్యారు. పెట్టుబడిదారులకు అనుకూలమైన పర్యావరణ వ్యవస్థ ఏర్పాటుకు డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి కృషి చేస్తున్నట్లు ఆయన అభినందించారు. సీఎం చంద్రబాబు నేతృత్వంలో పీ4 విజన్ పయనం సాగుతోందన్నారు. ఈ కార్యక్రమంలో ఫెడరేషన్ ఆఫ్ స్మాల్ అండ్ మీడియం ఎంటర్‌ప్రైజెస్ ఆఫ్ ఇండియా ప్రెసిడెంట్ ఏపీకే రెడ్డి, తిరుపతి ఛాంబర్ ఆఫ్ కామర్స్ ప్రతినిధులు హాజరయ్యారు. వారితో పాటు ఎంఎస్ఎంఈ కార్పొరేషన్ సీఈవో విశ్వ మనోహరన్, సత్యవేడు ఎమ్మెల్యే ఆదిమూలం, పలు శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఆలత్తూరులో 80 పరిశ్రమలకు భూముల కేటాయింపు

బుచ్చినాయుడుకండ్రిగ, ఆంధ్రజ్యోతి: బుచ్చినాయుడు కండ్రిగ మండలం ఆలత్తూరు ఏపీఐఐసీలో 80 పరిశ్రమలకు భూములు కేటాయించినట్టు రాష్ట్ర సూక్ష్మ, చిన్న మరియు మధ్య తరహా పరిశ్రమల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ తెలిపారు. ఆలత్తూరులో ఏపీఐఐసీ భూములను బుధవారం ఆయన పరిశీలించారు. భూముల రికార్డులను అధికారులు మంత్రికి వివరించారు.

శ్రీనివాస సముదాయంలో క్రీడా వేదికలు ప్రారంభం

తిరుపతి(క్రీడలు), ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): తిరుపతిలోని శ్రీనివాస క్రీడా సముదాయంలో పలు క్రీడా వేదికలను రవాణా, యువజన క్రీడా శాఖా మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి బుధవారం ప్రారంభించారు. ప్రముఖ హాకీ క్రీడాకారుడు మేజర్ ధ్యాన్‌చంద్ విగ్రహాన్ని ఆవిష్కరించారు. పికిల్ బాల్, బాస్కెట్ బాల్, రైఫిల్ షూటింగ్ ఆడుతూ కాసేపు సరదాగా గడిపారు. జమ్మూకశ్మీర్‌లో ఉగ్ర దాడుల్లో మృతిచెందిన పర్యాటకుల ఆత్మశాంతి కోసం మౌనం పాటించారు. దక్షిణాదిన ఎక్కడా లేని విధంగా అత్యాధునిక సౌకర్యాలతో ఇండోర్ స్టేడియం ఏర్పాటు చేసినట్లు మంత్రి చెప్పారు. పేద క్రీడాకారులు ఒలంపిక్స్, ఏషియన్ గేమ్స్‌లో పాల్గొనడానికి వీలుగా ప్రోత్సాహకాలు ఇస్తున్నట్లు వివరించారు. ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు మాట్లాడుతూ ఉద్యోగాల్లో స్పోర్ట్స్ కోటాను 2నుంచి 3శాతానికి పెంచిన ఘనత ఎన్డీఏ ప్రభుత్వానిదేనన్నారు. కలెక్టర్ వెంకటేశ్వర్ మాట్లాడుతూ గ్రామ స్థాయి నుంచి క్రీడాకారులను ప్రోత్సహించేందుకు స్మార్ట్‌సిటీ నిధులతో ఇందిరా మైదానంలో ఇండోర్ స్పోర్ట్స్ కాంప్లెక్స్‌ను ఏర్పాటు చేశామన్నారు. శ్రీనివాస క్రీడా సముదాయంలో మల్టీపర్పస్ స్పోర్ట్స్ ఎరీన, ఎన్టీఆర్ క్రీడా వికాస కేంద్రం ప్రారంభించామన్నారు. గొల్లవానిగుంటలో నిర్మాణ దశలో ఆగిపోయిన క్రికెట్ స్టేడియాన్ని త్వరలో అందుబాటులోకి తెస్తామన్నారు. శాప్ ఛైర్మన్ ఎ.రవినాయుడు మాట్లాడుతూ తిరుపతిని స్పోర్ట్స్ హబ్‌గా తీర్చిదిద్దుతున్నామని తెలిపారు. స్పోర్ట్స్ సిటీ నిర్మాణానికి చర్యలు ప్రారంభించామన్నారు. టీటీడీ కేటాయించిన రూ.కోటి నిధులతో సముదాయంలో మరిన్ని మెరుగైన సదుపాయాలు కల్పిస్తామని తెలిపారు. గుంటూరుకు చెందిన హాట్రిక్ స్పోర్ట్స్ ప్రైవేట్ లిమిటెడ్ ప్రొప్రయిటర్ అండ్ బ్రదర్స్ శ్రీరామ్ క్రీడాకారుల ప్రయోజనార్థం రూ.2 లక్షలతో క్రీడా సామగ్రి అందజేశారు. ఈ కార్యక్రమంలో యాదవ కార్పొరేషన్ ఛైర్మన్, టీడీపీ జిల్లా అధ్యక్షుడు నరసింహయాదవ్, టీటీడీ బోర్డు సభ్యుడు పనబాకలక్ష్మి, మహిళా వర్సిటీ వీసీ ఉమ, మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ, డిప్యూటీ మేయర్లు ముద్రనారాయణ, ఆర్సీ మునికృష్ణ, శ్రీధర్‌వర్మ, మహేష్‌యాదవ్, ఊకా విజయ్‌కుమార్, వరప్రసాద్, డీఎస్‌డీవో సయ్యద్‌సాహెబ్, దాతలు ప్రణీత్, వై.ప్రవీణ్, శ్రీధర్, క్రీడా సంఘాల నాయకులు పాల్గొన్నారు.



ఎన్టీఆర్ క్రీడా వికాస కేంద్రంలో రైఫిల్ షూటింగ్ చేస్తున్న మంత్రి రాంప్రసాద్‌రెడ్డి, ఎమ్మెల్యే ఆరణి, శాప్ చైర్మన్ రవినాయుడు, నాయకులు

ఎస్వీ అన్నప్రసాదం ట్రస్టుకు రూ10లక్షల విరాళం



తిరుపతి, ఏప్రిల్23(ఆంధ్రజ్యోతి) : టీటీడీ ఎస్వీ అన్నప్రసాదం ట్రస్టుకు గుడివాడకు చెందిన ఎన్ఆర్ఐ చల్లగుల్ల సాయిరాజ తరఫున ఆయన తండ్రి ప్రసాద్ రూ.10లక్షలు విరాళంగా అందజేశారు. బుధవారం ఇండోర్ స్టేడియం ప్రారంభోత్సవానికి వచ్చిన టీటీడీ పాలకమండలి సభ్యురాలు పనబాక లక్ష్మికి ప్రసాద్ విరాళం మొత్తాన్ని డీడీ రూపంలో అందజేశారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్, తిరుపతి నగరపాలక సంస్థ డిప్యూటీ మేయర్ ఆర్సీ మునికృష్ణ పాల్గొన్నారు.

స్వల్పంగా ధర తగ్గిన బంగారం

● కాస్త పెరిగిన కొనుగోళ్లు

తిరుపతి(నేరవిభాగం), ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): బంగారం ధరలు స్వల్పంగా తగ్గడంతో తిరుపతిలోని కొన్ని కార్పొరేట్ స్థాయి దుకాణాల వద్ద కొనుగోలుదారుల సందడి కనిపించింది. అదే పెద్ద, చిన్న దుకాణాలు వెలవెలపోతున్నాయి. నిన్నటి వరకు 22 క్యారెట్ల బంగారం గ్రాము 10,200 వరకు పలికింది. అదే బుధవారం మధ్యాహ్నానికి గ్రాముపై రూ 300 తగ్గి రూ.9900 వరకు చేరింది. అదే 24 క్యారెట్ల బంగారం గ్రాము 10,250 నుంచి 9900కు వచ్చింది. దీంతో పెళ్లిళ్లు, ఇతర అవసరాల నిమిత్తం పలువురు బంగారం కొనేందుకు ఆసక్తి చూపారు. తిరుపతి బాలాజీ కాలనీలోని కొన్ని బంగారు దుకాణాల వద్ద బుధవారం మధ్యాహ్నం రెండు గంటల నుంచి కొంత సందడిగా కనిపించింది. అదే బజారు వీధిలోని దుకాణాల వద్ద ఎవరూ లేరు. నగరంలో తిరుపతిలో చిన్నా చితక దుకాణాలు దాదాపు 550 వరకు వున్నాయి. అదే కార్పొరేట్ స్థాయి షాపులు దాదాపు 12 వరకు వున్నాయి. వీటిల్లో రోజుకు గతంలో అయితే రూ ఆరు కోట్లు నుంచి 8 కోట్లు వరకు వ్యాపారం జరిగేదని ప్రస్తుతం బంగారం ధరలు బాగా పెరగడంతో రోజుకు రూ.మూడు కోట్ల వ్యాపారం కూడా జరగడం లేదని దుకాణాల నిర్వాహకులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. 'ఇప్పుడు గ్రాము బంగారంపై రూ.300 మాత్రమే తగ్గింది. ఇది స్థిరంగా ఉండే అవకాశాల్లేవు. పరిస్థితులను బట్టి రానున్న ఆరు నెలల కాలంలో మరింత పెరిగే అవకాశాలున్నాయి' అని బంగారు దుకాణాల సంఘం అధ్యక్షుడు కేవీ సత్యనారాయణ అన్నారు. కాగా, వెండి ధరలు మాత్రం స్థిరంగా కొనసాగుతున్నాయి.



కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహిస్తున్న జనసేన నేతలు

ఉగ్రవాదుల దాడుల్లో మృతిచెందిన పర్యాటకులకు కొవ్వొత్తుల నివాళి

తిరుపతి అర్బన్, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): జమ్ముకశ్మీర్‌లో ఉగ్రవాదుల దాడిలో మృతిచెందిన పర్యాటకులకు బుధవారం తిరుపతిలో కొవ్వొత్తులతో నివాళులర్పించారు. కృష్ణాపురం ఠాణా నుంచి నాలుగుకాళ్ల మండపం వరకు క్యాండిల్ ర్యాలీ నిర్వహించారు. ఉగ్రవాదుల దాడిని ఖండిస్తున్నట్లు ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు తెలిపారు. అంతకు ముందు ఎన్జీవో కాలనీలోని తన కార్యాలయంలో జనసేన పార్టీ జెండాను ఎమ్మెల్యే శ్రీనివాసులు అవనతం చేశారు. కార్యక్రమంలో నరసింహులునాయుడు, ఆర్కాట్ కృష్ణప్రసాద్, సుభాషిణి, బాబ్జి, రాజేష్ ఆచారి, దినేష్‌జైన్, బాలిశెట్టి కిషోర్, లక్ష్మీపతి, మునస్వామి, హేమంత్‌కుమార్, ప్రభాకర్‌రెడ్డి, శిరీష, అక్బర్ పాల్గొన్నారు.

బియ్యం స్టాక్‌లేదు.. డబ్బులిస్తాం తీసుకోండి!

● ఎండీయూ ఆపరేటర్ల నిర్వాకం ● కార్డుదారులకు అందని బియ్యం

సూళ్లూరుపేట, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): ఈనెల బియ్యం స్టాక్ తక్కువగా వచ్చింది.. బియ్యానికి బదులుగా డబ్బులిస్తాం తీసుకోండి.. అంటూ ఎండీయూ వాహనాల ఆపరేటర్లు, డీలర్లు కార్డుదారులను కోరుతున్నారు. తమకు బియ్యమే కావాలని కార్డుదారులు చెప్పినా వినకుండా వేలిముద్ర వేసి చక్కెర, కందిపప్పు తీసుకుని వెళ్లిపోండని ఒత్తిడి చేస్తున్నారు. ఏప్రిల్ నెల పూర్తికావస్తున్నా సూళ్లూరుపేట పట్టణంలో నేటికీ పూర్తిస్థాయిలో రేషన్ బియ్యం పంపిణీ జరగలేదు. రేషన్ షాపుల వద్దకు వెళితే... మాకు సంబంధం లేదు.. ఎండీయూ వాహనాలు వస్తాయి.. అక్కడే తీసుకోండి.. అంటూ ముప్పతిప్పలు పెడుతున్నారు. సూళ్లూరుపేట, తడ, దొరవారిసత్రం మండలాల్లో మొత్తం 121 చౌక దుకాణాల పరిధిలో 47,032 రేషన్ కార్డులున్నాయి. వీరికి నెలనెలా 680 టన్నుల బియ్యం సరఫరా చేస్తారు. మూడు మండలాల్లో జనవరిలో 60శాతం, ఫిబ్రవరిలో 60శాతం, మార్చిలో 70శాతం బియ్యం పంపిణీ జరిగినట్లు రికార్డుల్లో నమోదైంది. మిగిలిన స్టాక్ నిల్వ కింద చూపి తదుపరి నెలకు కేటాయింపులు జరుగుతాయి. ఏప్రిల్ నెలకు డీలర్ల వద్ద స్టాక్ నిల్వలు ఉన్నట్లు రికార్డులు చూపిస్తుండడంతో దాదాపు 30 టన్నుల కోత పడినట్లు అధికారులు చెబుతున్నారు. వచ్చిన బియ్యాన్ని కూడా సక్రమంగా అందించకపోవడంతో కార్డుదారులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రధానంగా సూళ్లూరుపేటకు రెగ్యులర్ సీఎస్ డీటీ లేకపోవడంతో తహసీల్దార్ కార్యాలయంలో డీటీకి ఇన్‌చార్జిగా బాధ్యతలు అప్పగించారు. ప్రజా పంపిణీ వ్యవస్థపై అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో డీలర్లు, ఎండీయూ వాహనాల ఆపరేటర్లు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని, అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కార్డుదారులు కోరుతున్నారు.

సక్రమంగా బియ్యం పంపిణీ చేసేలా చూస్తాం

ఎండీయూ వాహనాల ఆపరేటర్లు, డీలర్లు సక్రమంగా బియ్యం పంపిణీ చేసేలా చర్యలు తీసుకుంటాం. కార్డుదారులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. ఎండీయూ వాహనాల ద్వారా ఇళ్ల వద్దకే బియ్యం అందేలా చూస్తాం, త్వరలోనే డీలర్లతో సమావేశం ఏర్పాటు చేసి సమస్యను చక్కదిద్దుతాం.

- తహసీల్దార్ నరసింహారావు

సముద్రంలోకి తాబేలు పిల్లల విడుదల


సముద్రతీరంలోకి తాబేలు పిల్లలు వదులుతున్న ఫారెస్టు అధికారులు

వాకాడు, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నవాబుపేట సముద్ర తీరంలో బుధవారం ఫారెస్టు అధికారులు ఆలివ్ రిడ్లే తాబేలు పిల్లలను విడుదల చేశారు. ఈసందర్భంగా సూళ్లూరుపేట డీఎఫ్‌వో హారిక మాట్లాడుతూ సూళ్లూరుపేట డివిజన్ అటవీశాఖ, వైల్డ్‌లైఫ్ మేనేజ్‌మెంట్ సంయుక్తంగా 500 ఆలివ్‌రిడ్లే తాబేలు పిల్లలను సముద్రంలోకి విడిచి పెట్టామన్నారు. నవాబుపేట సముద్రతీరంలో తాబేలు గుడ్లను సేకరించి కృత్రిమ విధానంలో పిల్లలను పొదిగించామన్నారు. కార్యక్రమంలో సూళ్లూరుపేట ఆర్డీవో కిరణ్మయి, ఎఫ్ఆర్‌వో నాగేశ్వరరావు, ఫారెస్టు బీట్ ఆఫీసర్లు ఏడుకొండలు, ప్రసన్న కుమార్ సిబ్బంది పాల్గొన్నారు.

మా బిడ్డలను అంతదూరం పంపలేం


ఆందోళన చేస్తున్న పిల్లలు, తల్లిదండ్రులు

పెళ్లకూరు, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): మా బిడ్డలను కిలోమీటర్ల దూరంలో ఉన్న ఆర్లపాడు గ్రామానికి వెళ్లి చదువుకోలేరని, తమ గ్రామంలోనే 3, 4, 5 తరగతులను కొనసాగించాలని అర్థమాల గ్రామానికి చెందిన విద్యార్థుల తల్లిదండ్రులు బుధవారం ధర్నా చేపట్టారు. అర్థమాల ప్రాథమిక పాఠశాలలో 3, 4, 5 తరగతుల విద్యార్థులను సోమవారం నుంచి ఆర్లపాడు గ్రామానికి పంపాలని అధికారులు చెప్పడంతో తల్లిదండ్రులు ఆందోళన చేపట్టారు. గ్రామానికి చెందిన టీడీపీ నేత సుబ్బరామయ్య మాట్లాడుతూ ఎమ్మెల్యే విజయశ్రీ, నియోజకవర్గ ఇన్‌చార్జి నెలవల సుబ్రహ్మణ్యం దృష్టికి తీసుకెళ్లి న్యాయం చేస్తామని హామీ ఇవ్వడంతో ధర్నా విరమించారు.

లింగ నిర్ధారణ చట్టాన్ని పటిష్ఠంగా అమలు చేయాలి


అడ్వైజరీ కమిటీ సభ్యులతో సబ్‌కలెక్టర్ రాఘవేంద్రమీనా

గూడూరు అర్బన్, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): గర్భస్థ లింగ నిర్ధారణ చట్టాన్ని పటిష్ఠంగా అమలు చేయాలని సబ్‌కలెక్టర్ రాఘవేంద్ర మీనా అన్నారు. బుధవారం స్థానిక సబ్‌కలెక్టర్ కార్యాలయంలో గర్భస్థ లింగ నిర్ధారణ చట్టం అమలుపై డివిజన్ స్థాయి అడ్వైజరీ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సబ్‌కలెక్టర్ మాట్లాడుతూ భ్రూణ హత్యలను నివారించాలన్నారు. సమాజంలో స్త్రీ, పురుషులు ఇద్దరూ సమానమేనని, ఆడపిల్లల పట్ల వివక్షత చూపడం మంచిపద్ధతి కాదన్నారు. లింగ నిర్ధారణ చట్టాన్ని ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్ఎం డాక్టర్ పద్మావతి, బాబుసెహ్రారెడ్డి పాల్గొన్నారు.

ఐదో తరగతి వరకు కొనసాగించండి


బుసపాళెం పాఠశాలలో ధర్నా చేస్తున్న విద్యార్థుల తల్లిదండ్రులు

వెంకటగిరి టౌన్, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని బుసపాళెం ప్రాథమిక పాఠశాలలో ఐదవ తరగతి వరకు కొనసాగించాలంటూ బుధవారం విద్యార్థులు ధర్నా చేశారు. విద్యార్థులు తల్లిదండ్రులు మాట్లాడుతూ ఎనిమిదో తరగతి వరకు ఉన్న పాఠశాలను గత ప్రభుత్వం ఐదు వరకు కుదించిందన్నారు. ప్రస్తుత ప్రభుత్వం రెండవ తరగతి వరకు తగ్గించడం తగదన్నారు. 3వ తరగతికి విద్యార్థులు ఆరు కిలోమీటర్లు వెళ్లి చదువుకోవడం కష్టమని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయమై ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ, కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామన్నారు.

పుస్తక పఠనాన్ని విద్యార్థులు అలవర్చుకోవాలి

సూళ్లూరుపేట, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): పుస్తక పఠనంతో విద్యార్థులు జ్ఞానాన్ని పెంపొందించుకోవచ్చునని ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్ఎల్‌బీ శంకర్ శర్మ అన్నారు. స్థానిక వీఎస్ఎస్‌సీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బుధవారం ప్రపంచ పుస్తక దినోత్సవం నిర్వహించారు. పుస్తక పఠనం వల్ల కలిగే ప్రయోజనాలను విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో లైబ్రరీ ఇన్‌చార్జి సుబ్రహ్మణ్యం శాస్త్రి, అధ్యాపకులు శ్రీనివాసులు, ఏడుకొండలు, రమేష్, ప్రసాద్ పాల్గొన్నారు.

బడిఈడు పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించండి


చెంబేడు పాఠశాలలో విద్యార్థులను చేర్పిస్తున్న ఎంఈవో శంకరయ్య

నాయుడుపేట, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): బడిఈడు పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించాలని ఎంఈవో మించల శంకరయ్య చెంబేడు గ్రామస్తులను కోరారు. బుధవారం చెంబేడు గ్రామంలో పిల్లల తల్లిదండ్రులను కలసి ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పిస్తే చదువుతో పాటు కలిగే ప్రయోజనాలను వివరించారు. 1, 4, 5 తరగతుల విద్యార్థులను చెంబేడు ఎంపీపీ పాఠశాలలో చేర్పించారు.కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు శ్రీనివాసులుఉ, ఉపాధ్యాయులు, గున్నమ్మ, రమేష్‌బాబు, అంగన్‌వాడీ వర్కర్ సుజాత పాల్గొన్నారు.

ఉగ్రదాడి హేయమైన చర్య

గూడూరు అర్బన్, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): కశ్మీర్‌లోని పహల్‌గావ్‌లో పర్యాటకులపై ఉగ్రవాదులు దాడిచేసి 28మందిని కాల్చి చంపడం హేయమైన చర్య అని జనసేన ఉమ్మడి నెల్లూరు జిల్లా ఉపాధ్యక్షుడు తీగల చంద్రశేఖర్ అన్నారు. బుధవారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఉగ్రవాదుల దాడిలో మృతిచెందిన వారికి సంతాపంగా జెండా అవనతం చేశారు. కార్యక్రమంలో మోహన్, విజయ్, నాగార్జున, వంశీకృష్ణ, మధుసూదన్‌రావు, సాయికిరణ్, మనోజ్ తదితరులు పాల్గొన్నారు.

రేపటి నుంచి ధర్మరాజస్వామి ఉత్సవాలు

తడ, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని వాటంబేడు కుప్పంలో వెలసిన ద్రౌపదీ సమేత ధర్మరాజస్వామి ఆలయంలో ఈనెల 25వ తేదీ నుంచి ఉత్సవాలు ప్రారంభంకానున్నాయి. శుక్రవారం నుంచి మే 5వ తేదీ సోమవారం వరకు 11 రోజులపాటు బ్రహ్మోత్సవాలు నిర్వహించనున్నారు. 25న మహాకుంభాభిషేకం, ధ్వజారోహణంతో ప్రారంభయ్యే ఉత్సవాలు మే 5వ తేదీ సోమవారం ధర్మరాజుకు పట్టాభిషేకం, శయన సేవతో ముగుస్తాయి. ఇందులో భాగంగా ఈనెల 27వ తేదీ ఆదివారం ద్రౌపదీ కల్యాణం, 29, 30 తేదీల్లో గరుడసేవ, గాంధర్వపర్వం, మే 1న కాలకేయ సంహారం, 4న కురుక్షేత్రం, దుర్యోధన వధ, అగ్నిగుండ ప్రవేశం, తెప్పోత్సవం నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

తంగెళ్లదిబ్బ గిరిజన కాలనీలో తాగునీటి ఎద్దడి

సూళ్లూరుపేట, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని గోపాల్ రెడ్డిపాలెం పంచాయతీ తంగెళ్లదిబ్బ గిరిజన కాలనీలో నీటి ఎద్దడి నెలకొంది. తాగునీటి కోసం గిరిజనులు అవస్థలు పడుతున్నారు. గోపాలరెడ్డిపాలెం నుంచి పైపులైన్ల ద్వారా తంగెళ్లదిబ్బ గిరిజన కాలనీ తాగునీరు అందిస్తున్నారు. పలుచోట్ల పైపులైన్లు పగిలిపోవడంతో తాగునీరు సక్రమంగా అందడం లేదు. అధికారులు దావాదిగుంట గ్రామం నుంచి తాత్కాలికంగా పైపులైన్లకు కనెక్షన్ ఇచ్చి తాగునీరు సరఫరా చేస్తున్నారు. అయితే పైప్‌లైన్ల లీకేజీతో సక్రమంగా నీరు అందడం లేదు. దీంతో కుళాయిల వద్ద లోతుగా గుంతలు తవ్వి చుట్టూ సిమెంట్ వరలు ఏర్పాటు చేసుకున్నారు. అందులో చేరిన నీటిని బిందెల ద్వారా ఇంటికి తీసుకెళ్లి ప్లాస్టిక్ డ్రమ్ముల్లో నిల్వ చేసుకుంటున్నారు. నీళ్లు రానప్పుడు ట్యాంకర్ల ద్వారా నీటిని కొనుగోలు చేయాల్సి వస్తోందని గిరిజనులు చెబుతున్నారు. అధికారులు స్పందించి గిరిజన కాలనీలో తాగునీటి సమస్య పరిష్కరించాలని గిరిజనులు కోరుతున్నారు.


వరల మధ్య గుంతలో నుంచి నీటిని తోడుకుంటున్న గిరిజనులు

టెన్త్ ఫలితాల్లో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల ప్రతిభ


ఉత్తమ ప్రతిభ చూపిన విద్యార్థులు ఎం.శేఖర్(584), యమున(583), వెంకటసూర్య గుణదీప్(582), హనుమంతు(580), ఎస్‌కే.యాసిన్(579), చెంచువందన(578), ప్రజ్ఞతేజ(577), నిఖిలాశ్రీ(575)

చిల్లకూరు, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి పరీక్షల ఫలితాల్లో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు ఉత్తమ ప్రతిభ చూపారు. చిల్లకూరు మండలంలో విద్యార్థులు 84శాతం ఉత్తీర్ణత సాధించారు. నెలబల్లి రెట్టపల్లి జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థి మేకల శేఖర్ 584 మార్కులు సాధించి మండల టాపర్‌గా నిలిచాడు. గురుకుల పాఠశాల విద్యార్థి బి.చరణ్‌తేజ 574 మార్కులు, వరగలి జడ్పీ ఉన్నత పాఠశాలో విద్యార్థి పి.పురుషోత్తం 573 మార్కులతో ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచారు.

గూడూరు: గూడూరు మండలంలో పదో తరగతి విద్యార్థులు 63.43 శాతం ఉత్తీర్ణత సాధించారు. చెన్నూరు జడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన రమ్యశ్రీ 572, భవ్యశ్రీ 570 మార్కులు సాధించి ప్రథమ, ద్వితీయ స్థానాల్లో నిలిచారు. విందూరు పాఠశాలకు చెందిన వెంకటజోత్స్న 569 మార్కులతో తృతీయస్థానంలో నిలిచింది.

కోట: మండలంలోని ప్రభుత్వ పాఠశాలలు, గురుకులాల విద్యార్థులు పదో తరగతి పరీక్ష ఫలితాల్లో సత్తా చాటారు. కోటలోని బీసీ బాలుర గురుకులంలో 108మంది విద్యార్థులకు 104మంది ఉత్తీర్ణత సాధించారు. వెంకటసూర్య గుణదీప్ 582 మార్కులతో టాపర్‌గా నిలిచాడు. చిట్టేడు ఉన్నత పాఠశాలలో 87మందికి 85మంది పాసయ్యారు. చెంచు వందన 578 మార్కులతో టాపర్‌గా నిలిచింది. ఇక గూడలి ఉన్నత పాఠశాల, చిటేడు యానాదుల గురుకుల పాఠశాల నూరుశాతం ఫలితాలు సాధించాయి.

డక్కిలి: మండలంలో పదో తరగతి విద్యార్థులు 76.64 శాతం ఉత్తీర్ణత సాధించారు. డక్కిలి బాలికల గురుకుల పాఠశాల విద్యార్థిని కీర్తన 573, గాయత్రి 568, తీర్థంపాడు జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థి శ్రీనాధ్ 549, డక్కిలి జడ్పీ పాఠశాల విద్యార్థిని సంధ్య 538 మార్కులు సాధించారు. వీరిని ఎంపీడీవో గుణశేఖరరెడ్డి అభినందించారు.

బాలాయపల్లి: మండలంలో పదో తరగతి విద్యార్థులు 70శాతం ఉత్తీర్ణత సాధించారు. నిడిగల్లు పాఠశాల విద్యార్థిని టి.హారిణి 574 మార్కులు సాధించి మండల టాపర్‌గా నిలిచింది. బాలాయపల్లి పాఠశాలకు చెందిన కే.అరుణ్‌కుమార్ రెడ్డి 544 మార్కులు, వెంగ మాంబపురం పాఠశాలకు చెందిన కే.రవళి 523 సాధించారు.

వెంకటగిరి టౌన్: మండలంలో పదో తరగతి విద్యార్థులు 80.64 శాతం ఉత్తీర్ణత సాధించారు. బాలికల ఉన్నత పాఠశాలకు చెందిన సానియా అక్తర్ 586 మార్కులు, ఏపీ మోడల్ స్కూల్ విద్యార్థి హనుమంతు 580 మార్కులు సాధించారు.

ఓజిలి: మండలంలో పదో తరగతి విద్యార్థులు 84 శాతం ఉత్తీర్ణత సాధించారు. చిల్లమానుచేను జడ్పీ పాఠశాలకు చెందిన ఓజిలి ప్రజ్ఞతేజ (577) మండల స్థాయిలో ప్రథమస్థానంలో నిలిచింది. అదేవిధంగా ఓజిలి జడ్పీ పాఠశాలకు చెందిన పటాన్ పయిజ్యా(572), తురకా శ్రీహరి(558) ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచారు. విద్యార్థులను ఎంఈవో శైలజ అభినందించారు.

తడ: మండలంలో పదో తరగతి విద్యార్థులు 67శాతం ఉత్తీర్ణత సాధించారు. పి.వర్షిణి 567 మార్కులతో మొదటి స్థానం సాధించగా పి.మేఘన, ఎస్.వర్షిత 565 మార్కులతో ద్వితీయ స్థానం సాధించారు. 553 మార్కులతో పి.కమలకుమారి తృతీయ స్థానంలో నిలిచారు.

నాయుడుపేట టౌన్: మండలంలో పదో తరగతి విద్యార్థులు 64 శాతం ఉత్తీర్ణత సాధించారు. మేనకూరు జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థిని ఆడేరు వందన(589) ప్రథమస్థానం, అదే పాఠశాలకు చెందిన ఎస్‌కే యాసిన్ (579), పుదూరు జడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన పి.సుమ (579) ద్వితీయ స్థానం, మేనకూరు జడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన కె.హంసశ్రీ (574) తృతయ స్థానం సాధించారు. వీరిని ఎంఈవో మునిరత్నం, ఉపాధ్యా యులు అభినందించారు.

పెళ్లకూరు: మండలంలో పదో తరగతి విద్యార్థులు సత్తా చాటారు. మొత్తం 71.4 శాతం మంది ఉతీర్ణత సాధించారు. మండలంలోని తాళ్వాయిపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థిని పి.నిఖిలాశ్రీ 575 మార్కులతో మండల టాపర్‌గా నలిచింది. శిరసనంబేడు జడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన బి.హిందూప్రియ 560 మార్కులు, పాలచ్చూరు జడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన సీహెచ్.సునీత 559 మార్కులతో ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచారు.

దొరవారిసత్రం: పదో తరగతి ఫలితాల్లో దొరవారిసత్రం మండల విద్యార్థులు 69.8 శాతం ఉత్తీర్ణత సాధించారు. దొరవారిసత్రం కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం విద్యార్థిని కె.రజిత 561 మార్కులతో మండల టాపర్‌గా నిలిచింది. శ్రీధనమల్లి జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థిని కె.నిర్విజ్ఞ 560 మార్కులతో ద్వితీయ స్థానంలో నిలిచింది.

చిట్టమూరు: మండలంలోని పదో తరగతి విద్యార్థులు 85 శాతం ఉత్తీర్ణత సాధించారు. మెట్టు జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థిని సింధు 577 మార్కులు సాధించి మండల టాపర్‌గా నిలిచింది.

సూళ్లూరుపేట: పది ఫలితాల్లో సూళ్లూరుపేట జడ్పీ బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థినులు సత్తాచాటారు. సి.యమున 583మార్కులు సాధించి ప్రథమ స్థానంలో నిలిచింది. ఎస్.హిమ హస్విని 573, షేక్ సమీరా 563 మార్కులతో ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచారు.

టీడీపీకి సర్వోత్తమరెడ్డి రాజీనామా


రాజీనామా పత్రాన్ని చూపుతున్న సర్వోత్తమరెడ్డి

కోట, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): కోట మండల టీడీపీ అధ్యక్షుడు మద్దాలి సర్వోత్తమ రెడ్డి రాజీనామా చేశారు. కోటలోని రవినగర్‌లో గల ఆయన నివాసంలో మీడియాతో మాట్లాడారు. బుధవారం టీడీపీ మండల అధ్యక్ష పదవితో పాటు పార్టీ సభ్యత్వానికి రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు. తన రాజీనామా పత్రాన్ని ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్, తిరుపతి పార్లమెంట్ అధ్యక్షుడు నరసింహ యాదవ్, రాష్ట్ర పార్టీ అధ్యక్షుడు పల్లా శ్రీనివాస్, మంత్రి నారా లోకేశ్, సీఎం చంద్రబాబుకు ఫ్యాక్స్ ద్వారా పంపినట్లు సర్వోత్తమరెడ్డి తెలిపారు. రెండు దశాబ్దాలుగా టీడీపీలో కొనసాగుతున్న తాను మండలంలో పార్టీ బలోపేతానికి ఎంతో కృషి చేశానని, ప్రస్తుతం వ్యక్తిగత కారణాలు, వ్యాపారాల దృష్ట్యా రాజీనామా చేస్తున్నానని, దీనివెనుక ఎలాంటి ఒత్తిళ్లు, ఎవరి ప్రమేయం లేదని చెప్పారు. తన భవిష్యత్ నిర్ణయాన్ని త్వరలో ప్రకటిస్తానని సర్వోత్తమరెడ్డి తెలిపారు.

మద్యం బాటిళ్ల స్వాధీనం

దొరవారిసత్రం, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆనేపూడిలో గ్రామంలో బెల్టు షాపుపై మంగళవారం రాత్రి ఎస్ఐ అజయ్‌కుమార్ సిబ్బందితో కలిసి దాడి చేశారు. 9 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకుని నిర్వాహకుడు శ్రీనివాసులును అరెస్టు చేశారు.

ఎంఈవోకు సన్మానం


మునిశేఖర్ దంపతులను సత్కరిస్తున్న ఉపాధ్యాయులు

దొరవారిసత్రం, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): దొరవారిసత్రం ఎంఈవో శెట్టిపల్లి మునిశేఖర్ పదవీ విరమణ పొందారు. బుధవారం మండలం పరిషత్ సమావేశ మందిరంలో మునిశేఖర్ దంపతులను ఉపాధ్యాయ సంఘాల ఆధ్వర్యంలో సన్మానించారు. అలాగే ఎంపీడీవో గోవర్ధన్, వైస్‌ఎంపీపీ గోపాలరెడ్డి ఎంఈవోను సత్కరించారు.

ఉగ్రదాడిని నిరసిస్తూ కొవ్వొత్తుల ర్యాలీ


సూళ్లూరుపేటలో కొవ్వొత్తులతో నిరసన

సూళ్లూరుపేట, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): కశ్మీర్‌లో ఉగ్రవాదుల మారణకాండకు ఖండిస్తూ బుధవారం రాత్రి సూళ్లూరుపేటలో కొవ్వొత్తులతో నిరసన తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ పట్టణాధ్యక్షుడు అత్తిరాల కిరణ్‌కుమార్ గౌడ్, బెజవాడ విజయలక్ష్మి, బవజాన్, నారాయణ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కోట: కశ్మీర్ సమీపంలో పహల్‌గావ్‌లో ఉగ్రవాదుల మారణకాండను ఖండిస్తూ కోట పట్టణంలో బుధవారం రాత్రి బీజేపీ నాయకులు కొవ్వొత్తులతో నిరసన తెలిపారు. ఉగ్రవాదుల దాడితో మృతిచెందిన యాత్రికుల ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు.

బైక్ ఢీకొని ఒకరి మృతి

కోట, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): కోట మండలం మైక్రో టవర్ కాలనీ వద్ద బైక్ ఢీకొన్న ఘటనలో నెల్లూరు నేతాజీనగర్‌కు చెందిన శివకుమార్(40) మృతి చెందాడు. బుధవారం కోట నుంచి నెల్లూరుకు కారులో వెళుతున్న శివకుమార్ మైక్రోటవర్ కాలనీ వద్ద మూత్ర విసర్జన కోసం ఆపి కిందకు దిగాడు. అదే సమయంలో చిట్టమూరు మండలం మెట్టుకు చెందిన యువకుడు బైక్‌లో గూడూరు వైపు వెళుతూ శివకుమార్‌ను ఢీకొన్నాడు. ఈ ప్రమాదంలో శివకుమార్ మృతి చెందాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ పవన్‌కుమార్ తెలిపారు.

కారు ఢీకొని మరొకరు..

దొరవారిసత్రం, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): దొరవారిసత్రం మండలం నెలబల్లి కూడలిలో జాతీయ రహదారిపై కారు ఢీకొనడంతో అదే గ్రామానికి చెందిన పున్నేపల్లి పోలయ్య(55) దుర్మరణం చెందాడు. పోలయ్య రోడ్డు దాటుతుండగా చెన్నై నుంచి విజయవాడ వెళ్తున్న కారు ఢీకొంది. దీంతో పోలయ్య అక్కడికక్కడే మృతి చెందాడు. ఎస్ఐ అజయ్‌కుమార్ ఘటనాస్థలాన్ని పరిశీలించారు. మృతదేహానికి నాయుడుపేట ప్రభుత్వాస్పత్రిలో పోస్టుమార్టం చేయించి కుటుంబ సభ్యులకు అప్పగించారు. ప్రమాదానికి కారణమైన కారు ఆగకుండా వెళ్లిపోయింది. సీసీ ఫుటేజ్‌ల ఆధారంగా నాయుడుపేట సమీపంలో కారును పట్టుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

ఉపాధ్యాయ వృత్తికి రిటైర్‌మెంట్ లేదు


ఉపాధ్యాయురాలిని సన్మానిస్తున్న ఎంఈవో మస్తానయ్య, ఉపాధ్యాయ సంఘ నేతలు

కోట, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): సమాజంలో ఉపాధ్యాయ వృత్తికి ఉన్నత స్థానముందని, ఉపాధ్యాయుడికి రిటైర్‌మెంట్ లేదని ఎంఈవో మస్తానయ్య అన్నారు. కోట మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం దైవాలదిబ్బ పాఠశాలలో ఉపాధ్యాయురాలిగా పనిచేస్తున్న ఉషాకుమారి, గూడలి ఉన్నత పాఠశాలలో తెలుగు పండిట్‌గా పనిచేస్తున్న వెంకటరత్నం పదవీ విరమణ సభ జరిగింది. యూటీఎఫ్, పీఆర్‌టీయూ, బీటీఏ, ఎస్‌టీయూ నేతలు ఉపాధ్యాయులను షీల్డ్‌లు, మెమొంటోలతో సత్కరించారు.

విద్యార్థినికి అభినందన

గూడూరు, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): పదో తరగతి ఫలితాల్లో పట్టణంలోని శ్రీచైతన్య పాఠశాల విద్యార్థి సాయివైశాలి 598 మార్కులు సాధించి రాష్ట్రస్థాయిలో మూడో స్థానంలో నిలిచింది. ఆమెను ప్రిన్సిపాల్ శ్రీనివాసులుతో పాటు ఉపాధ్యాయులు, సిబ్బంది సన్మానించారు.


సాయివైశాలిని అభినందిస్తున్న ప్రిన్సిపాల్ శ్రీనివాసులు

విద్యార్థినికి కలెక్టర్ అభినందన


వందనను అభినందిస్తున్న కలెక్టర్ వెంకటేశ్వర్

నాయుడుపేట, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి ఫలితాల్లో నాయుడుపేట మండలం మేనకూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థిని ఆడేరు వందన(589) మార్కులతో జడ్పీ ఉన్నత పాఠశాలల్లో జిల్లాలో ద్వితీయ స్థానంలో నిలిచారు. వందనను కలెక్టర్ వెంకటేశ్వర్, డీఈవో కుమార్, ఎంఈవో మునిరత్నం, ఉపాధ్యాయులు అభినందించారు.

రాయితీ రుణాలకు దరఖాస్తుల స్వీకరణ

బాలాయపల్లి, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): మండలంలోని బాలాయపల్లి, జయంపు కెనరా బ్యాంకు పరిధిలో ఎస్సీలు రాయితీ రుణాలకు వచ్చే నెల 10వ తేదీ లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీవో వినీల్‌కుమార్ కోరారు.

చట్టప్రకారం నష్టపరిహారం అందించాలి


సబ్‌కలెక్టర్ రాఘవేంద్రమీనాకు వినతిపత్రం ఇస్తున్న సీపీఎం నాయకులు

గూడూరు, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): కోట మండలం కొత్తపట్నం గ్రామంలో క్రిస్ సిటీ భూములకు సంబంధించి రైతులకు చట్టప్రకారం నష్ట పరిహారం అందించాలని సీపీఎం నాయకులు అన్నారు. బుధవారం సబ్ కలెక్టర్ రాఘవేంద్ర మీనాకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీపీఎం నాయకులు మాట్లాడుతూ కోట మండలం కొత్తపట్నంలో రైతులు సాగు చేసుకుంటున్న వేరుశనగ పంటను ధ్వంసం చేయడం సబబు కాదన్నారు. నష్టపోయిన రైతులకు పరిహారం అందించాలని కోరారు. కార్యక్రమంలో జోగి శివకుమార్, బీవీ మణయ్య, శంకరయ్య, ప్రసాద్, చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నియమాలు పాటించాలి

వెంకటగిరి టౌన్, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): ప్రజలు ట్రాఫిక్ నియమాలు పాటించాలని గూడూరు డీఎస్పీ గీతాకుమారి అన్నారు. బుధవారం పట్టణంలోని పలు ప్రాంతాల్లో ఆమె వాహనాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ ప్రజలకు ఇబ్బంది కలిగించే విధంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని సూచించారు. కార్యక్రమంలో సీఐ రమణ, ఎస్ఐ సుబ్బారావు, సిబ్బంది పాల్గొన్నారు.

ఇంటర్ Bi.P.C విద్యార్థులకు సువర్ణావకాశం...
BOLLINENI COLLEGE OF NURSING
Approved by Indian Nursing Council, New Delhi.
ధనలక్ష్మీపురం, నెల్లూరు. 9866881342 / 9177619655
B.Sc. NURSING 2024-25 అడ్మిషన్లు
కోర్సు వ్యవధిలో మీరు ఫీజు చెల్లించనవసరం లేదు.
కోర్సు పూర్తయిన తర్వాత ఉద్యోగ అవకాశం కల్పిస్తాము.
మీ జీతంలో నుంచి వాయిదాల పద్ధతిలో ఫీజును చెల్లించుకొనవచ్చును.
For A.Y. 2023-24 Inter (Bi.P.C) pass out Students last chance to admit AY 2024-25
Website : www.bollinenicollegeofnursing.com
Last Date 26.04.2025 Limited Seats!
• 8.25 acars Greenish Campus • Highly Qualified Faculty